



ESTD: 1999

www.voodayam.com

# వుదయం






ఆదిలాబాద్ | 09-10-2026 శుక్రవారం | సంపుటి : 14 | సంచిక :29 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on



### జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ఆదాయానికి

# గండి కొట్టొద్దు

**నిజాయితీపరులకు వెసులుబాటు..**
**ఎగవేతదారులపై ఉక్కుపాదం మోపాలని కేంద్రానికి వినతి**

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 08 (వుదయం ప్రతినిధి ):** జీఎస్టీ సంస్కరణలు చేపట్టే క్రమంలో రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలు దెబ్బ తినకుండా పటిష్ఠ రక్షణ కల్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్రాన్ని కోరారు. 57వ జీఎస్టీ కౌన్సిల్ భేటీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నిజాయితీగా పన్నులు కట్టేవారికి విధానాలను సులభతరం చేస్తూనే, ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. తెలంగాణ సొంత పన్నుల రాబడిలో జీఎస్టీ వాటా 35 శాతమని, మోటారు వాహనాలు, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌పుట్ సర్వీసుల రీఫండ్లలో ప్రతిపాదిత మార్పుల వల్ల రాష్ట్రానికి ఏటా రూ.800 కోట్లకుపైగా నష్టం వాటిల్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవానికి ఈ ప్రభావం రెట్టింపుకంటే ఎక్కువే ఉండే అవకాశముందని, ఈ ఆదాయం తగ్గితే సంక్షేమం, అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడుతుందని గుర్తుచేశారు.

**నకిలీలపై కొరడా..**

**హైదరాబాద్‌లో ప్రాంతీయ కేంద్రాలు**

పేదలు, వృద్ధులు, దినసరి కూలీల ఆధార్, పాన్ వివరాలను దుర్వినియోగం చేస్తూ నకిలీ రిజిస్ట్రేషన్లతో ఐటీసీ కొల్లగొడుతున్న ముఠాలపై ఉక్కుపాదం మోపాలని భట్టి డిమాండ్ చేశారు. నగదు లావాదేవీలతో నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టిస్తున్న స్క్రాప్ రంగాన్ని ప్రక్షాళన చేయడంతో పాటు గుర్తింపు చౌర్యంపై దృష్టి సారించేందుకు ప్రత్యేకంగా మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సాంకేతికత, ఏఐ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా ఉన్న హైదరాబాద్‌లో జీఎస్టీ కౌన్సిల్ సచివాలయం, జీఎస్టీఎన్ ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. అత్యధిక పన్నులు సమకూర్చే తెలంగాణకు జీఎస్టీ కౌన్సిల్ కమిటీల్లో సముచిత స్థానం కల్పించాలని, సరుకు రవాణా వాహనాల తనిఖీ అధికారం మూల, గమ్యస్థాన రాష్ట్రాలు రెండింటికీ ఉండాలని స్పష్టం చేశారు.

## విదేశీ పార్లమెంటరీ విధానాల అధ్యయనంతో

# ప్రజాస్వామ్యం మరింత బలోపేతం

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**హైదరాబాద్, అక్టోబర్ 7 (వుదయం)** ప్రపంచ దేశాల్లోని ప్రజాస్వామ్య వ్యవస్థలు, పార్లమెంటరీ పనితీరుపై లోతైన అధ్యయనం చేయడం వల్ల శాసనసభల నిర్వహణలో కొత్త విధానాలను ఆకలింపు చేసుకునే వీలు కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి (స్పీకర్) శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ అధ్యయన యాత్రలో భాగంగా తెలంగాణ ప్రజాప్రతినిధుల బృందం గురువారం స్విట్జర్లాండ్‌లోని బెర్న్ నగరంలో ఉన్న చారిత్రాత్మక పార్లమెంట్ భవనాన్ని సందర్శించింది. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ తో పాటు శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ శ్రీ బండ ప్రకాష్ పర్యటించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య సౌధంలో శాసనసభలు అత్యంత కీలకమైన భాగమని గుర్తుచేశారు. ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా చట్టాలు రూపొందించడం, ప్రభుత్వ విధానాలపై సమగ్రంగా చర్చించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గాలు అన్వేషించడమే ప్రజా ప్రతినిధుల ముఖ్య బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. వివిధ దేశాల్లో అమలులో ఉన్న పార్లమెంటరీ పద్ధతులు, ప్రజాస్వామ్య సంప్రదాయాలు, చట్టాల తయారీ విధానాలు, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన పెంచుకోవడానికి ఇటువంటి విదేశీ అధ్యయన పర్యటనలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ శ్రీ బండ ప్రకాష్ తో పాటు శాసనసభ కార్యదర్శి శ్రీ రెండ్ల తిరుపతి, శాసనమండలి కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, స్పీకర్ ప్రత్యేక అధికారి శ్రీ వెంకటేష్ తదితర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని హత్య

# చేసేందుకు కుట్ర: రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ఎఎంఎస్) :** ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు దేశ రాజధానిలో నిరసనకు దిగారు. ఆందోళనలో భాగంగా విపక్ష ఎంపీలంతా తొలుత రాజ్‌ఘాట్‌కు చేరుకుని మహాత్మాగాంధీకి నివాళులు అర్పించారు. అనంతరం ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ..సుమారు 300 మంది ఎంపీలతో కలిసి ప్రశాంతంగా నిరసన చేపట్టాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. తొలుత ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లకుండా తమను అడ్డుకున్నారని, అనంతరం జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టేందుకు అనుమతి కోరినా ప్రభుత్వం అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడి చేశారని, అందుకు బాధ్యులైన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్, ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కలిసి కుట్ర పన్నుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు.

# సింగరేణిపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం: హరీశ్ రావు

**సింగరేణి కార్మికుల సమస్యలపై రామగుండంలో భారీ సభ**



**హైదరాబాద్, అక్టోబర్ 7 (వుదయం)** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈ నెల 14న బుధవారం రామగుండంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. ఈ సభకు 'సింగరేణి కార్మిక గర్జన'గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి సంస్థ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని ఆరోపించారు. కార్మికుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధికారులు సైతం రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి కార్మికులకు న్యాయం జరిగేలా చూడటమే 'సింగరేణి కార్మిక గర్జన' ప్రధాన ఉద్దేశమని హరీశ్ రావు తెలిపారు. సింగరేణి లాభాలను వెంటనే ప్రకటించి, అందులో కార్మికులకు రావాల్సిన పూర్తి వాటాను అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## ఎనిమిది ఐటీ దిగ్గజాలకు

# అమెరికా షాక్

**వాషింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఎనిమిది ఐటీ దిగ్గజ సంస్థలకు అమెరికా ప్రభుత్వం షాక్ ఇచ్చింది. మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, క్యాప్‌జెమినీ, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, అడోబ్ సంస్థలకు సంబంధించిన శాశ్వత కార్మిక ధ్రువపత్రాల ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ సంస్థల తరఫున హెచ్ 1బీ వీసాపై అమెరికాకు వెళ్లే ఉద్యోగులకు భవిష్యత్తులో శాశ్వత నివాస హక్కు కోసం దరఖాస్తు చేసుకునే మార్గం క్లిష్టంగా మారనుంది.

## ఇంతే కదా...!




# వికసిత్ భారత్ దిశగా పౌల్ట్రీ పరిశ్రమ

**నవంబరు 25 నుంచి హైదరాబాద్‌లో 18వ 'పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో–2026'**
**హైటెక్స్‌లో మూడు రోజుల పాటు ప్రదర్శన..**
**24న 'నాలెడ్జ్ డే' సదస్సు**
**గుడ్ల ఉత్పత్తిలో భారత్‌కు అంతర్జాతీయంగా రెండో స్థానం**
**దిల్లీలో ఎక్స్‌పో వివరాలు వెల్లడించిన ఐపీఈఎంఏ ప్రతినిధులు**



**న్యూ ఢిల్లీ అక్టోబర్ 08 ( వుదయం ప్రతినిధి ):** దేశీయ పౌల్ట్రీ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 18వ 'పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో-2026'కు హైదరాబాద్ నగరం వేదిక కానుంది. నవంబరు 25 నుంచి 27 వరకు మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ మహా ప్రదర్శన జరగనుంది. ఈ మేరకు గురువారం దిల్లీలోని 'ది పార్క్' హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) ప్రతినిధులు వివరాలు వెల్లడించారు.

ఎక్స్‌పో ప్రారంభానికి ముందురోజు, నవంబరు 24న హెచ్ఐసీసీ–నోవోటెల్‌లో 'నాలెడ్జ్ డే' పేరుతో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు. కోళ్ల ఆరోగ్యం, దాణా నిర్వహణ, బయోసెక్యూరిటీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పౌల్ట్రీ రంగంలో సుస్థిర పద్ధతులపై నిపుణులు విస్తృతంగా చర్చించనున్నారు. అనంతరం 25 నుంచి 27 వరకు రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎగ్జిబిషన్ సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో 550కి పైగా సంస్థలు తమ ఉత్పత్తులు, సేవల స్టాళ్లను ఏర్పాటు చేయనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల నుంచి సుమారు 51 వేల మందికి పైగా పరిశ్రమ ప్రతినిధులు, పౌల్ట్రీ రైతులు, బ్రీడర్లు, పశువైద్యులు, పరిశోధకులు హాజరుకానున్నారు. జన్యు సాంకేతికత, అత్యాధునిక హేచరీలు, ఫార్మ్ ఆటోమేషన్, పౌల్ట్రీ షెడ్లు, వెంటిలేషన్ వ్యవస్థలు, వ్యాధి నిర్ధారణ పరికరాలు, గుడ్ల ప్రాసెసింగ్, వ్యర్థాల నిర్వహణ వంటి విభాగాల్లో సరికొత్త ఆవిష్కరణలను ఇక్కడ ప్రదర్శించనున్నారు. ఐపీఈఎంఏకు ఇప్పటికే 20కి పైగా అంతర్జాతీయ సంఘాలు, 40 జాతీయ స్థాయి సంస్థలతో భాగస్వామ్యం ఉందని నిర్వాహకులు తెలిపారు.

దేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 142.77 బిలియన్ గుడ్లు ఉత్పత్తి కాగా, భారత్ అంతర్జాతీయంగా రెండో స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. బ్రాయిలర్ మాంసం ఉత్పత్తిలోనూ ప్రపంచంలోనే తొలి నాలుగు స్థానాల్లో ఒకటిగా నిలిచిందని ఐపీఈఎంఏ పేర్కొంది. గతేడాది సుమారు 35 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో జరిగిన ఎక్స్‌పోలో 500కు పైగా సంస్థలు, 51,251 మంది ప్రతినిధులు పాల్గొన్నట్లు వివరించింది. "రాబోయే రోజుల్లో పౌల్ట్రీ పరిశ్రమలో అనేక సంస్కరణలు, ఆధునిక పోకడలు రానున్నాయి. యువత ఈ రంగంలో విస్తరిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పౌల్ట్రీ ఇండియా అధ్యక్షులు ఉదయ్ సింగ్ బయాస్ పిలుపునిచ్చారు.

# అరచేతిలోకి ప్రభుత్వ సేవలు: నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ఎఎంఎస్) :** ఒకప్పుడు కేవలం ఫోన్ సంభాషణలు, సందేశాల పంపిణీకే పరిమితమైన మొబైల్ ఫోన్.. ప్రస్తుతం సుపరిపాలనకు వారధిగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల అరచేతిలోకి తీసుకురావడంలో మొబైల్ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. గురువారం జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2026లో ప్రసంగించిన నరేంద్ర మోదీ.. దేశంలో డిజిటల్ ప్రయాణం సాధించిన పురోగతిని వివరించారు. ఐదో తరం మొబైల్ సేవల విస్తరణతో దేశంలో ఇంటర్నెట్ వేగం గణనీయంగా పెరిగిందని మోదీ తెలిపారు. ప్రస్తుతం ప్రతి జిల్లాలో ఐదో తరం అనుసంధాన సదుపాయం అందుబాటులోకి వచ్చిందన్నారు. మొబైల్ సాంకేతికత కారణంగా ప్రయాణ సమయం, నిరీక్షణతో పాటు ఖర్చులు కూడా తగ్గాయని చెప్పారు.

## వ్యాపారులకు భారీ ఊరట.. జీఎస్టీలో అరెస్టుల రద్దు,

# రూ.5 కోట్లకు పెరిగిన ప్రాసిక్యూషన్ పరిమితి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ఎఎంఎస్) :** జీఎస్టీ నిబంధనల అమలులో పన్ను చెల్లింపుదారులు, వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక ఊరటనిచ్చింది. పన్ను ఎగవేత కేసుల్లో జీఎస్టీ అధికారులకున్న అరెస్టు అధికారాలను (సెక్షన్ 69) పూర్తిగా రద్దు చేయాలని 57వ జీఎస్టీ కౌన్సిల్ సిఫార్సు చేసింది. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన గురువారం దిల్లీలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో సవివరంగా వెల్లడించింది.

**ప్రాసిక్యూషన్, జరిమానాల్లో ఊరట**

పన్ను ఉల్లంఘన కేసుల్లో క్రిమినల్ చర్యలు నమోదు చేసేందుకు ఉన్న కనీస పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచారు. అలాగే, సెక్షన్ 125 కింద విధించే గరిష్ట సాధారణ జరిమానాను రూ.25,000 నుంచి రూ.10,000 కు తగ్గించారు. పన్ను వివాదాలకు సంబంధించి పన్ను మొత్తం రూ.10,000 కంటే తక్కువ ఉంటే ఇకపై ఎలాంటి షోకాజ్ నోటీసులు జారీ చేయబోరు. మోసం లేని కేసుల్లో నిర్దేశిత సమయంలోగా పన్ను చెల్లిస్తే పెనాల్టీని కేవలం 5 శాతానికి పరిమితం చేశారు. అంతేకాకుండా, అప్పీళ్లు దాఖలు చేయడానికి చెల్లించాల్సిన ముందస్తు డిపాజిట్ గరిష్ట పరిమితిని రూ.40 కోట్లకు (సీజీఎస్టీ రూ.20 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూ.20 కోట్లు) కుదించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.5 కోట్ల వరకు టర్నోవర్ ఉండి, గడువు ముగిసిన నెలాఖరులోగా రిటర్నులు దాఖలు చేసే చిన్న వ్యాపారులకు లేట్ ఫీజును పూర్తిగా మాఫీ చేయనున్నారు.

**పారదర్శకంగా రిఫండ్లు, ఈ-వే బిల్లులు**

ఎలక్ట్రానిక్ క్యాష్ లెడ్జర్‌లోని అదనపు బ్యాలెన్స్‌కు సంబంధించిన రిఫండ్లను అధికారుల ప్రమేయం లేకుండా సిస్టమ్ ఆధారిత ఆటోమేటెడ్ పద్ధతిలో మంజూరు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. రిఫండ్ల దరఖాస్తులను పరిశీలించి లోపాలను తెలిపే గడువును 15 రోజుల నుంచి 10 రోజులకు తగ్గించారు.




# అండర్18 ఖోఖో జిల్లా స్థాయి ఎంపికలు



(వుదయం ప్రతినిధి)
నర్సాపూర్, అక్టోబర్: 8

మెదక్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్18 బాలబాలికల జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలను ఈ నెల 10న నర్సాపూర్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. హరికిషన్, ప్రధాన కార్యదర్శి బి. శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.
నర్సాపూర్‌లోని టీజీటీడబ్ల్యూఆర్ఎస్‌లో ఉదయం 10 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 2026 డిసెంబర్ 31 నాటికి 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న క్రీడాకారులు మాత్రమే ఎంపికలకు అర్హులని తెలిపారు. 01012009 లేదా ఆ తర్వాత జన్మించిన వారు మాత్రమే పాల్గొనాలని సూచించారు.
ఎంపికల్లో వయస్సు, ఎత్తు, బరువులను పరిగణనలోకి తీసుకుని ఇండెక్స్ స్కోర్‌ను నిర్ణయిస్తారని, వయస్సు, ఎత్తు (సెంటీమీటర్లలో), బరువు (కిలోలలో) కలిపి ఇండెక్స్ స్కోర్‌ను లెక్కిస్తారని తెలిపారు. బాలురు, బాలికలు రెండు విభాగాల్లోనూ ఇండెక్స్ స్కోర్ 250 పాయింట్లకు మించకూడదని స్పష్టం చేశారు.
ఎంపికలకు హాజరయ్యే ప్రతి క్రీడాకారుడు తప్పనిసరిగా బోనఫైడ్ అర్హత పత్రాన్ని వెంట తీసుకురావాలని, దానిపై సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతకం ఉండాలని సూచించారు. అలాగే వయస్సు ధ్రువీకరణ పత్రంతో పాటు అవసరమైన ఇతర పత్రాలను కూడా తీసుకురావాలని కోరారు.జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో మెదక్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.
- ఎస్. హరికిషన్, అధ్యక్షుడు
- బి. శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి
మెదక్ జిల్లా ఖోఖో అసోసియేషన్
ఫోన్: 9963770406

## పంచాయతీ కార్యదర్శితో వాగ్వాదం..
# ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- ఐదు నిముషాలు ఆలస్యంగా రావడంపై ప్రశ్నించిన కార్మికుడు.. విధులకు ఆటంకం కలిగించారంటూ ఫిర్యాదు



కోహీర్, అక్టోబరు 8
(వుదయం ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని పైడిగుమ్మల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నర్సింలుతో అదే గ్రామానికి చెందిన పరిశుద్ధ కార్మికుడు (ఎంపీడబ్ల్యూ) గంగాపురం విజయ్, అతని తండ్రి గంగాపురం సుభాష్ వాగ్వాదానికి దిగినట్లు సమాచారం.కార్యదర్శి విధులకు హాజరయ్యే సమయంలో ఐదు నిమిషాలు ఆలస్యంగా రావడంపై విజయ్ ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి, విజయ్ కార్యదర్శిని దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించినట్లు సమాచారం. ఘటనపై పంచాయతీ కార్యదర్శి నర్సింలు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు విజయ్‌తో పాటు అతని తండ్రి సుభాష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి. ఈ ఘటనపై సంబంధిత అధికారులు, పోలీసులు తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## విద్యుత్ కోతలను నిరసిస్తూ
# రోడ్డెక్కిన అన్నదాతలు



- పెద్దగుండవల్లి సబ్‌స్టేషన్ ఎదుట రైతుల రాస్తారోకో

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 08, వుదయం:

పంటలకు అవసరమైన విద్యుత్ సరఫరా అందకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్దగుండవల్లి సబ్‌స్టేషన్ ఎదుట గురువారం దుంపలపల్లి, పెద్దగుండవెల్లి రైతులు రాస్తారోకో నిర్వహించారు. రోజుకు కనీసం మూడు గంటలు కూడా నిరంతరంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయని పేర్కొంటూ రైతులు వరి కొయ్యలను రోడ్డుపై ఉంచి నిరసన తెలిపారు. సుమారు గంటపాటు ఆందోళన కొనసాగడంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని రైతులతో మాట్లాడి ఆందోళన విరమించాలని కోరారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు వచ్చి పంటలకు సరిపడా విద్యుత్ సరఫరాపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని రైతులు తేల్చిచెప్పారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగుతూ విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం కారణంగా పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతులు ఆరోపించారు. మల్లన్నసాగర్ ద్వారా సాగునీటిని విడుదల చేయకపోవడంతో పాటు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయానికి నిరంతరంగా 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధం చేసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ప్రతి పనికి ఓ రేటు..పైసలు లేనిదే పని కాదు

- ఎస్టీవోలో బిల్లుల కోసం.. పర్సంటేజీ' ఇవ్వాల్సిందే..!
- సమగ్ర విచారణకు డిమాండ్..
- బిల్లుల వారీగా స్లాబ్‌లు.. 2 నుంచి 5 శాతం వరకు వసూళ్లు



అచ్చంపేట, అక్టోబర్ 8
(వుదయం ప్రతినిధి ):

అచ్చంపేట సబ్ ట్రెజరీ ఆఫీస్ (ఎస్టీవో)లో ఏసీబీ దాడి కలకలం రేపిన నేపథ్యంలో కార్యాలయంలో బిల్లుల మంజూరు వ్యవహారంపై ఉద్యోగులు, పెన్షనర్లలో తీవ్ర చర్చ జరుగుతోంది.బిల్లులు మంజూరు కావాలంటే పర్సంటేజీ చెల్లించాల్సిందేనని, డబ్బులు ఇవ్వకపోతే ఫైళ్లలో కొర్రీలు పెట్టడం, వెనక్కి పంపడం, మంజూరులో జాప్యం చేయడం జరుగుతోందని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.
**ప్రతి బిల్లుకు ఓ రేటు..!**
మెడికల్ బిల్లులు, జీపీఎఫ్, సరెండర్ లీవ్స్ సంబంధిత బిల్లులు, పెన్షనర్ల బిల్లులు, వసతి గృహాలు, ఉద్యోగుల రిటైర్ మెంట్ బిల్లులు, ఆఫీసు బిల్లులు ఇతర ప్రభుత్వ బిల్లుల మంజూరులో డబ్బులు చెల్లించాల్సి వస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి బిల్లుకు 2 శాతం నుంచి 5 శాతం వరకు, ఉద్యోగుల రిటైర్ మెంట్ బిల్లుల విషయంలో 3 నుంచి 5 శాతం వరకు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. బిల్లుల రకాన్ని బట్టి స్లాబ్‌లు నిర్ణయించి వసూళ్లు చేస్తున్నారని సమాచారం.
డబ్బులు ఇవ్వకపోతే ఫైల్స్‌ను పెండింగ్‌లో పెట్టడం, చిన్న చిన్న లోపాలను చూపిస్తూ బిల్లులను తిరిగి పంపడం జరుగుతోందని కొందరు ఉద్యోగులు వాపోతున్నారు. ఆన్‌లైన్‌లో బిల్లులు సమర్పించిన అనంతరం అందులో కొన్ని తప్పులు ఉన్నాయని, కార్యాలయానికి వచ్చి కలవాలని సంబంధిత కార్యాలయ అధికారులకు ఫోన్ చేసి పిలిపించి డబ్బులు ఇచ్చిన తర్వాత ఫైల్స్‌ను పార్స్ చేస్తారని కొందరు తెలిపారు. డబ్బులు ఇవ్వకుంటే వివిధ కారణాలతో కొర్రీలు పెట్టి బిల్లులను నిలిపివేస్తున్నారనే విమర్శలు ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి.దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగులు, పెన్షనర్లు పలు మార్లు ఎస్టీవో కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అచ్చంపేట, ఉప్పునుంతల, బల్మూర్, లింగాల, పదర, అమ్రాబాద్ మండలాలకు చెందిన ప్రభుత్వ శాఖలకు సంబంధించిన బిల్లులు అచ్చంపేట ఎస్టీవో కార్యాలయం ద్వారా మంజూరు కావాల్సి ఉంటుంది. కార్యాలయం అధికారులు బిల్లు కోసం వచ్చే ఉద్యోగులు, పెన్షనర్ల అందరి నుంచి వసూలు చేసిన డబ్బులు ఎవరి వాటా వారు తీసుకొని సాయంత్రం ఇంటికి వెళ్తారని, వారి ఆస్తులు, ఇతర అంశాలపై విచారణ జరిపించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.
పెన్షనర్ల ఫైల్ చూసే సీనియర్ అకౌంటెంట్ పెన్షనర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ బిల్లులు చూసే ఓ మహిళా అధికారికి వసూళ్లలో కింగ్ మేకర్ అనే బిరుదు ఇవ్వవచ్చనే చర్చ ప్రస్తుతం జరుగుతోంది.పట్టుబడిన
ఘటనతో కార్యాలయంలోని బిల్లుల వ్యవహారంపై ఉద్యోగులు, పెన్షనర్లలో చర్చ మరింత ఊపందుకుంది. ఈ ఘటన తర్వాతనైనా కార్యాలయంలో అవినీతికి అడ్డుకట్ట పడుతుందా? అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు బిల్లుల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను అధికారులు పరిశీలించి బిల్లుల మంజూరు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్నారు. ఎస్టీవో కార్యాలయంలో పెరిగిన లంచాల వ్యవహారంతో ఉద్యోగులు విసుగు చెంది ఏమీ చేయలేక చివరకు ఏసీబీని ఆశ్రయించాల్సి వస్తుందని చెబుతున్నారు. ఉద్యోగులు ఈ ఏసీబీ దాడితో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో వసూళ్ల కింగ్ మేకర్ అధికారి ఏసీబీకి పట్టుబడితే బాగుండే అనే చర్చ జోరుగా జరుగుతోంది. ఎస్టీవో కార్యాలయంలో బిల్లుల మంజూరు పేరుతో జరుగుతున్న అవినీతిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని ఉద్యోగులు, పెన్షనర్లు డిమాండ్ చేస్తున్నారు. బిల్లుల పరిశీలన నుంచి మంజూరు వరకు ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# ఈవీఎం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్

నారాయణపేట టౌన్ అక్టోబర్ 8(వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ ప్రియాంక గురువారం నెలవారీ తనిఖీలో భాగంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాట్‌లను భద్రపరిచిన గోదాము పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. గోదాము భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. గోదాము వద్ద నిరంతర భద్రతా పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.తనిఖీ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, సీ సెక్షన్ అధికారిని జయసుధ, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సిద్దిపేట జిల్లా పదేళ్ల పండుగ

- దుబ్బాకలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఫ్లెక్సీల ఆవిష్కరణ

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 08, వుదయం:

సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పదేళ్ల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్, మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పదేళ్ల వార్షికోత్సవానికి సంబంధించిన ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మూడు రోజులపాటు నిర్వహించే పదేళ్ల వార్షికోత్సవ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా ఏర్పడక ముందు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న సమయంలో సంగారెడ్డిలో కలెక్టరేట్ కార్యాలయం ఉండేదని, దుబ్బాక ప్రాంత ప్రజలు కలెక్టరేట్‌కు వెళ్లాలంటే సుమారు ఐదు గంటల ప్రయాణం చేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఏదైనా సమస్యపై కలెక్టరేట్‌ను ఆశ్రయించాలన్నా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల ఇబ్బందులను తగ్గించిందని వారు పేర్కొన్నారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో జిల్లా కేంద్రం అందుబాటులోకి వచ్చి ప్రజలకు పరిపాలనా సౌలభ్యం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నల్లమలలో నవరంగుల సోయగం.. కనువిందు చేస్తున్న నవరంగ పిట్ట

- అడవిలో రంగుల తార.. పక్షిప్రియులకు అరుదైన కనువిందు



అచ్చంపేట, అక్టోబర్ 8
(వుదయంప్రతినిధి )

నల్లమల అటవీ ప్రాంతంలో తొమ్మిది రంగులతో మెరిసిపోయే అరుదైన నవరంగ పిట్ట (Indian Pitta) దర్శనమిచ్చి పక్షిప్రియులకు కనువిందు చేస్తోంది.ఆకుపచ్చ, నీలం, పసుపు, ఎరుపు, నలుపు, తెలుపు, గోధుమ రంగుల సమ్మేళనంతో ఉండే ఈ పిట్టను చూడగానే అడవిలో రంగుల తారలా కనిపిస్తోందని పక్షి పరిశోధకులు చెబుతున్నారు. సాధారణంగా హిమాలయాల నుంచి దక్షిణ భారతానికి వలస వచ్చే ఈ పక్షి, నల్లమలలోని దట్టమైన అడవులు, ఫరహాబాద్, మన్ననూర్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో సంచరిస్తున్నట్లు గుర్తించారు. వర్షాకాలం తర్వాత అడవి అంతా పచ్చదనంతో కళకళలాడుతుండగా, ఈ నవరంగ పిట్ట రాకతో నల్లమల మరింత అందంగా మారిందని అటవీ అధికారులు తెలిపారు. పర్యాటకులు సఫారీలో వెళ్లినప్పుడు ఈ అరుదైన పక్షిని ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు.
పర్యావరణ సమతుల్యానికి సూచికగా భావించే నవరంగ పిట్ట నల్లమలలో కనిపించడం, ఇక్కడ జీవవైవిధ్యం బాగుందనడానికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారం కోసమే టీజేఎంయు లక్ష్యం



నారాయణపేట టౌన్ అక్టోబర్ 8(వుదయం ప్రతినిధి)

కార్మికుల సమస్యల పరిష్కారం కోసమే టీజేఎంయు పనిచేస్తుందని యూనియన్ నాయకులు అన్నారు. గురువారం పేట ఆర్టీసీ గేటు ముందు నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత కొంతకాలంగా ఆర్టీసీని ప్రభుత్వపరం చేసేందుకు టీజేఎంయు నిరంతరంగా కృషి చేస్తుందని అన్నారు. అంతేకాకుండా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరంగా శ్రమిస్తుందని అన్నారు. ఆర్టీసీ ఎన్నికల్లో తమ యూనియన్ నాయకులను గెలిపిస్తే మీ సమస్యలను పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే తమ యూనియన్ ఎంతోమంది కార్మికుల సమస్యలను పరిష్కరించిందని ఈ ఎన్నికల్లో తమ యూనియన్ నాయకులను గెలిపిస్తే రాబోయే రోజుల్లో కార్మికుల అభ్యున్నతి కోసమే పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎంయు నాయకులు బి కే రెడ్డి, హనుమంతు, రఘు, రాజు ,నర్సప్ప, వెంకటప్ప, రవి, శంకర్ ,బాలరాజ్ ,సాయిలు ,ప్రసాద్ ,శీను లతోపాటు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# టీబీపై సమరభేరి.. రహిత జిల్లానే లక్ష్యం

- ప్రతి కేసును గుర్తించి.. ప్రతి బాధితుడికి అండగా నిలవాలి
- న్యూట్రి ఫుడ్‌కు దాతలు చేయూతనివ్వాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల, అక్టోబర్ 08
(వుదయం బ్యూరో)

టీబీపై సమరభేరి మోగించాలని.. వ్యాధి వ్యాప్తిని అడ్డుకుని జిల్లాను టీబీ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. టీబీపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు బాధితులకు అవసరమైన వైద్య, పోషకాహార సహకారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియన్'లో భాగంగా కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డా గురువారం ఢిల్లీలో ప్రారంభించిన 'జోష్ (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్)' కార్యక్రమాన్ని గద్వాల ఐడీఓసీ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్, జిల్లా అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. టీబీ బాధితులు వైద్యుల సూచనల మేరకు మందులు క్రమం తప్పకుండా వినియోగించాలని, పౌష్టికా హారం తీసుకోవాలని సూచించారు. బాధితులకు న్యూట్రి ఫుడ్ అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. టీబీ లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీప వైద్యశాలలో ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ప్రజల భాగస్వామ్యంతోనే విజయంటీబీ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, మై భారత్ వాలంటీర్లు, స్నేహ గ్రూపుల సభ్యులు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి మండలానికి ఒక టీబీ బాధితుడిని ఎంపీడీవోలు దత్తత తీసుకుని అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు.
**ఐదు గ్రామాలకు 'టీబీ ముక్త్' గుర్తింపు**
జిల్లాలోని ఖమ్మంపాడు, కోదండపురం, బస్వాపురం, ఇటిక్యాలపాడు, గుర్రంగడ్డ గ్రామ పంచాయతీలు టీబీ ముక్త గ్రామాలుగా ఎంపికయ్యాయి. ఆయా గ్రామాల సర్పంచులకు కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. ఈకార్యక్రమంలో డీఎం హెచ్‌వో సంధ్య కిరణ్మయి, డిప్యూటీ డీఎంహెచ్‌వో అస్గర్ అలీ, టీబీ ప్రోగ్రాం అధికారి రాజు, ఎంపీడీవోలు, సర్పంచులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అరబిందో ఫార్మా ఎండీ



తిమ్మాజిపేట, అక్టోబర్ 8
(వుదయం ప్రతినిధి):

మండల పరిధిలోనిఅప్పాజీపల్లి నరసన్న గుట్టపై స్వయంభుగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని గురువారం అరబిందో ఫార్మాసిటికల్ ఎండీ కె. నిత్యానంద రెడ్డి, వారి కుమార్తె కె. స్ఫూర్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిత్యానంద రెడ్డి మాట్లాడుతూ దేవాలయంలో నిత్య పూజల కోసం ప్రతినెల రూ.20 వేలు అందజేస్తానని ప్రకటించారు. అలాగే ఆలయ అభివృద్ధికి అందరితో చర్చించి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.అనంతరం దేవస్థానం తరపున వారిని సన్మానించారు.

# సంగారెడ్డి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- ప్రతి గ్రామపంచాయతీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి . అదనపు కలెక్టర్ ఆర్. పాండు.

సంగారెడ్డి, అక్టోబర్ 8:వు దయం





సంగారెడ్డి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఆర్. పాండు అన్నారు .
గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఎన్‌సీసీ, మై భారత్ వాలంటీర్లు, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు తదితరులతో టీబీ ముక్త్ భారత్ అభియాన్, జోష్ ఉన్నతస్థాయి జిల్లా కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ ఆర్. పాండు అధ్యక్షతన నిర్వహించారు .ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, పరీక్షలు నిర్వహించడం, సత్వర చికిత్స అందించడం వంటి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో టీబీ లక్షణాలు, పరీక్షలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. టీబీ నిర్మూలన కార్యక్రమాల్లో యువతను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు.ఈ సందర్భముగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె. లలితాదేవి, మాట్లాడుతూ ... నేషనల్ ట్యూబర్క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ కింద జిల్లాలో టీబీ వ్యాధి ముందస్తు గుర్తింపు, సత్వర చికిత్స, నివారణ, కమ్యూనిటీ భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. 2026 సెప్టెంబర్ వరకు జిల్లాలో 1,750 టీబీ కేసులు నమోదయ్యాయని, బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 7 ఫంక్షనల్ ఎక్స్‌రే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు నిర్దేశిత లక్ష్యంలో 109 శాతం ఎక్స్‌రే వినియోగం సాధించినట్లు ఆమె వెల్లడించారు. టీబీ బాధితులకు నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం అందించడంతో పాటు పోషకాహార సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద జిల్లాలో క్షయ వ్యాధి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న 144 గ్రామాలను గుర్తించి, నిక్షయ్ శివిర్ క్యాంపుల ద్వారా వల్నరబుల్ జనాభాకు టీబీ స్క్రీనింగ్ నిర్వహించినట్లు ఆమె తెలిపారు.కమ్యూనిటీ భాగస్వామ్యం, అవుట్‌రీచ్, క్షేత్రస్థాయి కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు బ్లాక్ స్థాయిలో ఎంపీడీవోల నేతృత్వంలో మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లతో జోష్ ( జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ టీబీ ముక్త్ భారత్ టీమ్స్ ) బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామ పంచాయతీలను టీబీ రహిత పంచాయతీలుగా ప్రకటించేందుకు నిర్దేశించిన ప్రమాణాల ఆధారంగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ , సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లాలో గుర్తించిన 41 టీబీ రహిత గ్రామాలకు సంబంధించిన సర్టిఫికెట్లను అదనపు కలెక్టర్ ఆర్. పాండు ఎంపీడీవోలు, సర్పంచ్‌లకు అందజేశారు. అలాగే మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టీబీ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ నిర్వహించారు. క్షయ వ్యాధి రహిత భారతదేశ నిర్మాణంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత భాగస్వాములై సమష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా టి బి ప్రోగ్రాం అధికారిణి సి హెచ్ అరుణా కుమారి , జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీరాజ్ అధికారి, జిల్లా యువజన అధికారి, ఎన్‌సీసీ యూనిట్ కమాండర్, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సుభాష్ భౌతికకాయానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం

- మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పరామర్శ....

తాండూర్ అక్టోబర్ 8
(వుదయం ప్రతినిధి)

తాండూరు మండలం సంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జగదీష్ తండ్రి సుభాష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గురువారం నివాసానికి వెళ్లారు. సుభాష్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ మేస్త్రి శ్రీనివాస్, రాజ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉత్తమ్ చంద్,ఆత్మ డైరెక్టర్ జగదీష్,కార్యకర్తలు, గ్రామస్థులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



## ఆరంభ్2026: గ్రాండ్‌గా ఫ్రెషర్స్ డే



**ముషీరాబాద్,**
**అక్టోబర్ 08(వుదయం)**

నారాయణగూడలోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ 'ఆరంభ్-ఫ్రెషర్స్ పార్టీ-2026' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.

**నారాయణగూడలోని తాజ్ మహల్ హోటల్‌లో జరిగిన ఈ వేడుకలు విద్యార్థుల సందడి,**

సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలతో ఉత్సాహభరితంగా సాగాయి.ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ ఇన్ఫర్మాటిక్స్ ప్రొఫెసర్ పి.వి. సుధా ముఖ్య అతిథిగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డి. శ్రీరాములు గౌరవ అతిథిగా హాజరయ్యారు.

**ప్రత్యేక అతిథులుగా వ్యం వన్ అండ్ ఇన్ఫిన్నో టెక్ వ్యవస్థాపకురాలు, సీఈఓ స్నృతి టి.ఎన్.,**

బ్రహ్మకుమారి కాచిగూడకు చెందిన బీకే సిస్టర్ డా. శ్రీలత పాల్గొన్నారు.ఈ సందర్భంగా అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ వ్యవస్థాపక చైర్మన్,

**ఆంధ్రప్రదేశ్ మాజీ పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ..**

విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా నూతన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు.

**క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత విజయాలను సాధించవచ్చని అన్నారు.**

నూతన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, వినోద కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**నూతన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను మరింత సందడిగా మార్చారు.**

విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతకు ప్రాధాన్యత ఇస్తూ అవంతి విద్యాసంస్థలు నిర్వహించిన

**'ఆరంభ్–2026' ఫ్రెషర్స్ పార్టీ నూతన విద్యార్థులకు ఆహ్లాదకరమైన, చిరస్మరణీయ అనుభూతిని అందించింది.**

కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, సీనియర్ విద్యార్థులు, నూతన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సాకి చెరువు కట్టపై బతుకమ్మ వేడుకలకు భారీ ఏర్పాట్లు

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు..
- సినీ, జానపద కళాకారులతో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు

**పటాన్చెరు (వుదయం):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పటాన్చెరు నియోజకవర్గంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) తెలిపారు.

**గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపై అక్టోబర్ 18న నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకల**

కోసం చేపడుతున్న ఏర్పాట్లను సైబరాబాద్ మునిసిపల్ అధికారులతో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.సద్దుల బతుకమ్మ సందర్భంగా పటాన్చెరు, జెపి కాలనీ డివిజన్లో పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన వేలాది మంది మహిళలు సాకి చెరువు కట్టకు తరలి వస్తారని..

**అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఎమ్మెల్యే సూచించారు.**

మహిళలు, కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక లైటింగ్, విశాలమైన పార్కింగ్, ఆకర్షణీయమైన వేదిక,

**తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.**

ముఖ్యంగా బతుకమ్మలను నిమజ్జనం చేసే ఘాట్ వద్ద భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గజ ఈతగాళ్లను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.



**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకల్లో సినీ,**

జానపద కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

**బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,**

ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీక అని ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు. సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని మహిళలు పెద్ద సంఖ్యలో సాకి చెరువు కట్టకు తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.మహిళల భద్రత, సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా అధికారులు,

**ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి బతుకమ్మ వేడుకలను ఘనంగా, సురక్షితంగా,**

పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు.

**సాకి చెరువుతోపాటు బండలగూడ, రామచంద్రాపురం, అమీన్పూర్, బీరంగూడ,**

తెల్లాపూర్, ముత్తంగి, బొల్లారం పరిధిలోని బతుకమ్మ ఘాట్లను సైతం సద్దుల

**బతుకమ్మ పండుగకు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.**

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్,మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, డిఈ కృష్ణవేణి, ఏఈలు లావణ్య, ఫైజన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



**కల్వకుర్తి**
**అక్టోబర్ 8 (వుదయం ప్రతినిధి)**

కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి అధ్యక్షతన మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకొని విద్యార్థులు బతుకమ్మను తీరొక్క పూలతో పేర్చి గౌరీ మాతను మధ్యలో వుంచి భక్త శ్రద్ధలతో పూజలు నిర్వహించి బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకున్నా పండుగ ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చిందని, బతుకమ్మను తెలంగాణాలో ప్రజలు తమ ఇంటి దేవతగా పూజిస్తున్నారన్నారని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఈ పండుగ ప్రతీకని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి బతుకమ్మలను ఎర్రకుంటలో నిమజ్జనం చేశారు.ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ గౌడ్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజు, ఐక్యూఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, మహిళా సాధికారిక విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీమతిబాయి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కోలన్ శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



**బాచుపల్లి,**
**అక్టోబర్ 8,(వుదయం ప్రతినిధి ),**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు అభిమానులు, కార్యకర్తలు, ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. రాజీకే, శివాలయం, నవ్య బేకరీ, అంగన్వాడీ స్కూల్, 191, రాజీకే ఆటో స్టాండ్, ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2 తదితర ప్రాంతాల్లో ప్రజల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించి,

**ప్రజలతో మమేకమై ఈ ప్రత్యేక దినోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకున్నారు.**

ఈ కార్యక్రమాలను కొలన్ శ్రీనివాస్ రెడ్డి తనయుడు కొలన్ రీత్విక్ రెడ్డి, బండారి లేఔట్ కాంగ్రెస్ అధ్యక్షులు వారగని వాసు, మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నిజాంపేట్ ప్రజల ఆత్మీయ నాయకులు, ప్రజాసేవకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిజాంపేట్ పరిధిలోని వివిధ డివిజన్లలో సేవాభావం, సామాజిక బాధ్యతను చాటిచెప్పే పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

**శివాలయం, దుర్గామాత దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి కొలన్ శ్రీనివాస్ రెడ్డికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థనలు చేశారు.**

విద్యే సమాజ అభివృద్ధికి పునాది అనే సంకల్పంతో పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి, వారి విద్యాభివృద్ధికి చేయూత అందించారు.

## జర్నలిస్టు యూనియన్ నాయకులకు ప్రెస్ క్లబ్ సన్మానం



**జిన్నారం**
**అక్టోబర్ 8(వుదయం ప్రతినిధి)**

టీయూడబ్ల్యూజే హెచ్ 143 పటాన్‌చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శిగా చింతల రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా

**రూపే రావు ప్రవీణ్ లు ఇటీవలే ఎన్నికైన విషయం తెలిసిందే.**

ఈ సందర్భంగా గుమ్మడిదల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. యూనియన్‌లో

**కీలక బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు హర్షం**

వ్యక్తం చేస్తూ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం,

**వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి యూనియన్ తరపున సమర్థవంతంగా కృషి చేయాలని ఆకాంక్షించారు.**

జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు సత్యం, శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్ చారి, లక్ష్మీ నాయుడు, నరేందర్ రెడ్డి, నగేష్ చారి, భానుచందర్, సన్నీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ కమిటీ సమీక్షా సమావేశం

**మేడ్చల్**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఆహార భద్రత యాక్టు 2013 లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధ్యక్షతన గురువారం కెలక్టరేట్ విసి హాల్ లో నిర్వహించినారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆహార భద్రతను బలోపేతం చేయడం,రేషన్ కార్డులు, యూనిట్లు, నిత్యావసర సరుకుల కేటాయింపు మరియు పంపిణీ సజావుగా నిర్వహించాలని తెలిపారు. హాస్టళ్లు,రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూట్లలో మెను ప్రకారం భోజన వసతుల ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మాట్లాడతూ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో 633 చౌక ధరల దుకాణాల ద్వారా 6,56,784 BPL కుటుంబాలకు (22,62,797 మంది లబ్ధిదారులకు) రేషన్ పంపిణీ చేయబడుతోందని తెలిపారు. వారికి 13 వేల టన్నులు ఏప్రిల్ 2025 నుండి సన్నబియ్యం పంపిణీ చేయండం జరుగుతుందన్నారు.మొత్తం డివిజన్ల సంఖ్య: 02, మొత్తం మండలాల సంఖ్య: 15, మొత్తం చౌక ధరల దుకాణాల సంఖ్య: 633, మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య: 6,56,784, మొత్తం లబ్ధిదారుల సంఖ్య (యూనిట్లు): 22,62,797, ప్రతి నెలా కేటాయించే బియ్యం: 13,905.216 మెట్రిక్ టన్నులు అందించడం జరుగుతుందన్నారు. మల్కాజిగిరి నియోజక వర్గం శాసన సభ సభ్యులు మర్రిరాజశేఖర్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం మేరకు విచ్చేసి వివిధ శాఖల పనితీరు పై సమీక్షించి తగిన సలహాలు సూచనలు అందజేసారు.

ఎంఎల్ ఎ మాటాడుతూ అర్హులైన వారందరికి రేషన్ కార్డులు అందించాలని, గోధుమలు కూడా ఇవ్వాలని, నిర్ణీత సమయంలోరేషన్ బియ్యం, ఇతర సరుకులనురేషన్ షాపులకు పంపించే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు గాను రేషన్ బియ్యం ట్రాన్స్ పోర్టు వ్యవస్థను మెరుగు పరచాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, అంగన్‌వాడీ సేవల నిర్వహణ,బీసీ మరియు ఎస్సీ సంక్షేమ హాస్టళ్ల వసతులను మెరుగుపరచాలని, మెను ప్రకారం భోజనం అందిస్తూ, మెను బోర్డులను ప్రదర్శించాలన్నారు.

## సాంకేతికతను ఆలోచనాత్మకంగా ఉపయోగించాలి

- గీతం విద్యార్థులకు సూచించిన టీసీఎల్ విభాగాధిపతి డాక్టర్ ఇంద్రాని ప్రమోద్ కెల్కర్

**పటాన్చెరు (వుదయం):**

ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లను విద్యార్థులు పెంపొందించుకోవాలని, సాంకేతికతను ఆలోచనాత్మకంగా ఉపయోగించాలని హైదరాబాదులోని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టీసీఎస్ ఐయాన్ నాణ్యత (క్వాలిటీ), విశ్లేషణ (అనలిటిక్స్) విభాగాధిపతి డాక్టర్ ఇంద్రాని ప్రమోద్ కెల్కర్ సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు లోని మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో 'సాంకేతికత, మానసిక ఆరోగ్యం' అనే అంశంపై గురువారం ఆమె ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఆరోగ్యానికి సంబంధించిన మేధోపరమైన, పర్యావరణ, సామాజిక, భావోద్వేగ, ఆర్థిక, ఆధ్యాత్మిక, వృత్తి పరమైన, శారీరక వంటి ఎనిమిది అంశాల మధ్య సమతుల్యతను పాటించాలని ఆమె స్పష్టీకరించారు.మానసిక ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యతను డాక్టర్ కెల్కర్ నొక్కి చెబుతూ, టెక్నాలజీ ఒక విలువైన వనరుగానూ, అదే సమయంలో ఒత్తిడికి కారణమయ్యే అంశంగానూ ఎలా ఉండగలదో వివరించారు. మానసిక ఆరోగ్య సమాచారం, ఆన్ లైన్ కౌన్సెలింగ్, తోటివారి మద్దతు, అభ్యాస వనరులు, సంపూర్ణ శ్రేయస్సు ద్వారా సాంకేతికత వల్ల కలిగే సానుకూల ప్రభావాలను ఆమె చర్చించారు. అదే సమయంలో, అధిక స్క్రీన్ సమయం, సోషల్ మీడియా వాడకం, సాంకేతిక పరికరాలను ఎక్కువగా ఉపయోగించడం (డిజిటల్ ఓవర్ లోడ్), సైబర్ బెదిరింపులు, సామాజిక పోలిక, నిద్రకు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.విద్యా షెడ్యూల్స్ ఒత్తిడి (డిమాండింగ్ అకడమిక్ షెడ్యూల్స్), ఎక్కువ సేపు స్క్రీన్ చూడటం, సరిపోని నిద్ర కారణంగా ఇంజనీరింగ్, ఐటీ విద్యార్థులు ముఖ్యంగా ఒత్తిడి, తీవ్రమైన మానసిక అలసట (బర్న్ అవుట్) కు గురయ్యే అవకాశం ఉందని కెల్కర్ చెప్పారు. భవిష్యత్ సాంకేతిక నిపుణులుగా విద్యార్థులు తమ డిజిటల్ శ్రేయస్సుకు బాధ్యత వహించాలని, అభ్యాసం, ఉత్పాదకత, సృజనాత్మకత, స్థితిస్థాపకతను పెంపొందించడానికి సాంకేతికతను ప్రయోజనకరంగా ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. డిజిటల్ అలవాట్లు, డిజిటల్ డిటాక్స్, మానసిక ఆరోగ్యానికి సాంకేతికత ఏవిధంగా మరింత తోడ్పడగలదు అనే అంశాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని డాక్టర్ కెల్కర్ సూచించారు. గీతం మహిళా సాధికారత సెల్ ఛైర్ పర్సన్ డాక్టర్ ప్రీతి పర్వేకర్, సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.గీతంలో ఎన్.సి.సి. ర్యాంక్ ప్రదానోత్సవంనాయకత్వం, క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధతకు గుర్తింపుగా వివిధ ర్యాంకులకు పదోన్నతి పొందిన క్యాడెట్లను గీతం ఎన్.సి.సి. హైదరాబాద్ 33 (టి) బెటాలియన్, సంగారెడ్డి గురువారం నిర్వహించిన ర్యాంక్ ప్రదానోత్సవంలో సత్కరించింది. ఈ వేడుకలో క్యాడెట్లు లాన్స్ కార్పోరల్, కార్పోరల్, సార్జంట్, కంపెనీ సార్జెంట్ మేజర్, కంపెనీ క్వార్టర్ మాస్టర్ సార్జెంట్, జూనియర్ అండర్ ఆఫీసర్, సీనియర్ అండర్ ఆఫీసర్ ర్యాంకులకు పదోన్నతి పొందారు. కొత్తగా పదోన్నతి పొందిన క్యాడెట్లను అభినందించి, వారి బాధ్యతలను గర్వం, నిజాయితీ, క్రమశిక్షణతో నిర్వర్తించాలని ప్రోత్సహించారు. ఎన్.సి.సి. ర్యాంకులు విశ్వాసం, బాధ్యత, నాయకత్వం, సేవకు ప్రతీకలని నిర్వాహకులు ప్రకటించారు. క్యాడెట్లు ఆదర్శంగా నిలిచి తమ తోటి క్యాడెట్లకు స్ఫూర్తినివ్వాలని సూచించారు. కొత్తగా పదోన్నతి పొందిన క్యాడెట్లు తమ కొత్త పాత్రలు, బాధ్యతలలో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ చేసిన కరతాళ ధ్వనులతో ఈ వేడుక ముగిసింది.పదోన్నతి పొందిన క్యాడెట్లు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ విలువలను నిలబెడతారని, వారి ఆదర్శప్రాయమైన ప్రవర్తన, నిబద్ధత ద్వారా గీతంకు గర్వకారణంగా నిలుస్తారని గీతం ఎన్.సి.సి. యూనిట్ విశ్వాసం వ్యక్తపరిచింది.



## రోడ్డు ప్రమాదం.. మహిళకు గాయాలు



**జిన్నారం**
**అక్టోబర్ 8(వుదయం ప్రతినిధి)**

జిన్నారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్పీడ్ బ్రేకర్ కనిపించక బైక్‌పై వెళ్తున్న దంపతులు అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో భార్యకు తలకు బలమైన గాయం కావడంతో పాటు ఎడమ చేయి విరిగినట్లు సమాచారం. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ సముద్ర కుమారి సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108 పైలట్ అక్షయ్ కుమార్ వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారిగా స్థానికులు తెలిపారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

## పోషకాహార భద్రతతోనే ఆరోగ్య సమాజం



- మహిళల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించాలి
- గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు (వుదయం):**

మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించి, సమతుల్య ఆహారంపై అవగాహన పెంపొందించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ అభియాన్-పోషణ మాసం వారోత్సవాల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, మహిళలకు అందిస్తున్న పోషకాహార సేవలు, ఆరోగ్య కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన కుటుంబానికి మహిళల ఆరోగ్యం పునాది వంటిదని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోషకాహార లోపం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, అందువల్ల చిన్నారులకు చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పండ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు.ప్రతి ఇంటిలో పోషకాహారంపై అవగాహన పెరిగితేనే సమాజంలో ఆరోగ్యకరమైన మార్పు సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. పోషణ్ అభియాన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సేవలను ఆమె అభినందించారు. పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై గ్రామాలు, కాలనీల్లో మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఓ జయరాం నాయక్, ఎంఈఓ నాగేశ్వర రావు నాయక్, రామ్మోహన్, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్చరీ ప్రీమియర్ లీగ్ సీజన్2కు ప్రిత్వీరాజ్ యోధాస్ జట్టు ప్రకటన

- ఎబిక్స్ గ్రూప్ మద్దతుతో ఎనిమిది మంది సభ్యులతో బలమైన జట్టు..
- అంతర్జాతీయ స్టార్ ఆర్చర్లకు చోటు

**ముషీరాబాద్,**
**అక్టోబర్ 08 (వుదయం)**

ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్2కు ప్రిత్వీరాజ్ యోధాస్ తమ ఎనిమిది మంది సభ్యుల జట్టును ప్రకటించింది. నటులు రణదీప్ హుడా, లిన్ లైష్రామ్ సహ యాజమాన్యంలో ఉన్న ఈ ఫ్రాంచైజీకి ఎబిక్స్ గ్రూప్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. భారతీయ ప్రతిభతో పాటు అంతర్జాతీయ స్థాయి స్టార్ ఆర్చర్లతో కూడిన ఈ జట్టు కాంపౌండ్, రికర్వ్ విభాగాల్లో బరిలోకి దిగనుంది. ప్రపంచ నంబర్ 1 కాంపౌండ్ ఆర్చర్ ఆండ్రియా బెసెర్రా, ప్రపంచ నంబర్ 3 రికర్వ్ ఆర్చర్ మాటియాస్ గ్రాండే జట్టులో కీలక సభ్యులుగా ఉన్నారు. వీరితో పాటు భారత ఆర్చర్లు అభిషేక్ వర్మ, కీర్తి శర్మ, తిరుమూరు గణేష్ మణి రత్నం, గాథా ఆనంద్రావ్ ఖడకే, రాజ్ కౌర్, జుయెల్ సర్కార్ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఎనిమిది మంది సభ్యుల జట్టులో పురుషులు, మహిళలకు సమాన ప్రాతినిధ్యంతో అంతర్జాతీయ ఆర్చర్లు ఉన్నారు. ఆరు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహిస్తూ 11 రోజుల పాటు పోటీలు జరగనున్నాయి.హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా అక్టోబర్ 8 నుంచి 18 వరకు ఈ పోటీలు కొనసాగనున్నాయి. ప్రతి రోజూ సాయంత్రం 7.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.టైటిల్‌పై యోధాస్ కన్నుగత సీజన్‌లో టైటిల్‌కు అత్యంత చేరువగా వెళ్లి షూట్‌ఆఫ్‌లో స్వల్ప తేడాతో విజేత అవకాశాన్ని కోల్పోయిన ప్రిత్వీరాజ్ యోధాస్.. ఈసారి మరింత బలమైన జట్టుతో బరిలోకి దిగుతోంది. ఈసారి టైటిల్‌ను కైవసం చేసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని జట్టు సహ యజమానులు రణదీప్ హుడా, లిన్ లైష్రామ్ తెలిపారు.ఆర్చరీని యువతకు, ముఖ్యంగా బాలికలకు ప్రొఫెషనల్ కెరీర్‌గా పరిచయం చేయడంలో ఏపీఎల్ కీలక పాత్ర పోషిస్తోందని వారు పేర్కొన్నారు. టైటిల్ గెలవడం ఎంత ముఖ్యమో, భారతీయ యువతలో ఆర్చరీపై ఆసక్తిని పెంచడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు.లిన్ లైష్రామ్‌కు ఆర్చరీతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆమె మాజీ జాతీయ స్థాయి ఆర్చర్ ప్రతి జట్టు మొత్తం 10 మ్యాచ్‌లు ఆడుతుంది. లీగ్ దశ ముగిసే నాటికి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచే నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. అనంతరం అక్టోబర్ 18న ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు.ఈసారి ప్రతి బాణానికి 15 సెకన్ల షూట్ క్లాక్‌ను అమలు చేయనున్నారు. అంతర్జాతీయ ప్రమాణంతో పోలిస్తే ఐదు సెకన్లు తక్కువ సమయం కేటాయించడంతో పోటీలో ఉత్కంఠ మరింత పెరగనుంది.ఏపీఎల్ సీజన్2 పోటీలను SonyLIV, Archery+ వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. హైదరాబాద్ వేదికగా జరుగుతున్న ఈ లీగ్‌తో నగరంలో ఆర్చరీకి మరింత ఆదరణ లభించడంతో పాటు భారతీయ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభించనుంది.

**IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE COURT, CITY CIVIL COURT, HYDERABAD**
**O.S.No. 3001 OF 2026**

**Between :**
1.TADISETTY PRASSANA LAXMI
2.TADISETTY NAVEENA
3.TADISETTY BHARATHI DEVI All the above plaintiffs Resided at H.No. 9-5-52/1, Ibrahimbagh, Vasavi colege, Golkonda, Hyderabad - 500031, Telangana State

**...Plaintiff**

**AND**

1.The Tahasildar Golkonda
2.All Conserned

**...Defendants**

Please take notice that the Plaintiffs has filed the above Suit for Declaration of the plaintiffs as legal heirs of late Tadisetty Anil Kumar against defendant no.1 and 2 the same is posted on 27.10.2026 for the appearance of the Defendant No.2 i.e. All concerned who ever have any objections regarding the above suit. The Defendant No.2(all concerned) are having any objection should be presented by themselves or through their counsel on the above said date, failing which the Defendant No. 2 will be set ex-parte and appropriate orders will be passed by the Hon'ble Court as per the law.

**[By order of the Court]**
**Sd/-**
**M/s D.Ramesh Reddy, P.Ranjith Kumar Reddy, Advocate,**
**Plot No.26/B, H.no.8-4-101, Road no.3,Pavanpuri Colony, Karmanghat, Hyderabad-500079.**
**Mobile: 8885641806.**

**BEFORE THE CHAIRMAN, MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM HON'BLE CHIEF JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD**
**M.V.O.P.NO. 620 OF 2026**

**Between :**
Chinnapelly Yakamma

**Petitioner**

**AND**

Vanarasi srinu & Others

**Respondents**

To
**R1. Vanarasi Srinu, S/o.Saraiah,** Age:44 Years, Occu.Driver of RTC Vehicle (AP 36 Z 0181), R/o.Nekkonda Road, Narsampet Village & Mandal of Warangal Dist 506132. Whereas the above named Petitioner filed the above MVOP for compensation of **Rs.15,00,000.00 (Rupees Fifteen Lakhs only)** against you and others and the above MVOP is posted to **26-10-2026** for your appearance. You are therefore informed to appear before the above named court on the date of hearing on **26-10-2026 at 10.30 a.m.** in person or through counsel, else the matter will be decided exparte.
Date: 5.10.2026

**[By order of the Court]**
**Sd/-**
**DESU PRASAD**
**Advocate**
**Hyderabad M.A.,LL.M.,PGJMC**
**ADVOCATE-HIGH COURT**
**Flat No. 204, Marvel Heights, Medipally, HYDERABAD-500 098.**
**Cell: 98492 72621**



"ఒకప్పుడు మాట్లాడుకోవడానికి, సందేశాలు పంపుకోవడానికి మాత్రమే ఉపయోగపడిన మొబైల్ నేడు సుపరిపాలనకు వారధిగా మారింది. ప్రభుత్వ సేవలను ప్రజల అరచేతిలోకి తీసుకువచ్చింది. సాంకేతికత కొది మందికే పరిమితం చేయకుండా, ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకు రావడమే నా లక్ష్యం. డిజిటల్ సేవలు అందుబాటు ధరల్లో ఉండాలి. చివరి వ్యక్తి వరకు చేరాలి. సైబర్ మోసాలు అరికట్టేందుకు నూతన సాంకేతిక పరిష్కారాలు అవసరం. డీప్‌ఫేక్‌ల మూలాలను గుర్తించే వ్యవస్థలు తదితర సాంకేతికపరమైన సమస్యలపై ప్రపంచ దేశాలు కలిసి పని చేయాలి."

**- నరేంద్ర మోడీ, ప్రధాని**

## వే'మన'

విత్తముగలవాని వీపున పుండైన
వసుధలోనజాల వార్తకెక్కు
బేదవానియింట బెండ్లైన నెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ.



# సంపాదకీయం

## ఓటు పరిరక్షణ ఈసీ బాధ్యత కాదా!

ఓటరు జాబితా అంటే పేర్ల పుస్తకం కాదు. అది ప్రజాస్వామ్యంలో పౌరుడి ఉనికికి, అతని రాజకీయ హక్కుకు ఆధారం. ఓటు హక్కు ద్వారా ప్రజలు పాలకులను ఎన్నుకుంటారు. అలాంటి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎవరిది? నకిలీ ఓట్లను ఏరివేయడం ఎంత ముఖ్యమో, అర్హుడైన ఒక్క పౌరుడి ఓటు కూడా పొరపాటున తొలగిపోకుండా చూడటం అంతకంటే ముఖ్యమైన బాధ్యత కాదా? దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నేపథ్యంలో ఇప్పుడు ఈ ప్రశ్నకు ఎన్నికల సంఘమే సమాధానం చెప్పాలి. ఓటరు జాబితాల్లో అక్రమ నమోదులు ఉండకూడదు. మరణించినవారి పేర్లు కొనసాగకూడదు. ఒకే వ్యక్తి అనేక ప్రాంతాల్లో ఓటరుగా నమోదై ఉండకూడదు. ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేయడం అవసరమే. కానీ ప్రక్షాళన పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు గల్లంతైతే మాత్రం ఆ ప్రక్రియ ఉద్దేశమే ప్రశ్నార్థకమవుతుంది. నకిలీ ఓటును తొలగించడం ఎన్నికల సంఘం బాధ్యత అయితే, నిజమైన ఓటును రక్షించడం అంతకంటే పెద్ద బాధ్యత కాదా?ఎస్ఐఆర్‌పై విపక్షాలు లేవనెత్తుతున్న ప్రధాన ఆందోళన ఇదే. పేదలు, వలస కార్మికులు, అట్టడుగు వర్గాలు, చిరునామాలు మారిన సామాన్యుల పేర్లు నిబంధనల పేరుతో జాబితాల నుంచి తొలగిపోతున్నాయని అవి ఆరోపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? రాజకీయ ఆరోపణ ఎంత? అన్నది పక్కన పెడితే, ప్రజల్లో అలాంటి అనుమానం కలగడం కూడా ఎన్నికల వ్యవస్థకు మంచిది కాదు. ఆ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉంది.అసలు సమస్య ఓటరు జాబితా సవరణకు వ్యతిరేకత కాదు. అర్హుడైన ఓటరును గుర్తించే విధానం ఎంత న్యాయబద్ధంగా ఉంది అన్నదే ప్రశ్న. ఒక పౌరుడి పేరు జాబితా నుంచి తొలగించే ముందు అతనికి సమాచారం ఇచ్చారా? తన వాదన వినిపించే అవకాశం కల్పించారా? పొరపాటు జరిగితే సరిదిద్దుకునే అవకాశం ఇచ్చారా కానీ స్వతంత్రత అంటే జవాబుదారీతనం నుంచి మినహాయింపు కాదు. అధికార జోక్యానికి తలొగ్గకుండా పనిచేయడం స్వతంత్రత అయితే, తన చర్యలను ప్రజలకు వివరించడం జవాబుదారీతనం. ఢిల్లీలో విపక్ష ఎంపీల నిరసనలు, మార్చ్‌లను అడ్డుకోవడం, నేతలను అదుపులోకి తీసుకోవడం వంటి పరిణామాలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లోనూ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో నిరసన హక్కును గౌరవించాల్సిందే. అదే సమయంలో నిరసన పేరుతో సామాన్యుల రాకపోకలకు, దైనందిన జీవితానికి తీవ్ర ఇబ్బంది కలగకుండా రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలి.రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి తమ అభ్యంతరాలను వివరించేందుకు విపక్షాలు ప్రయత్నించడం ఈ వివాదాన్ని రాజ్యాంగబద్ధ వేదికపైకి తీసుకెళ్లే మరో అడుగు. అయితే ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థ కావడంతో రాష్ట్రపతి భేటీతోనే సమస్యకు తక్షణ పరిష్కారం లభిస్తుందని భావించడం సరికాదు. సమస్యకు శాశ్వత పరిష్కారం పార్లమెంటరీ చర్చ, న్యాయ సమీక్ష, ఎన్నికల సంఘం పారదర్శక చర్యల ద్వారానే సాధ్యం.

వాటిలో ఎన్ని పరిష్కరించారు? వంటి వివరాలను ఆధారాలతో ప్రజల ముందుంచాలి. ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం కూడా వాస్తవాలు, గణాంకాలు, ఆధారాలపైనే నిలబడాలి.అయితే అంతిమ బాధ్యత మాత్రం ఎన్నికల సంఘంపైనే ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఎన్నికల ప్రక్రియకు కాపలాదారు అదే. నకిలీ ఓటును తొలగించడమే కాకుండా, నిజమైన ఓటును కాపాడాల్సింది కూడా అదే. ఒక అనర్హుడి పేరు జాబితాలో ఉండటం ఎన్నికల విశ్వసనీయతకు నష్టం కలిగిస్తే, ఒక అర్హుడి పేరు తొలగిపోవడం ప్రజాస్వామ్యానికే నష్టం. ఈ రెండింటినీ ఒకే ప్రమాణంతో చూడలేం.

అందుకే ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం మరింత పారదర్శకతను ప్రదర్శించాలి. తొలగించిన పేర్ల సంఖ్య, కారణాలు, అభ్యంతరాల వివరాలు, పరిష్కార విధానం వంటి సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అనుమానాలకు తావులేని విధంగా ప్రతి దశను పర్యవేక్షించాలి. అవసరమైతే పౌరసమాజం, రాజకీయ పార్టీలు, న్యాయ నిపుణుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.ప్రజాస్వామ్యంలో ఓటరు కేవలం జాబితాలోని ఒక సంఖ్య కాదు. అతడే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. అతని ఓటు ద్వారా ప్రభుత్వాలు ఏర్పడతాయి, పాలకులు మారతారు, విధానాలకు ప్రజా ఆమోదం లభిస్తుంది. అందుకే ఓటరు జాబితా శుద్ధి పేరుతో ఒక్క అర్హుడి ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకూడదు.నకిలీ ఓటుకు చోటు ఉండకూడదు. అదే సమయంలో నిజమైన ఓటుకు కూడా తలుపులు మూయకూడదు. ఓటు పరిరక్షణ ఎన్నికల సంఘం బాధ్యత కాదా? ఈ ప్రశ్నకు ఎన్నికల సంఘం తన చర్యల ద్వారా స్పష్టమైన సమాధానం ఇవ్వాలి. ప్రతి అర్హుడి ఓటు భద్రంగా ఉన్నప్పుడే ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా జరుగుతున్నాయని ప్రజలు నమ్ముతారు. ఆ విశ్వాసమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పేజీకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com

website : www.voodayam.com

Editor : 9247698676

1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# తెలంగాణ కోసం వికారాబాద్ గర్జించిన గాథ

*1969లో తొలి ఉద్యమం నుంచి 2014 స్వరాష్ట్రం వరకు.. వికారాబాద్ ప్రాంతం చూసిన పోరాటం, త్యాగాలు, సమ్మెలు, రైల్ రోకోలు, ఆత్మబలిదానాలు*

తెలంగాణ రాష్ట్ర సాధన చరిత్రను ఒకే రోజుతో, ఒకే నాయకుడితో, ఒకే రాజకీయ పార్టీతో ముడిపెట్టడం సాధ్యం కాదు. ఇది దశాబ్దాల ఆకాంక్ష, అసంతృప్తి, ఉద్యమం, త్యాగం, రాజకీయ పోరాటం కలిసిన మహాప్రస్థానం. ఆ చరిత్రలో ప్రస్తుత వికారాబాద్ జిల్లా ప్రాంతానికీ ఒక ప్రత్యేక అధ్యాయం ఉంది. అయితే ఒక చారిత్రక విషయాన్ని మొదట స్పష్టంగా గుర్తుంచుకోవాలి. వికారాబాద్ జిల్లా 2016 అక్టోబర్ 11న మాత్రమే ఏర్పడింది. ప్రస్తుత జిల్లా ప్రాంతం అప్పటికి ప్రధానంగా ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ఉండేది. అందువల్ల 1969 లేదా 2009 నాటి సంఘటనలను నేటి జిల్లా సరిహద్దులతో కాకుండా అప్పటి పరిపాలనా నేపథ్యంతో చూడాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రస్తుత వికారాబాద్ జిల్లా పూర్వ రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి 18 మండలాలతో ఏర్పడిందని పేర్కొంటోంది. 1969.. తెలంగాణ ఆవేదన ఉద్యమంగా మారిన తొలి దశ 1956లో ఆంధ్ర రాష్ట్రంతో తెలంగాణ విలీనం తర్వాత తెలంగాణ ప్రాంతానికి ఇచ్చిన రక్షణలు, ఉద్యోగ హక్కులు, నిధులు, విద్య, అభివృద్ధి వంటి అంశాలపై అసంతృప్తి క్రమంగా పెరిగింది. ముల్కీ నిబంధనల అమలు, తెలంగాణ ఉద్యోగాలకు స్థానికుల హక్కు, ప్రాంతీయ నిధుల వినియోగం వంటి ప్రశ్నలు ప్రజల్లో ఆందోళనకు కారణమయ్యాయి. 1968-69లో విద్యార్థులు ముందుకు రావడంతో ఆ అసంతృప్తి పెద్ద ప్రజా ఉద్యమంగా మారింది. విద్యార్థుల నుంచి ఉద్యోగులు, సామాన్య ప్రజల వరకు ఉద్యమం విస్తరించింది. ఆ సమయంలో హైదరాబాద్ ప్రధాన ఉద్యమ కేంద్రంగా ఉన్నప్పటికీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాల మాదిరిగానే నేటి వికారాబాద్ ప్రాంతంలోనూ ప్రత్యేక తెలంగాణ భావనకు రాజకీయ, సామాజిక స్పందన ఏర్పడింది. ఈ కాలం నుంచే తెలంగాణ హక్కులు, ఉద్యోగాలు, అభివృద్ధి, ప్రాంతీయ గౌరవం వంటి అంశాలు ఈ ప్రాంత ప్రజల రాజకీయ చర్చలోకి వచ్చాయి.వికారాబాద్ పేరుకు ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యం1969 ఉద్యమ చరిత్రలో వికారాబాద్ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు రావడానికి మరో ప్రధాన కారణం మర్రి చెన్నారెడ్డి. ఆయన వికారాబాద్ నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికై, అనంతరం ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి రాజకీయ నాయకత్వం వహించిన ప్రముఖులలో ఒకరిగా నిలిచారు. తెలంగాణ ప్రజా సమితి ద్వారా ఉద్యమానికి రాజకీయ రూపం కల్పించడంలో ఆయన పాత్ర కీలకంగా మారింది. అందువల్ల వికారాబాద్ పేరు కేవలం ఒక ప్రాంతం పేరుగా కాకుండా తెలంగాణ రాజకీయ నాయకత్వంతో అనుసంధానమైన పేరుగా 1969 చరిత్రలో కనిపిస్తుంది.1969 ఉద్యమం.. విద్యార్థుల రక్తంతో రాసిన అధ్యాయం1969 ఉద్యమం సాధారణ నిరసన కాదు. ఉద్యోగ హక్కులు, ప్రాంతీయ రక్షణలు, అభివృద్ధి, ఆత్మగౌరవం వంటి ప్రశ్నలపై విద్యార్థులు రోడ్డెక్కారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సామాన్య ప్రజలు కూడా ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. ప్రభుత్వం పోలీసు చర్యలకు దిగడంతో పరిస్థితి మరింత విషమించింది. వివిధ చారిత్రక రికార్డుల్లో 1968-69 ఉద్యమంలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు నమోదైంది; కొన్ని చారిత్రక వనరులు సుమారు 369 మంది మృతులను పేర్కొంటున్నాయి. 1969 ఉద్యమం వెంటనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించకపోయినా, ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌ను ప్రజల రాజకీయ చైతన్యంలో శాశ్వతంగా నిలిపింది. ఉద్యమం కొంతకాలం చల్లబడినా ఆకాంక్ష మాత్రం చావలేదు.1969 తర్వాత నిశ్శబ్దం.. కానీ సమస్యలు మాత్రం మిగిలాయిఉద్యమం తగ్గిపోయింది. రాజకీయ రాజీలు వ చ్చాయి. ప్రభుత్వాలు మారాయి.



కానీ ఉద్యోగాలు, నీరు, నిధులు, ప్రాంతీయ అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి సమస్యలపై తెలంగాణ ప్రజల్లో ఉన్న అసంతృప్తి పూర్తిగా తొలగిపోలేదు. తరాలు మారాయి. కొత్త తరం విద్యార్థులు, ఉద్యోగులు పెరిగారు. 1990ల చివరి దశలో తెలంగాణ సమస్య మళ్లీ బలంగా వినిపించడం ప్రారంభమైంది. 2001.. తెలంగాణకు మళ్లీ రాజకీయ వేదిక2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడటంతో ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌కు కొత్త రాజకీయ వేదిక ఏర్పడింది. అప్పటి నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఒక నిరంతర రాజకీయ ఉద్యమంగా ముందుకు సాగింది. నేటి వికారాబాద్ ప్రాంతంలోని వికారాబాద్, పరిగి, తాండూరు, మర్పల్లి తదితర ప్రాంతాల్లో కూడా తెలంగాణ రాష్ట్రం అవసరం, ప్రాంతీయ అభివృద్ధి, ఉద్యోగాలు, నీటి సమస్యలు వంటి అంశాలపై చర్చలు పెరిగాయి. వికారాబాద్‌లో 2002లో జరిగిన "శంఖారావం" కార్యక్రమం ఈ దశలో తెలంగాణ ఉద్యమ ప్రచారానికి గుర్తించదగిన స్థానిక ఘట్టంగా పేర్కొనబడింది.2009.. మళ్లీ ఎగిసిన తెలంగాణ జ్వాల2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షతో ఉద్యమం కీలక మలుపు తిరిగింది. డిసెంబర్ 9 ప్రకటన తర్వాత తెలంగాణ రాష్ట్రంపై ఆశలు పెరిగాయి. అనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశాయి. విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, కార్మికులు, రైతులు, మహిళలు, వ్యాపారులు, యువత—విభిన్న వర్గాలు ఉద్యమంలోకి వచ్చాయి. తెలంగాణ జేఏసీ ఏర్పడిన తర్వాత ఉద్యమం మరింత విస్తృత ప్రజా ఉద్యమంగా మారింది. వికారాబాద్ ప్రాంతంలోనూ సభలు, ర్యాలీలు, ధర్నాలు, బంద్‌లు, మానవహారాలు, నిరసనలు కొనసాగాయి.ఆత్మబలిదానాలు.. వికారాబాద్ ప్రాంతం చూసిన విషాదంతెలంగాణ ఉద్యమం చివరి దశలో వికారాబాద్ ప్రాంతానికి చెందిన కొందరు యువకుల ఆత్మబలిదానాలు అత్యంత విషాదకరమైన అధ్యాయంగా నిలిచాయి. స్థానికంగా ప్రచారంలో ఉన్న వివరాలకు మాత్రమే కాకుండా, వికారాబాద్ ప్రాంత అమరుల కుటుంబాల గురించి ప్రచురించిన వార్తా కథనాల్లో మదన్‌పల్లి యాదయ్య, గంగారం దీపక్, మర్పల్లి మండలం ఘణపురం మేశెట్ పేర్లు స్పష్టంగా నమోదయ్యాయి. మదన్‌పల్లి యాదయ్య.. "జై తెలంగాణ" అంటూ చివరి శ్వాసవికారాబాద్ మండలం మదన్‌పల్లి గ్రామానికి చెందిన సొప్పరి యాదయ్య తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరుడిగా స్థానికంగా గుర్తించబడ్డారు. 2010 సెప్టెంబర్ 26న ఆయన తన ఇంట్లో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నారని వార్తా కథనం పేర్కొంది. మంటల్లో కాలిపోతున్న సమయంలో కూడా "జై తెలంగాణ" నినాదాలు చేసినట్లు ఆ కథనంలో ఉంది. తీవ్రంగా గాయపడిన ఆయనను హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ 2010 అక్టోబర్ 2న మరణించారు. ఇది కేవలం ఒక వ్యక్తి మరణం కాదు. ఉద్యమ సమయంలో ప్రజలలో నెలకొన్న తీవ్ర భావోద్వేగానికి, తెలంగాణ రాష్ట్రం కోసం కొందరు వ్యక్తిగతంగా చెల్లించిన మూల్యానికి ఇది విషాద ఉదాహరణ.ఘణపురం మేశెట్.. తెలంగాణ కోసం మరో త్యాగం మర్పల్లి మండలం ఘణపురం గ్రామానికి చెందిన మేశెట్ కూడా తెలంగాణ ఉద్యమ అమరుడిగా స్థానికంగా గుర్తించబడ్డారు. ప్రత్యేక తెలంగాణ వస్తుందనే ఆశతో, ఉద్యమానికి తన మరణం ద్వారా బలం చేకూరుతుందని భావించి 2010 జనవరి 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారని వార్తా కథనం పేర్కొంది. మేశెట్ ఘటన ఉద్యమంలో నెలకొన్న ఆవేదనను చూపించిన మరో విషాద ఘట్టం. అయితే ఇలాంటి ఆత్మహత్యలను ఉద్యమ విజయానికి అవసరమైన చర్యలుగా కాకుండా, ఒక కుటుంబాన్ని శాశ్వతంగా విషాదంలోకి నెట్టిన త్యాగాలుగా చరిత్ర గుర్తించాలి.వికారాబాద్ బస్టాండ్.. దీపక్ ఆత్మబలిదానంవికారాబాద్ ప్రాంత ఉద్యమ చరిత్రలో అత్యంత హృదయవిదారకమైన సంఘటనల్లో గంగారం ప్రాంతానికి చెందిన దీపక్ ఆత్మబలిదానం ఒకటి. వార్తా కథనం ప్రకారం 2011 అక్టోబర్ 4న, ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో దీపక్ వికారాబాద్ బస్టాండ్‌కు వెళ్లాడు. బస్సును తగులబెట్టేందుకు ప్రయత్నిస్తున్న ఉద్యమకారుల మధ్య అతను కూడా ఉండగా, తనకు తానే నిప్పంటించుకున్నాడు. "జై తెలంగాణ" అంటూ నినాదాలు చేసినట్లు ఆ కథనం పేర్కొంది. అక్కడున్న కొందరు ఉద్యమకారులు అతడిని కాపాడే ప్రయత్నం చేశారు. తీవ్రంగా గాయపడిన దీపక్‌ను గాంధీ ఆసుపత్రికి, అనంతరం వికారాబాద్‌లోని అనంత్‌రెడ్డి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 2012 మే 26న మరణించాడు. ఈ సంఘటనలో రెండు విషయాలను చరిత్ర స్పష్టంగా గుర్తించాలి. ఒకటి—దీపక్ ప్రాణత్యాగం. రెండోది—బస్సుకు నిప్పంటించేందుకు జరిగిన ప్రయత్నం. ఆత్మబలిదానం ఒక విషాద సంఘటన; ప్రజా రవాణా ఆస్తికి నష్టం కలిగించడం మాత్రం ఉద్యమంలో చోటుచేసుకున్న వివాదాస్పద చర్య. రెండింటినీ కలిపి సమర్థించడం చారిత్రకంగా సరైంది కాదు.సకల జనుల సమ్మె.. వికారాబాద్‌లో ఉద్యమానికి సామూహిక బలం2011 సెప్టెంబర్‌లో ప్రారంభమైన సకల జనుల సమ్మె తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టం. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ, విద్యుత్, మున్సిపల్, ఇతర రంగాల ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లారు. సెప్టెంబర్ 23 నాటికి సమ్మె 11వ రోజుకు చేరినట్లు అప్పటి వార్తలు నమోదు చేశాయి. రైల్‌రోకోకు పిలుపునివ్వడంతో రైళ్ల రద్దు, దారి మళ్లింపులు కూడా జరిగాయి. వికారాబాద్ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాల కార్యకలాపాలు, రవాణా, విద్యాసంస్థలపై సమ్మె ప్రభావం పడింది. తెలంగాణ డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిగా మార్చడంలో సకల జనుల సమ్మె కీలకంగా నిలిచింది.రైల్‌రోకో.. రైల్వే మార్గాలపై తెలంగాణ నిరసన2011 సెప్టెంబర్ 24-25 తేదీల్లో తెలంగాణ జేఏసీ రైల్‌రోకోకు పిలుపునిచ్చింది. ఇది ఉద్యమంలో కీలక నిరసన రూపంగా మారింది. వికారాబాద్ రైల్వే మార్గం కూడా ఉద్యమ ప్రభావాన్ని చూసింది. రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడటం, రైళ్ల రద్దు, దారి మళ్లింపులు వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అప్పటి రాష్ట్రవ్యాప్త రైల్‌రోకో ఉద్యమ తీవ్రతను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంగా జరిగింది. వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో సినిమా షూటింగ్‌పై నిరసన2011లో వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో "దూకుడు" సినిమా షూటింగ్ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల నిరసన కూడా వార్తల్లో నిలిచింది. షూటింగ్‌ను అడ్డుకునే ప్రయత్నం, రాళ్ల దాడి, వాహనానికి నష్టం వంటి ఘటనలు చోటు చేసుకున్నట్లు అప్పటి వార్తా కథనాలు పేర్కొన్నాయి. తర్వాత సినిమా విడుదల సమయంలో కూడా తెలంగాణ ఉద్యమకారులు కొన్ని చోట్ల ప్రదర్శనలను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ ఘటనలు ఉద్యమం ఎంత తీవ్రంగా మారిందో చూపించినప్పటికీ, ఇవి ఉద్యమంలోని వివాదాస్పద సంఘటనలుగా చరిత్రలో నమోదు చేయాలి. సినిమా లేదా ప్రజా ఆస్తిపై దాడిని తెలంగాణ ఉద్యమ లక్ష్యంతో సమర్థించడం సరైంది కాదు. అమరవీరుల స్మరణకు స్థూపంతెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారిని గుర్తు చేసుకునేందుకు అమరవీరుల స్మారక చిహ్నాలు ఏర్పాటు చేయడం ఉద్యమానంతర కాలంలో కొనసాగింది. వికారాబాద్‌లో కూడా అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయబడింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించనున్నట్లు అప్పటి వార్తా కథనం పేర్కొంది. ఇక్కడ ఒక ముఖ్యమైన చారిత్రక అంశం ఉంది. 1969 ఉద్యమ అమరవీరుల స్మారకంగా హైదరాబాద్ గన్‌పార్క్‌లో స్థూపం ఏర్పాటుకు 1970 ఫిబ్రవరి 23న శంకుస్థాపన జరిగింది. అది తెలంగాణ ఉద్యమ అమరవీరుల సామూహిక స్మృతికి ప్రధాన ప్రతీకగా నిలిచింది. అందువల్ల వికారాబాద్‌లోని అమరవీరుల స్మారకం స్థానిక త్యాగాలను గుర్తు చేసే చిహ్నంగా, గన్‌పార్క్ రాష్ట్రవ్యాప్త తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నంగా వేర్వేరుగా చూడాలి.అమరవీరుల పేర్లు చరిత్రలో ఎందుకు ఉండాలి?మదన్‌పల్లి యాదయ్య, ఘణపురం మేశెట్, గంగారం దీపక్ పేర్లు వికారాబాద్ ప్రాంత ఉద్యమ చరిత్రలో ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన పేర్లు. వారి కుటుంబాలు ఎదుర్కొన్న నష్టాన్ని కేవలం రాజకీయ ప్రసంగాల్లో గుర్తు చేసుకోవడం సరిపోదు. తెలంగాణ ఉద్యమం ఎలా సాగిందో రాసేటప్పుడు వారి జీవితాలు, కుటుంబ నేపథ్యం, వారు త్యాగానికి దారితీసిన పరిస్థితులు, అనంతరం కుటుంబాలకు లభించిన సహాయం వంటి అంశాలను కూడా రికార్డు చేయాల్సిన అవసరం ఉంది. వికారాబాద్ ప్రాంత అమరవీరుల పూర్తి అధికారిక జాబితా, కుటుంబాల వివరాలు, ప్రభుత్వ పరిహారం, ఉద్యోగాలు, స్మారక చిహ్నాల వివరాలు వేర్వేరు ప్రభుత్వ రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సిన అంశాలు. అందుబాటులో ఉన్న వార్తా ఆధారాల కంటే ఎక్కువ పేర్లను ఊహించి చేర్చడం చరిత్రకు నష్టం చేస్తుంది.2013-14.. తుది దశలో వికారాబాద్ ప్రజా స్పందన2013లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రాజకీయ ప్రక్రియ వేగం పుంజుకుంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూల నిర్ణయం తీసుకున్న తర్వాత రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ముందుకు సాగింది. తెలంగాణ జేఏసీ, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఉద్యమాన్ని కొనసాగించాయి. వికారాబాద్‌లో కూడా తెలంగాణ సాధనపై ప్రజా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు కొనసాగాయి. తెలంగాణ జేఏసీ నాయకత్వం గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను కలుస్తూ రాష్ట్ర సాధనపై చైతన్యం పెంచింది.2014 జూన్ 2.. ఆరు దశాబ్దాల కల సాకారం1969లో రక్తంతో మొదలైన తొలి దశ, ఆ తర్వాత వచ్చిన నిశ్శబ్దం, 2001 తర్వాత వచ్చిన రాజకీయ పునరుజ్జీవనం, 2009 తర్వాత వచ్చిన మహోద్యమం, 2011 సకల జనుల సమ్మె, రైల్‌రోకో, మిలియన్ మార్చ్, సాగరహారం వంటి అనేక ఉద్యమ రూపాలు చివరకు 2014లో రాజకీయ ఫలితాన్ని చూశాయి. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.వికారాబాద్ తెలంగాణ చరిత్ర.. రాజకీయాల కంటే పెద్దది

వికారాబాద్ ప్రాంత తెలంగాణ ఉద్యమ చరిత్రను ఒక పార్టీకి, ఒక నాయకుడికి మాత్రమే కట్టిపడేయడం చరిత్రను చిన్నదిగా చేయడమే. ఈ పోరాటంలో రాజకీయ నాయకులు ఉన్నారు. విద్యార్థులు ఉన్నారు. ఉద్యోగులు ఉన్నారు. ఉపాధ్యాయులు ఉన్నారు. న్యాయవాదులు ఉన్నారు. రైతులు ఉన్నారు. మహిళలు ఉన్నారు. కార్మికులు ఉన్నారు. వ్యాపారులు ఉన్నారు. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన యువకులు ఉన్నారు. కొందరు జైళ్లకు వెళ్లారు. కొందరు ఉద్యోగాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు కుటుంబాలను కోల్పోయారు. మరికొందరు తమ ప్రాణాలనే అర్పించారు.1969 నుంచి 2014 వరకు.. ఒకే ఆకాంక్షకు రెండు మహాదశలు1969 ఉద్యమం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను రక్తాక్షరాలతో చరిత్రలో నమోదు చేసింది. ఆ ఉద్యమం తాత్కాలికంగా వెనుకబడినా ఆకాంక్ష మాత్రం కొనసాగింది. 2001 తర్వాత ఆ ఆకాంక్షకు కొత్త రాజకీయ వేదిక వచ్చింది. 2009 తర్వాత అది మళ్లీ మహా ప్రజా ఉద్యమంగా మారింది. వికారాబాద్ ప్రాంతం కూడా ఈ రెండో దశలో బలమైన ప్రజా స్పందనను చూపింది. సకల జనుల సమ్మె నుంచి రైల్‌రోకో వరకు, సభల నుంచి ర్యాలీల వరకు, విద్యార్థి ఉద్యమం నుంచి ఉద్యోగుల సమ్మె వరకు అనేక రూపాల్లో ప్రజలు పాల్గొన్నారు.త్యాగాలను గౌరవించడమే అసలు నివాళితెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆత్మబలిదానాల అధ్యాయం అత్యంత బాధాకరం. యాదయ్య, మేశెట్, దీపక్ వంటి వారు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని మరచిపోవద్దు. అయితే వారి ఆత్మబలిదానాలను అనుకరించాల్సిన మార్గంగా కాకుండా, ఆ కాలంలో నెలకొన్న రాజకీయ-సామాజిక ఆవేదనకు చారిత్రక సాక్ష్యాలుగా మాత్రమే చూడాలి. ఒక ప్రజాస్వామ్య సమాజంలో ప్రాణత్యాగం కాదు—ప్రజాస్వామ్య పోరాటం, చర్చ, ఓటు, చట్టబద్ధమైన ఉద్యమమే మార్పుకు మార్గం.వికారాబాద్ చరిత్ర చెప్పే చివరి మాటతెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి వికారాబాద్ ప్రాంతం ఒక్క రోజులో పాత్ర పోషించలేదు. 1969లో మొదలైన ఆకాంక్ష నుంచి 2001 తర్వాతి రాజకీయ ఉద్యమం వరకు, 2009 తర్వాతి ప్రజా పోరాటం నుంచి 2014 స్వరాష్ట్రం వరకు ఈ ప్రాంత ప్రజల స్పందన ఒక నిరంతర చరిత్రగా నిలిచింది. వికారాబాద్ ప్రాంతానికి చెందిన అమరవీరుల పేర్లు, ఉద్యమకారుల పోరాటం, విద్యార్థుల నిరసనలు, ఉద్యోగుల సమ్మెలు, రైల్‌రోకోలు, బంద్‌లు, బస్టాండ్‌లో జరిగిన విషాద ఘటన, రైల్వే స్టేషన్‌లో జరిగిన నిరసనలు, సినిమా షూటింగ్‌పై జరిగిన ఆందోళనలు—ఇవన్నీ కలిపి చూస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. తెలంగాణ ఉద్యమం కేవలం హైదరాబాద్‌లో జరిగిన ఉద్యమం కాదు.

అది పల్లెకు వెళ్లింది. పట్టణానికి వెళ్లింది. విద్యార్థి చేతిలోకి వెళ్లింది. ఉద్యోగి చేతిలోకి వెళ్లింది. రైతు గుండెల్లోకి వెళ్లింది. వికారాబాద్ ప్రాంత ప్రజల జీవితాల్లోకి వెళ్లింది. చివరకు రాష్ట్రంగా రూపుదిద్దుకుంది. ఆ పోరాటాన్ని గుర్తు చేసుకోవడం అంటే కేవలం విజయాన్ని గుర్తు చేసుకోవడం కాదు; ఆ విజయానికి చెల్లించిన మూల్యాన్ని కూడా గుర్తు చేసుకోవడం.



ఎం రవీందర్
7901503777

## రతన్ నావల్ టాటాకు భారత రత్న ఇవ్వాలి !

అంతర్జాతీయ స్థాయి వ్యాపార దిగ్గజం, అత్యుత్తమ పారిశ్రామికవేత్త, పరమ దేశభక్తి పరుడు, మానవత్వం మూర్తీభవించిన మహనీయుడు, దాతృత్వంలో అపర కర్ణుడు, నిరాడంబర జీవితం గడిపిన భారత మేధావి, పద్మ విభూషణుడు, సర్వోత్తమ పరోపకారి రతన్ నవల్ టాటా తన 86వ ఏట 09 అక్టోబరు 2024 రోజు వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో ముంబాయిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో కన్ను మూయడంతో దేశవాసులు బాధాతప్త హృదయాతో ఘన నివాళులు అర్పిస్తున్నారు. కానన్ స్కూల్, ముంబాయి, బిషప్ సాల్మన్ స్కూల్, సిమ్లా, రివర్‌డేల్ కంట్రీ స్కూల్, న్యూయార్క్‌లో 1955లో గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. 1959లో కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ డిగ్రీతో పాటు హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువులు చదివారు. టాటా గ్రూపులో ప్రస్థానం: 1961లో టాటా స్టీల్ కంపెనీలో చేరి, 1991లో జె ఆర్ డి టాటా నుంచి అతని వారసుడిగా 1991లో బాధ్యతలు చేపట్టి 10,000 కోట్ల టర్నోవర్ నుంచి 2012 వరకు లక్షల కోట్21 ఏండ్ల పాటు టాటా ఉరుగ్వే ప్రభుత్వ అవార్డు(2004), ( పద్మ విభూషన్(2008), పద్మ భూషన్(2000), మహారాష్ట్ర భూషన్(2006) లాంటి పలు పురస్కారాలు ఆయన ఒడిలో చేరి మురిసి పోయాయి. అనేక అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లు/డి లిట్‌లు, ప్రతిష్టాత్మక పురస్కారాలు అనేకం స్వంతం చేసుకున్నారు. బిజినెస్ టైకూన్‌గా పేరు తెచ్చుకున్న రతన్ టాటా రెండు దశాబ్దాల పాటు టాటా సంస్థను ప్రగతి పరుగులు

భారతదేశానికి ఏ విపత్తు వచ్చినా మొదటగా వందల కోట్ల విరాళాలను ఉదారంగా ప్రకటించడం ఆయన రకితంలోనే ఉన్నది. రతన్ టాటా జీవిత చరిత్ర విశేషాలను శాంతను నాయుడు "ఐ కేమ్ అప్‌ఆన్ ఏ లైట్‌హౌజ్ : ఏ షార్ట్ మెమొరీ ఆఫ్ లైఫ్ విత్ రతన్ టాటా" అనే పేరుతో పుస్తకాన్ని అక్షరీకరించారు. విద్యాభ్యాసం: 28 డిసెంబర్ 1937న బొంబాయిలో పార్సీ జొరాస్ట్రియన్ మతస్తుడు టాటా గ్రూపు వ్యవస్థాపకుడు జమ్‌షెడ్జీ టాటా మునిమనుమడుగా సూరత్‌లో రతన్ నవల్ టాటాసోనీ టాటా దంపతులకు జన్మించాడు. తన 10వ ఏట తల్లితండ్రులు విడిపోవడంతో నవజ్‌బాయి టాటా పెంపకంలో ఎదిగారు. ఛాంపియన్ స్కూల్, ముంబాయిలో 8వ తరగతి వరకు చదివి, కెథడ్రల్ అండ్ జాన్ గ్రూపుకు మార్గనిర్దేశనం చేస్తూ టాటా టీ ద్వారా టెట్లీ టీ, టాటా మోటార్స్ ద్వారా జాగ్వార్ లాండ్ రోవర్, టాటా స్టీల్ ద్వారా కోరస్ లాంటి అంతర్జాతీయ కంపెనీలను స్వంతం చేసుకొని టాటా గ్రూపును అంతర్జాతీయ స్థాయి సంస్థగా రూపొందించి, నాణ్యతకు పర్యాయపదంగా టటా బ్రాండ్‌ను నిలిపారు. జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు:

రతన్ నవల్ టాటా దేశాభివృద్ధికి చేసిన సేవలకు ఎన్ని పురస్కారాలు ప్రకటించిన తక్కువే. భారత రత్న పురస్కారానికి సరైన అర్హుడు మన రతన్ టాటా. ఇప్పటికీ ఆర్డర్ ఆఫ్ రైజింగ్ సన్ జపాన్(2012) ఆర్డర్ ఆఫ్ ఇటాలియన్ రిపబ్లిక్(2009), ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా(2023), అస్సాం వైభవ్(2021), బ్రిటీష్ ఎంపైర్ ఆర్డర్(2009), పెట్టించి, అనేక అంకుర సంస్థలను ప్రోత్సహించి, దేశమే ప్రధానం అంటూ ఆదర్శప్రాయ జీవితాన్ని గడిపారు. నాణ్యతకు మారు పేరుగా టాటాను నిలిపిన దేశ ప్రేమికుడు రతన్ టాటా. స్వదేశీ పరిజ్ఞానంతో ఇండికా కారును తీసుకువచ్చి మార్కెట్ మనసును దోచుకున్నారు. పారిశ్రామికవేత్తగా తనదైన ముద్రను వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి రతన్ టాటా జీవితం నేటి వాణిజ్య వ్యాపార వేత్తలకు పాఠంగా నిలుస్తున్నది. అసాధారణ మానవతావాది భరతమాత ముద్దు బిడ్డకు భారత రత్న ఇవ్వాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు.

మధుసూదన్ రెడ్డి
9949700037

# మత్తు నుంచి యువతను కాపాడాలి

దేశ సరిహద్దులను కాపాడటం ఎంత అవసరమో, యువత మనసులను మత్తు నుంచి కాపాడటం అంతకంటే అత్యవసరం. ఎందుకంటే మాదకద్రవ్యాలు శరీరాన్నే కాదు—ఆలోచనను, ఆశయాన్ని, కుటుంబాన్ని, చివరికి దేశ భవిష్యత్తునే నాశనం చేస్తాయి. కలలు కనాల్సిన కళ్లు మత్తులో మసకబారుతున్నాయి. లక్ష్యాలవైపు పరుగులు తీయాల్సిన అడుగులు వ్యసనాల బురదలో ఇరుక్కుంటున్నాయి. ఒకప్పుడు కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితమై కనిపించిన డ్రగ్స్ ముప్పు ఇప్పుడు కళాశాలలు, హాస్టళ్లు, పట్టణాలు, గ్రామాల దాకా విస్తరిస్తోంది. సరదాగా మొదలయ్యే ఒక ప్రయోగం జీవితాంతం వెంటాడే బంధనంగా మారుతోంది. అందుకే మాదకద్రవ్యాల వ్యసనాన్ని వ్యక్తిగత బలహీనతగా కాకుండా, దేశ యువశక్తిపై జరుగుతున్న నిశ్శబ్ద దాడిగా చూడాల్సిన సమయం వచ్చింది.ఈ ముప్పు ఎంత లోతుగా వేళ్లూనుకుందో అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2018 జాతీయ సర్వే ప్రకారం దేశంలో సుమారు 3.1 కోట్ల మంది గంజాయి సంబంధిత పదార్థాలను, 2.26 కోట్ల మంది ఓపియాయిడ్లను వినియోగించినట్లు అంచనా. వీరిలో దాదాపు 77 లక్షల మందికి ఓపియాయిడ్ వినియోగ సమస్య నుంచి బయటపడేందుకు చికిత్స లేదా సహాయం అవసరమని గుర్తించారు. అంతేకాదు, సుమారు 8.5 లక్షల మంది ఇంజెక్షన్ల ద్వారా మాదకద్రవ్యాలను తీసుకుంటున్నట్లు వెల్లడైంది. అంటే సమస్య కేవలం అప్పుడప్పుడు మత్తు పదార్థాలు వినియోగించడానికే పరిమితం కాలేదు; వ్యసనం, ఆరోగ్య ప్రమాదాలు,

మరోవైపు అక్రమ సరఫరా వ్యవస్థ ఎంత భారీగా ఉందో స్వాధీనం అవుతున్న మాదకద్రవ్యాల పరిమాణం సూచిస్తోంది. 2024లో దేశవ్యాప్తంగా సుమారు 13.30 లక్షల కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వాటి అంచనా విలువ రూ.27,525 కోట్లు. ఈ సంఖ్యలను వినియోగం పెరుగుదలకు ప్రత్యక్ష కొలమానంగా చూడలేకపోయినా, దేశంలోకి ప్రవేశిస్తున్న లేదా అక్రమంగా చలామణి అవుతున్న డ్రగ్స్ వ్యాపార పరిమాణం ఎంత ఆందోళనకరంగా ఉందో అవి తెలియజేస్తున్నాయి.అదే తీవ్రత నేర గణాంకాల్లోనూ కనిపిస్తోంది. 2025లో దేశవ్యాప్తంగా 1.48 లక్షలకు పైగా మాదకద్రవ్యాల కేసులు నమోదై, 1.83 లక్షలకు పైగా మంది అరెస్టయ్యారు. ఒకవైపు కోట్ల మందిని ప్రభావితం చేస్తున్న వినియోగ సమస్య, మరోవైపు లక్షల కేసులు, అరెస్టులు—ఈ రెండింటినీ కలిపి చూస్తే డ్రగ్స్ సమస్యకు కేవలం పోలీసు చర్యలు మాత్రమే పరిష్కారం కాదని స్పష్టమవుతోంది. సరఫరాను అడ్డుకోవడంతోపాటు డిమాండ్‌ను తగ్గించడం, వ్యసనానికి గురైన వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం సమాంతరంగా జరగాలి.ముఖ్యంగా కళాశాలలు, హాస్టళ్లు, యువత ఎక్కువగా సమావేశమయ్యే ప్రదేశాలను మాదకద్రవ్యాల విక్రేతలు లక్ష్యంగా చేసుకోవడం మరింత ఆందోళనకరం. స్నేహితుల ఒత్తిడి, కొత్త అనుభూతులపై ఆసక్తి, మానసిక ఒత్తిడి, కుటుంబ పర్యవేక్షణ లోపం వంటి కారణాలతో కొందరు యువకులు వ్యసనాలకు దగ్గరవుతున్నారు. అందుకే విద్యాసంస్థల్లో కేవలం తనిఖీలు నిర్వహించడం సరిపోదు. విద్యార్థులకు కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య సహాయం, ఫిర్యాదు చేయడానికి సురక్షిత వ్యవస్థలు కల్పించాలి.

ఈ ద్వంద్వ సవాలును ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ద్వారా అక్రమ రవాణాపై నిఘా పెంచడంతోపాటు నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా డిమాండ్ తగ్గింపు, అవగాహన కార్యక్రమాలను చేపడుతోంది. 2026 సెప్టెంబరు నాటికి ఈ కార్యక్రమం 34 కోట్ల మందికిపైగా ప్రజలకు చేరినట్లు ప్రభుత్వం తెలిపింది. చికిత్స, పునరావాస కేంద్రాలకు మద్దతు ఇవ్వడంతోపాటు వ్యసన విముక్తి సహాయం కోసం 14446 హెల్ప్‌లైన్‌ను అందుబాటులో ఉంచింది. అయితే ఎంతమందికి అవగాహన కల్పించామన్నది ఒక ప్రమాణం మాత్రమే. చికిత్స పొందినవారు ఎంతమంది, వ్యసనం నుంచి బయటపడ్డవారు ఎంతమంది, తిరిగి మత్తుకు బానిస కాకుండా నిలిచినవారు ఎంతమంది అన్నదే అసలైన ఫలిత సూచిక కావాలి.ప్రభుత్వ చర్యలు మరింత ఫలితాలనివ్వాలంటే సరఫరా మూలాలను ఛేదించాలి. సరిహద్దుల్లో నిఘా, అంతర్రాష్ట్ర పోలీసు సమన్వయం, అక్రమ ఆర్థిక లావాదేవీల గుర్తింపు, డ్రగ్ నెట్‌వర్క్‌ల ఆస్తుల జప్తును మరింత కఠినంగా అమలు చేయాలి. అదే సమయంలో ప్రతి విద్యాసంస్థలో మాదకద్రవ్యాల నిరోధక కమిటీ, శిక్షణ పొందిన కౌన్సెలర్, గోప్యమైన ఫిర్యాదు వ్యవస్థ ఉండాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో అకస్మాత్తుగా వచ్చే మార్పులను గమనించాలి. వ్యసనానికి గురైన వారిని నేరస్థులుగా ముద్ర వేయకుండా అవసరమైన వైద్యసహాయం, కౌన్సెలింగ్, పునరావాసం అందించాలి.మత్తు ఒక్క యువకుడిని మాత్రమే కబళించదు; ఒక కుటుంబ ఆశలను, సమాజ ఉత్పాదకతను, దేశ భవిష్యత్తునూ దెబ్బతీస్తుంది. అందుకే డ్రగ్స్‌పై పోరాటం పోలీసులకే పరిమితమైన బాధ్యత కాదు. ప్రతి ఇంటి నుంచి, ప్రతి విద్యాసంస్థ నుంచి మొదలయ్యే సామాజిక ఉద్యమంగా మారాలి. యువత చేతిలో మత్తు కాదు—లక్ష్యం ఉండాలి. యువతను మత్తు నుంచి కాపాడగలిగితేనే భారత భవిష్యత్తును కాపాడగలం.



సి. హెచ్. ప్రతాప్
77938 00743

# జాతీయం-అంతర్జాతీయం

## నోబెల్ శాంతిపై ట్రంప్ హడావుడి



**అమెరికా**

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి 'నోబెల్' ఆకాంక్షను బయటపెట్టారు. తానేమీ గొప్పలు చెప్పడం లేదని,

**ఎనిమిది యుద్ధాలు ఆపానంటూ మళ్లీ చాటింపు వేసుకుంటున్నారు.**

ఒకవైపు ఇరాన్‌తో యుద్ధం చేస్తోన్న ఆయన.. శాంతి బహుమతి ) ప్రకటన వేళ హడావుడి మొదలుపెట్టారు.

**"ఇంకెవరూ చేయలేని పనులు నేను చేశాను.**

నేను గొప్పలు చెప్పడం లేదు. వాస్తవాలు మాత్రమే మాట్లాడుతున్నాను. ఏ అధ్యక్షుడు కూడా ఇన్ని యుద్ధాలకు పరిష్కారం చూపించి ఉండకపోవచ్చు. నేను 8 యుద్ధాలు ఆపాను. నోబెల్ శాంతి బహుమతి

**పొందేందుకు నేను అర్హుడిని. కానీ అది నాకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువే.**

వారి (నోబెల్ కమిటీని ఉద్దేశిస్తూ) నిర్ణయం ఏంటో నాకు తెలియదు. నాలాంటి వారికి ఈ పురస్కారం ఇవ్వకపోవడమే వారికి అలవాటుగా కనిపిస్తోంది''

**అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు.**

**అణువుల్లో కుడి ఎడమల గుట్టు విప్పిన శాస్త్రవేత్తలకు నోబెల్నోబెల్**

శాంతి బహుమతిని ఏటా నార్వేజియన్ నోబెల్ కమిటీ ప్రదానం చేస్తోంది. 2026 ఏడాదికిగానూ ఈ పురస్కారాన్ని అక్టోబర్ 9న ప్రకటించనున్నారు. గతేడాది కూడా నోబెల్‌పై ట్రంప్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

**కానీ వెనెజువెలా విపక్ష నేత మరియా కోరీనా మచాడోకు అది దక్కడంతో ఆయనకు నిరాశ తప్పలేదు.**

ఈ ఏడాది నామినేషన్లలో ట్రంప్ పేరు ఉండొచ్చని గతంలోనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం ఎవరిని వరిస్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

## ఓపీటీకి 70 వేల డాలర్ల ఫీజు!



**వాషింగ్టన్:**

అమెరికాలో పైచదువులు చదవాలని కోరుకునే విదేశీ యువత కలలను కల్లలు చేసే కొత్త ప్రతిపాదనను ట్రంప్ యంత్రాంగం తెరమీదికి తెచ్చింది.

**అమెరికా విద్యా సంస్థల్లో చదువు పూర్తి చేసిన తర్వాత ఆ దేశంలో పని చేయాలని కోరుకునే ప్రతి అంతర్జాతీయ**

విద్యార్థిపై 70 వేల డాలర్లు ఫీజుగా చెల్లించాలని హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం బుధవారం ప్రతిపా-దించింది. ఈ ఫీజును సంబంధిత విద్యా సంస్థలే చెల్లించాల్సి ఉంటుంది.

**అమెరికా విద్యా సంస్థల్లో తాము చదివిన మేజర్ సబ్జెక్టులో అనుభవం గడించేందుకు క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు**

వీలు కల్పించే ఆప్షనల్ ప్రాక్టీస్ ట్రైనింగ్ ప్రోగ్రాం (ఓపీటీ)లో పాలుపంచుకునే విద్యార్థులకు సంబంధించి ఈ ఫీజు చెల్లించాలన్నది ప్రతిపాదన. అమెరికా నిబంధనల ప్రకారం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అంతర్జాతీయ విద్యార్థులు సాధారణంగా ఏడాది పాటు పనిచేసుకునేందుకు అర్హులు.

**అయితే విజ్ఞాన శాస్త్రం, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం చదివిన విద్యార్థులు అదనంగా మరో రెండేళ్లపాటు**

ఉపాధి పొందే వీలుంది. ప్రభుత్వ తాజా ప్రతిపాదన ఆదాయం కోసం విదేశీ విద్యార్థుల్ని ఆకర్షించే అమెరికన్ కాలేజీలు, విశ్వవిద్యాలయాలకు కూడా శరాఘాతమే! అంతర్జాతీయ విద్యార్థులను

**నియమించుకునే టెక్ కంపెనీలు, పరిశ్రమలు ఈ నేపథ్యంలో సిబ్బంది**

కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. తాజా ప్రతిపాదన ప్రకారం ఓపీటీ కింద పని చేసుకునేందుకు

**దరఖాస్తు చేసుకునే ప్రతి విద్యార్థిపై సంబంధిత విద్యా సంస్థ 70 వేల డాలర్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.**

పనిచేసుకునే అనుమతిని పొడిగించుకునేందుకు జరిపే ప్రతి రెన్యువల్‌కు 30 వేల డాలర్లు చొప్పున చెల్లించాలని ప్రతిపాదించారు.

### వ్యవస్థలు బలహీనపడితే

## ప్రజాస్వామ్యం మిగలదు !

**న్యూఢిల్లీ :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను ఎన్నికల కమిషన్ చేపట్టిన తీరును మేఘాలయ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సంజీవ్ బెనర్జీ విమర్శించారు.

**ఓటు వేసే అర్హతను రుజువు చేసుకునే భారాన్ని పౌరులపైనే తప్పుగా మోపారంటూ ఆయన వ్యాఖ్యానించారు.**

ఎస్ఐఆర్ వివాదం కేవలం ఓటరు ఫారాలకు మాత్రమే సంబంధించినది కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

**పౌరుల ఓటింగ్ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఎవరిదనే విస్తృత రాజ్యాంగబద్ధమైన ప్రశ్నను ఇది లేవనెత్తిందని అన్నారు.**

అలాగే ఎన్నికల సంస్థల స్వతంత్రత, విశ్వసనీయత పరిరక్షించగలుగుతున్నామా లేదా అనే ప్రశ్న కూడా తలెత్తిందన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో జరిగిన విస్తృత చర్చలో ఆయన పై అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



**18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడూ అర్హుడే..**

చట్టపరంగా అనర్హుడైతే తప్ప 18ఏళ్ళు నిండిన ప్రతి పౌరుడూ ఓటువేసేందుకు అర్హుడేనని రాజ్యాంగంలోని 325, 326 అధికరణలు స్పష్టంగా పేర్కొంటున్నాయని,

**అటువంటపుడు కమిషన్ మళ్ళీ అనవసరంగా వారి అర్హతలను రుజువు చేసుకోవాలని కోరకూడదన్నారు.**

ఫారమ్ 6కి మార్పులు చేసే అధికారం ప్రభుత్వానిదైనపుడు ఏకపక్షంగా చీఫ్ ఎన్నికల కమిషనర్ వాటిని మార్చరాదని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్యాంగబద్ధమైన సంస్థ అధిపతితో ముడిపడిన వ్యవహారమైనందున తక్షణమే ఈ విషయంలో తీర్పు ఇవ్వాలని ఆశించరాదని సంజీవ్ బెనర్జీ హెచ్చరించారు. అన్ని రికార్డులను కోర్టు పరిశీలించాలని, అన్ని పక్షాల వాదనలను పూర్తిగా వినాలని అప్పుడే ఒక నిర్ధారణకు రావాలని అన్నారు.

**తన స్వంత నియోజకవర్గమైన బాబనిపూర్‌లో ఎన్నికల మార్జిన్ దాదాపు 15వేలు వుండగా,**

అక్కడ దాదాపుగా 40వేల నుండి 44వేల మంది ఓటర్లను తొలగించినట్లు వార్తలు వచ్చాయని అన్నారు.

**అందులో 40శాతం మంది ముస్లింలేనని గర్తు చేశారు.**

నియోజకవర్గంలోని మొత్తం ముస్లిం జనాభా 24శాతమే అయితే తొలగించినవారిలో 40శాతం మంది వీరేనని పేర్కొన్నారు.

## రష్యాలో రెండో ప్లేగు మరణం?

**రష్యా**

ప్లేగు వ్యాప్తిపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ వ్యాధితో తాజాగా మరో మరణం సంభవించిందంటూ ఆ దేశ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీనిపై స్పందించిన క్రెమ్లిన్ (Kremlin) ఆ వార్తలను కొట్టిపారేసింది.

**అదంతా తప్పుడు సమాచారమేనని స్పష్టంచేసింది.**

అంటువ్యాధి ప్రబలే ప్రమాదం లేదని తేల్చి చెప్పింది.సైబీరియాలోని యాంటీ ప్లేగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేసే షిపిలోవా అనే మహిళ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.

**ఆమె మరణానికి ల్యాబ్ నుంచి లీకైన ప్లేగు బ్యాక్టీరియానే కారణమని వార్తలు వచ్చాయి.**

దీంతో ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఇదే సమయంలో రష్యాలో మరో వ్యక్తి కూడా ఈ వ్యాధి కారణంగా మరణించారంటూ కథనాలు రావడం ఆందోళనకు గురిచేసింది. ఈ నేపథ్యంలోనే క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఈ వార్తలపై స్పందించారు. అదంతా అసత్య ప్రచారమేనని తెలిపారు. ఆరోగ్య విభాగం నుంచి అధికారికంగా వచ్చిన సమాచారాన్నే విశ్వసించాలని ప్రజలను కోరారు.

**నేను గొప్పలు చెప్పట్లేదు.. నోబెల్ నాకే రావాలి:**

శాంతి బహుమతిపై మళ్లీ ట్రంప్ హడావుడిమరోవైపు, షిపిలోవాతో సన్నిహితంగా ఉన్న కుటుంబ సభ్యులు,

**సిబ్బందిని వైద్య పర్యవేక్షణలో ఉంచిన సంగతి తెలిసిందే.**

ఇప్పటివరకు వారెవరిలోనూ ప్లేగు లక్షణాలు గుర్తించలేదని రష్యా (Russia) ఆరోగ్య పర్యవేక్షణ సంస్థ వెల్లడించింది.



5వేలకు పైగా ల్యాబ్ పరీక్షలు చేసి ఈ విషయాన్ని నిర్ధరించుకున్నట్లు తెలిపింది. క్వారంటైన్‌లో ఉంచిన వారిలో 90 శాతం మందిని బయటకు పంపినట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా.. రష్యాలో ప్లేగు బ్యాక్టీరియా లీక్‌పై అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ మరోసారి స్పందించారు.

**ఇది జీవాయుధ ప్రయోగం అయి ఉండొచ్చా?**

అనే ప్రశ్నకు బదులిస్తూ.. తాను అలా భావించడం లేదని తెలిపారు. దీని గురించి రష్యా నుంచి మరింత సమాచారం కోరుతున్నట్లు పేర్కొన్నారు.

## ఓటు బ్యాంకులు: దేశాభివృద్ధికి సంకెళ్లు

**దిల్లీ:**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత దేశం సమున్నత స్థాయికి చేరుకోగలదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృఢ విశ్వాసం వ్యక్తం చేశారు. మరి కొన్నేళ్లలో మన దేశం వికసిత్ భారత్‌గా ఆవిర్భవించడం ఖాయమని పేర్కొన్నారు. అయితే,

**ఎన్నికల్లో లబ్ధి కోసం చేసే కుల రాజకీయాలు ఈ లక్ష్య సాధనలో అవరోధంగా నిలుస్తాయని హెచ్చరించారు.**

దేశ పౌరులందరూ ఐక్యంగా దీనిని అధిగమించాలని సూచించారు. ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా బుధవారం దిల్లీలో నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్ప సభ'లో ఆయన ప్రసంగించారు. ''మనం కలలు కంటున్న అభివృద్ధి చెందిన భారత్ సాకారమవుతుంది. ఆ లక్ష్యాన్ని చేరుకోకుండా మన దేశాన్ని ఏవీ అడ్డుకోలేవు.

**140కోట్ల మంది అందరం కలిసి 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను కచ్చితంగా నిర్మించుకోగలం. ఆ లక్ష్యాన్ని మనం సాధించగలం.**

ఓటు బ్యాంకు రాజకీయాలు ప్రజల ఐక్యతను దెబ్బతీస్తాయి. దేశాభివృద్ధికి అవరోధమవుతాయి. ఏదైనా విపత్తు సంభవించినప్పుడు ఒక కులానికో, వర్గానికో అది పరిమితం కాదు. అందరూ దాని దుష్పరిణామాలకు గురవుతారు.

**రైతులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటే దాని ప్రభావం వారి ఒక్కరిపైనే ఉంటుందా?**

విద్యుత్ కొరత ఏర్పడితే చీకట్లు ముసురుకునేది ఒక వర్గానికేనా? సమస్య అందరిదీ అయినప్పుడు పరిష్కారం కూడా అందరిదీ కావాలి.వికసిత్ భారత్‌ను ఆవిష్కరించుకోవాలన్న లక్ష్య సాధనకు ఎన్నో సవాళ్లు ఉండవచ్చు.

**కానీ 140 కోట్ల పరిష్కారాలు కూడా ఉన్నాయి.**

గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001 అక్టోబరు 7న తొలిసారి ప్రమాణం చేసినప్పుడు రాష్ట్ర, జాతీయ ప్రభుత్వాధినేతగా 25ఏళ్ల మైలురాయిని అధిగమిస్తానని ఊహించలేదు. ప్రజాజీవితంలో ప్రజలే నా దేవుళ్లు. వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. కష్టపడి పనిచేసే కార్యకర్తలే బలం. భాజపా, ఎన్‌డీఏలోని సహచరులకు, ప్రజాస్వామ్యంపై అపారగౌరవం ఉన్న అందరికీ కృతజ్ఞతలు.ఉపాధ్యాయులు నాకు వినయం నేర్పారు. తొక్కివేయాలని యత్నించిన వాళ్లు మళ్లీ పైకి ఎలా లేవాలో బోధించారు. విమర్శకులు ఆత్మపరిశీలనకు అవకాశం కల్పించారు. నా వెంట నిలిచిన వాళ్లు నమ్మకానికున్న శక్తి ఏమిటో నిరూపించారు.



**నన్ను వ్యతిరేకించిన వాళ్లు ప్రజాస్వామ్య బలం ఏమిటో తెలియజేశారు.**

ఎదురైన ప్రతి సంక్షోభం నా సహనాన్ని పరీక్షించింది. సాధించిన ప్రతి విజయం మరిన్ని బాధ్యతలను మోపింది. దేశం నాపై అపారమైన ఆశీర్వాదాలు కురిపించింది.

**నేను ఒంటరిని అని ఎన్నడూ భావించలేదు. భారత సంస్కృతికి పరిరక్షకులైన అసంఖ్యాకమైన స్వయంసేవకులు ఉన్నారు.**

వారి ఏకైక లక్ష్యం భారత్‌కు సేవచేయడమే. 'మేం సేవకులం. మానవ సేవకులం' అన్న స్ఫూర్తితోనే వారందరూ జీవిస్తున్నారు.

**అత్యంత భక్తితో దేశానికి సేవలందిస్తోన్న స్వయంసేవకులు, కార్యకర్తలు అందరికీ గౌరవ వందనాలు.**

25 ఏళ్ల ప్రజాజీవితం ఎన్నో విలువైన అనుభవాలను సంపదగా సమకూర్చింది. ఈ ఆస్తి నా ఒక్కడిది కాదు. దేశమాత బిడ్డలందరిదీ. నిత్య విద్యార్థిగా ఉంటూ ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకుంటాను.ఇతరుల విజయం కోసమే ఎన్నికల్లో పోరాడాను. నాకుగా నేను ఎన్నడూ పోటీ చేయలేదు. ఎన్నికల రాజకీయాల్లో ఎదగాలన్న కోరిక ఉండి ఇంతకన్నా ముందుగానే బరిలోకి దిగేవాణ్ని. అది నా స్వభావం కాదు. ఎలాంటి బాధ్యతలను నిర్వర్తించాల్సి వచ్చినా ఒక్కొక్కటిగా వాటిని పూర్తిచేసుకుంటూ వచ్చా.దేశానికి నిస్వార్థ సేవ చేయడమే నా జీవితానికి నిర్దేశించుకున్న ఏకైక లక్ష్యం. కర్తవ్యమే నాకు సర్వస్వం.

**కర్తవ్యమే మతం. కర్తవ్య నిర్వహణలో సర్వశక్తులూ వినియోగించడం, నిరంతరంగా కృషిచేయడమే విధిగా భావిస్తాను. పని ఆగకూడదు.**

ప్రయత్నమూ ఆగకూడదు.కర్తవ్యం.. బాధ్యత మాత్రమే కాదు దేశం పట్ల నాకున్న భక్తి, అంకిత భావం. దేశం కోసం, ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటా'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.భాజపా అగ్రనేత ఎల్.కె.అద్వాణీ నివాసంలో ఆయన ఆశీర్వాదం తీసుకుంటున్న ప్రధాని మోదీప్రపంచ నేతల అభినందనలుభారత దేశాన్ని పురోగామి పథంలో నడిపించడంలో ప్రధాని మోదీ అమోఘమైన కృషి చేస్తున్నారని పలు దేశాల అధినేతలు, ప్రభుత్వాధినేతలు ప్రశంసించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, హోంమంత్రి అమిత్ షా, భాజపా అధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు.

## జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాల్సిందే!

**న్యూఢిల్లీ**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా సాగుతున్న పోరాటాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాలని ఎస్ఎఫ్ఐ, సిజెపి, ఎఐఎస్ఎఫ్, ఎఐఎస్ఎ, ఎఎస్ఎపి తదితర విద్యార్థి, యువజన సంఘాలు నిర్ణయించాయి. జ్ఞానేష్‌కుమార్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో దేశంలోని యువత, విద్యార్థి సంఘాలు, ప్రజలు ఒక్కతాటిపై ఉన్నారని ఆయా సంఘాల నాయకులు వెల్లడించారు.

**ఇది బిజెపికి, దేశ ప్రజలకు మధ్య జరుగుతున్న పోరాటమని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం నాడిక్కడ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించి**

న విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం. సాజి, సిజెపి జాతీయ కో కన్వీనర్ సౌరభ్ దాస్,సిజెపి న్యాయ విభాగం ప్రతినిధి రత్నా సింగ్, ఎఐఎస్ఎఫ్ అఖిల భారత అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, ఎఐఎస్ఎ అఖిల భారత అధ్యక్షురాలు నేహా బోరా, ఎఎస్ఎపి కో ఇన్‌ఛార్జ్ ఈష్నా గుప్తా మాట్లాడారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ

**అక్టోబర్ 10న జంతర్‌మంతర్‌కు భారీ మార్చ్ నిర్వహించాలని సంఘాలు నిర్ణయించాయని తెలిపారు.**

రాజీనామాతోపాటు జ్ఞానేష్‌కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని, ఎన్నికల కమిషన్‌లో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు.నియంతృత్వానికి ప్రజాస్వామ్యానికి మధ్య పోరాటం :

**ఆదర్శ్ ఎం. సాజి దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను జ్ఞానేష్ కుమార్ హత్య చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం. సాజి విమర్శించారు.**

నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా తాము ఐక్యంగా పోరాడతామని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్నది నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య పోరాటమని అన్నారు. ఈ పోరాటంలో ప్రజాస్వామ్యం, భారత ప్రజలే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. జెన్ జీకి ప్రభుత్వం భయపడుతోంది :

**సౌరవ్ దాస్ జ్ఞానేష్ కుమార్ వంటి**



**దేశద్రోహులు కీలక పదవుల్లో కొనసాగుతున్నంతకాలం దేశం పురోగతి సాధించదని సిజెపి జాతీయ కో కన్వీనర్ సౌరభ్ దాస్ అన్నారు.**

ఇలాంటి వారిని వ్యవస్థ నుంచి బయటకు పంపాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ముఖ్యంగా జెన్‌జీ యువత ఈ బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**జెన్-జీ యువతను ప్రభుత్వం భయపడుతోందని సౌరభ్ దాస్ ఆరోపించారు.**

2024 నుంచి జెన్‌జీ యువతను ఓటర్ల జాబితాలో చేర్చకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని విమర్శించారు.

**జెన్-జీ ఓట్లు తమకు అనుకూలంగా ఉండవనే భయంతోనే బిజెపి ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.**

ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతూనే ఉంటారు : నేహా బోరా

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు ఒక విస్తృత పౌర ఉద్యమంగా పరిణామం

**చెందాయని ఎఐఎస్ఎ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా అన్నారు. ప్రజాస్వామ్యం, ఓటర్ల జాబితాలు,**

నిరసన తెలిపే హక్కుపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతూనే ఉంటారని తెలిపారు.

**ఎన్నికల ప్రక్రియపై ఆందోళనలు, ఓటర్ల హక్కులను కాలరాస్తున్నారనే ఆరోపణలు పౌరులకు**

అత్యవసర సమస్యగా మారాయన్న సందేశాన్ని పోరాటం పంపిందని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలను పరిరక్షించాల్సిన ఒక వ్యక్తి, ఒక సంస్థ నుండి జవాబుదారీతనం కోరడమే ఈ ఆందోళన లక్ష్యమని ఆమె అన్నారు.

**అనుమతి కోరుతూ వినతిఅక్టోబర్ 10న జంతర్‌మంతర్‌లో నిర్వహించనున్న నిరసనకు**

అధికారిక అనుమతి కోరుతూ సిజెపి నేత సౌరభ్ దాస్ పార్లమెంట్ పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. జంతర్‌మంతర్‌లో నిర్వహించనున్న ఆందోళన సుదీర్ఘంగా కొనసాగుతుందని వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మీడియాకు తెలిపారు.

ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను కాపాడాలని, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని సంఘాల నాయకులు ప్రకటించారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: రాహుల్

**న్యూఢిల్లీ:**

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి చేపట్టిన నిరసనలు మూడో రోజుకు చేరుకున్నాయి. గురువారం కూడా విపక్ష ఎంపీలు ఢిల్లీలో ఆందోళన కొనసాగించారు. నిరసనల్లో భాగంగా విపక్ష ఎంపీలు తొలుత రాజ్‌ఘాట్‌కు చేరుకుని మహాత్మాగాంధీ సమాధి వద్ద నివాళులర్పించారు.

**అనంతరం తమ ఆందోళన కొనసాగించారు.**

ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్

**అధినేత మోహన్ భగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్రస్థాయిలో**

విమర్శలు చేశారు. మోడీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్‌ల



కు శిక్ష తప్పదని, ఇది తన హామీ అని వ్యాఖ్యానించారు.

**శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం తమను అడ్డుకుంటోందని విమర్శించారు.**

మొదటి రోజు ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లకుండా, మరుసటి రోజు జంతర్ మంతర్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారని తెలిపారు. తమ ఎంపీలపై దాడులు జరిగాయని ఆరోపించారు.

**రేపు రాష్ట్రపతితో భేటీ ఎన్నికల సంఘంపై వస్తున్న ఆరోపణలపై తదుపరి కార్యాచరణకు 'ఇండియా'**

కూటమి నేతలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం విపక్ష ఎంపీలు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు.

**ఇప్పటికే రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ తీసుకున్న నేతలు..**

ఎన్నికల సంఘంపై తమ ఆరోపణలతో కూడిన వినతిపత్రాన్ని ఆమెకు సమర్పించనున్నారు.

## బెంగళూరులో సిజెపి చెప్పుల నిరసన

**బెంగళూరు:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో అవకతవకలు జరిగాయంటూ కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి) బెంగళూరులో నిరసన చేపట్టింది. గురువారం ఫ్రీడమ్ పార్క్‌లో 'పీపుల్స్ ట్రిబ్యునల్' నిర్వహించిన అనంతరం

**'చెప్పుల నిరసన' చేపట్టనున్నారు. సర్ ప్రక్రియలో**

అర్హులైన ఓటర్ల పేర్లు అన్యాయంగా తొలగించారని సిజెపి విమర్శించింది. ఈ సమస్యను ప్రజల దృష్టికి తీసుకురావడమే నిరసన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కర్ణాటకలో సర్ కారణంగా ప్రభావితమైనవారిని కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ నిరసనలో నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్, యూట్యూబర్ ధ్రువ్ రాఠీతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

**సర్ పై పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని**

వారు పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని సిజెపి డిమాండ్ చేసింది.

**అలాగే సర్ లో తొలగించిన పేర్లను పునరుద్ధరించాలని,**

సవరణ ప్రక్రియపై స్వతంత్ర విచారణ చేపట్టాలని, గత ఓటర్ల జాబితాను కొనసాగించాలని కోరింది. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం ధృవీకరించలేదని కూడా గమనించాలి. ఇదిలా ఉండగా,

**దేశ ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా**

చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష యువజన సంఘాలు అక్టోబర్ 10న మరో నిరసనను నిర్వహిస్తున్నాయి. ప్రజాస్వామ్య ఉద్యమాన్ని మరింత నిరసనలో భారీ సంఖ్యలో కార్యకర్తలను భాగస్వాములను చేస్తామని వామపక్ష విద్యార్థి సంఘాలు, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, ఆర్వైఏ, ఆర్వైఎఫ్, ఏఐడీవైఓ, ఏఐవైఎల్ సంయుక్త ప్రకటనలో ప్రకటించాయి.

## హింస వల్ల నరాల బలహీనత

**దిల్లీ:**

బాల్యంలో హింసకు, వేధింపులకు గురైనవారి మెదడులో కొన్ని చోట్ల పైపొర పలుచబడి గాయపు చారలు ఏర్పడే అవకాశం ఉందని ఓ మానసిక అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనం వెల్లడించింది. ఎనిమిది దేశాల నుంచి సేకరించిన శ్యాంపిళ్ల ఆధారంగా జరిగిన ఈ అధ్యయనానికి అమెరికా యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియాకు చెందిన పరిశోధకులు నేతృత్వం వహించారు.

**"బయోలాజికల్ సైకియాట్రీ" అనే జర్నల్‌లో దీని సారాంశాన్ని ప్రచురించారు.**

బాల్యంలో ఎదురయ్యే వేధింపులు, హింస ఎంత తీవ్రంగా ఉంటే మెదడులో అంత తీవ్రమైన మార్పులు సంభవిస్తాయని, ఈ మార్పులు పురుషుల కన్నా స్త్రీలలోనే అధికంగా కనిపిస్తాయని నివేదిక తెలిపింది.

**బాల్యావస్థలో ఎదురయ్యే ప్రతికూలతలు మెదడు నిర్మాణంపై విభిన్న రకాల మార్పులకు దారితీస్తాయని, ఈ మార్పులు వ్యక్తి వయసు,**

లింగంతో మారుతాయని ఇది తెలియజేసింది.

**బాల్యంలో మగపిల్లల కన్నా ఆడపిల్లలు లైంగిక దాడులకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నందున స్త్రీలలో మెదడుపై ప్రతికూల ప్రభావం అధికంగా**

ఉండే అవకాశం ఉందని అధ్యయనకర్తలు తెలిపారు. బాల్యంలో మనిషి మెదడు ఇంకా పరిణామ దశలో ఉంటుంది. నాడీ వ్యవస్థ ఆ దశలో స్థితిని హైటెన్డ్ ప్లాస్టిసిటీ (ఉచ్ఛదశలో శీలత) అంటారు. ఈ రంగంలో ఇప్పటివరకూ జరిగిన అధ్యయనాలన్నిటికన్నా



తమ పరిశోధన పెద్దదని పరిశోధకులు

**పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్‌డీ), మేజర్ డిప్రెసివ్ డిజార్డర్ (ఎండీఈడీ) అనే మానసిక**

ఒత్తిడికి సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న 1389 మంది రోగుల ఎమ్మారై చిత్రాలను, 2322 మంది ఆరోగ్యవంతులైన వ్యక్తుల మెదడు చిత్రాలను ఈ పరిశోధనలో భాగంగా పరిశీలించారు. మెదడు బాహ్య పొర అయిన కార్టెక్స్ దళసరితనాన్ని,

**లోపలి పొరల ఘనపరిమాణం వంటి కొలతల్ని ఈ అధ్యయనంలో భాగంగా పరిశీలించారు.**

పసితనంలో హింసకు, వేధింపులకు గురైన 18 నుంచి 35 ఏళ్ల వ్యక్తుల్లో మెదడులోని థాలమస్ (మెదడు మధ్యలో అక్రోటు కాయంత పరిమాణంలో సమాచార ప్రసరణకు ఉపయోగపడే ప్రత్యేక భాగం),

**పాలిడమ్ (మనిషి మెదడులో ఉపచేతనావస్థను నియంత్రించే భాగం)ల ఘనపరిమాణం ఎక్కువగా,**

ఇస్త్‌మస్, మిడిల్ ఫ్రంటల్ ప్రాంతాల పరిమాణం తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. బాల్యంలో తీవ్ర వేదనకు గురైన వారి థాలమస్, ఘనపరిమాణం అసాధారణంగా ఎక్కువగా ఉంటుందని అధ్యయనకర్తలు చెబుతున్నారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలి



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 08 (వుదయం జిల్లా ప్రతినిధి):**

ఎల్ నినో ప్రభావం వల్ల యాసంగి (రబీ) సీజన్‌లో నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును పెద్ద ఎత్తున చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో యాసంగిలో పంటల సాగు కార్యాచరణ ప్రణాళికపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి సాగుపై అధికంగా ఆధారపడకుండా జొన్న, మినుములు, పెసర్లు, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని పంటల ప్రణాళిక రూపొందించాలని, భూములు బీడుగా ఉండకుండా ప్రత్యామ్నాయ పంటలు, పప్పుధాన్యాలు, కూరగాయల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల ప్రయోజనాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి సాగు ప్రణాళికపై సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. గత రబీ సీజన్‌లో సాగు పరిస్థితులను సమీక్షించి, లోటుపాట్లను అధిగమించేలా ఈసారి ముందస్తు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియలను వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యూరియా పంపిణీలో ఎదురవుతున్న సమస్యలు, అడ్డంకులపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సలహాలు సకాలంలో అందేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సాంప్రదాయ ఎరువుల వినియోగాన్ని తగ్గించి, నానో ఎరువుల వినియోగంపై రైతులకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నానో డీఏపీ, నానో యూరియా వినియోగంతో పంటలకు అవసరమైన పోషకాలు సమర్థంగా అందడంతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఉందన్నారు. నానో ఎరువుల వల్ల రవాణా, నిల్వ, వినియోగం సులభమవడంతో పాటు రైతులకు ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, ఉద్యానవన శాఖ అధికారి తిరుపతి, వ్యవసాయ శాఖ ఏడీలు శ్రీపాల్, రమేష్, కోరమండల్ సంస్థ అగ్రోనమిస్ట్ వినోద్, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలి



**అధికారులకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశం.**

**దామెర చెరువు, అంగడి మైదానాల్లో ఉత్సవ ప్రాంగణాల పరిశీలన.**

**పరకాల, అక్టోబర్ 8 (వుదయం ప్రతినిధి):**

పరకాల పట్టణంలో బతుకమ్మ ఉత్సవాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవాలకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

గురువారం పరకాల పట్టణంలోని దామెర చెరువు, అంగడి మైదానంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించే ప్రదేశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్సవ ప్రాంగణాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు సరిపడా వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పండుగకు వచ్చే ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పరిశీలనలో పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, తహసీల్దార్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు బండి శ్రీధర్, అల్లె దశరథం, కుక్కల విజయ్, ఏఈ ప్రవీణ్ కుమార్, టీపీఎస్ రాజ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు

## టీబీ ముక్త్ పంచాయతీగా ఎంపిక సర్పంచులకు సన్మానం

**భూపాలపల్లి: అక్టోబర్ 08 (వుదయం విలేకరి):**



టీబీ ముక్త్ పంచాయతీలో భాగంగా గ్రామ పంచాయతీలో స్థానిక సంస్థల ప్రతినిధులు, ప్రజల సహకారంతో టీబీ కేసులను త్వరితగతిన గుర్తించి వైద్య సేవలతో గ్రామ పంచాయతీలో టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించి టీబీ ఫ్రీ గ్రామ పంచాయతీగా ఎన్నికయ్యారు. గురువారం భూపాలపల్లి జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ చేతుల మీదుగా, అదనపు కలెక్టర్లు విజయలక్ష్మి, అశోక్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మధుసూదన్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సందీప్ సమక్షంలో కుదురుపల్లి సర్పంచ్ చల్ల సమ్మిరెడ్డి, ఏడపల్లి సర్పంచ్ మొతె నీలారాణిలకు ఘనంగా సన్మానం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాష్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు హక్కుల పరిరక్షణకు 'బ్లాక్ డే

**సీఈసీ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ శ్రేణుల నిరసన**

**రాయపర్తి అక్టోబర్ 8 (వుదయం ప్రతినిధి):**

ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు గురువారం రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలో 'బ్లాక్ డే' నిర్వహించారు. ఏఐసీసీ, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వాద్రా, ఇతర ప్రతిపక్ష నేతలపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఓటు హక్కుల పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి పార్టీ శ్రేణులు అండగా నిలుస్తాయని అన్నారు.కార్యక్రమంలో జాటోత్ హమ్య నాయక్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మండల ముఖ్య నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలను సంరక్షిస్తూ ఆయిల్‌పామ్ సాగు చేయాలి

**ఎల్‌నినో పరిస్థితుల్లో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలి.**

**కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 8.**



ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ రైతులు భూగర్భ జలాలు, నీటి వనరులను సంరక్షించుకుంటూ బిందు సేద్యం ద్వారా శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. తక్కువ నీటితో అధిక లాభాలు పొందే పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, ఎగుమతులకు అవకాశమున్న పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. గీసుకొండ మండలం కొనేమాకులలోని పీడీఆర్ గార్డెన్స్‌లో వరంగల్ జిల్లా ఆయిల్‌పామ్ రైతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని, అధిక నీటి వినియోగం అవసరమయ్యే పంటలకు బదులుగా నీటి పొదుపు పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. ఆయిల్‌పామ్ సాగులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ, పెదవేగి, ఏలూరు జిల్లా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వి. ప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నీటి, ఎరువుల యాజమాన్యం, పరాగసంపర్క కీటకాల వినియోగం, గెలల అభివృద్ధి తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రాజు పోషకాల యాజమాన్యంపై సూచనలు అందించారు. జిల్లా ఉద్యాన అధికారి ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌పామ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉద్యాన అధికారులు రాకేష్, జ్యోతి, మానస తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 400 మంది రైతులు సదస్సుకు హాజరయ్యారు.

## డ్రగ్స్ వినియోగం మరియు అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి



**యాదాద్రి భువనగిరి.,అక్టోబర్8 వుదయం ప్రతినిధి) :**

జిల్లాలో డ్రగ్స్ వినియోగం,అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడం, విలువైన ప్రాణాలను కాపాడటానికి పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం వి.సీ హాలులో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ , ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఎన్ని కేసులు నమోదు అయ్యాయని ఆరా తీసి డ్రగ్స్ ఏమైనా పట్టుకున్నారా అని అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో కంపెనీల పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.పెట్టాలన్నారు.యువత మాదక ద్రవ్యాల వాడకుండా కాలేజీ లలో,గ్రామాలలో, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.మత్తు పదార్థాల వినియోగ బాధితుల వల్ల కుటుంబాలకు, సమాజానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లడుతూ ఫ్యాక్టరీ పని చేసే వారి పై నిఘా ఉంచాలని, కాలేజీ లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.జిల్లాలో అందరూ సమన్వయంతో డ్రగ్స్ నిర్మూలన జిల్లాగా ఉండేందుకు సహకరించాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి తుక్యా నాయక్,జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్ , అధికారులు పాల్గొన్నారు.

## భూ సమస్యలను పరిష్కరిస్తాం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**భూ సమస్యల పరిష్కారానికి పాత రికార్డులు, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలిస్తాం**

**అభ్యంతరాలు, సందేహాల పై అక్టోబర్ 15 తారీఖు వరకు రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ జిల్లా కలెక్టర్**

**సత్తుపల్లి అక్టోబర్- 08 (వుదయం ప్రతినిధి):**



భూమి హక్కులకు సంబంధించి రైతులు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకున్న సమస్యల పరిష్కారానికి పాత రికార్డులు, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ నారాయణపురం గ్రామంలో భూ రీసర్వే ప్రక్రియ, భూ సమస్యల పై రైతులకు అవగాహన కల్పించేందుకు గురువారం నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, రైతులతో ముఖాముఖిలో భాగంగా అడిగిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, నారాయణపురం గ్రామంలో భూ రీసర్వే ద్వారా క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితి, భూమిపై ఎవరు సాగులో ఉన్నారు, ఎంత విస్తీర్ణంలో ఉన్నారు తదితర వివరాలు స్పష్టంగా గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామంలో గతంలో భూముల నమోదు, సీలింగ్ భూముల గుర్తింపు, పట్టా భూములకు సంబంధించిన రికార్డుల్లో వ్యత్యాసాలను పాత రెవెన్యూ రికార్డులు, పహాణీలు, క్షేత్రస్థాయి పరిస్థితులతో సమగ్రంగా పరిశీలించి పరిష్కరిస్తామని రైతులకు కలెక్టర్ స్పష్టం చేశారు. బేతుపల్లి భూ రీసర్వేలో భాగంగా పలు బృందాల ద్వారా చేపట్టిన సర్వే ఆధారంగా మ్యాప్‌లను రూపొందిస్తున్నామని, అన్ని మ్యాప్‌లను సమన్వయం చేసి నారాయణపురం గ్రామానికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని భూములకు సంబంధించి సుమారు 60 ఏళ్లకు పైగా ఉన్న పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పాత పహాణీలు, సీలింగ్ భూములకు సంబంధించిన రికార్డులు, గతంలో జరిగిన భూ బదలాయింపులు, పట్టాలు, సాదాబైనమా తదితర వివరాలను పరిశీలించి భూమి హక్కులపై స్పష్టత తీసుకురానున్నట్లు తెలిపారు. రైతులు అందించే సమాచారాన్ని పాత రికార్డులతో అనుసంధానం చేసి భూమి హక్కులపై స్పష్టత తీసుకువస్తామని కలెక్టర్ తెలిపారు. భూ రికార్డుల్లో ఉన్న సమస్యల కారణంగా భూములను విక్రయించలేకపోతున్నామని పలువురు రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి సమస్యలు ఉన్న రైతులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకుని తమ భూమి హక్కుకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని సూచించారు. భూ రీసర్వేకు సంబంధించి సమస్యలు ఉన్న రైతుల నుంచి అక్టోబర్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, మండల ప్రత్యేక అధికారి ముజాహిద్, మండల తహసీల్దారు సత్య నారాయణ, సర్పంచ్ లు, పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ దిశగా పౌల్ట్రీ పరిశ్రమ

**నవంబరు 25 నుంచి హైదరాబాద్‌లో 18వ 'పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో–2026'**

**హైటెక్స్‌లో మూడు రోజుల పాటు ప్రదర్శన..**

**24న 'నాలెడ్జ్ డే' సదస్సు**

**గుడ్ల ఉత్పత్తిలో భారత్‌కు అంతర్జాతీయంగా రెండో స్థానం**

**ఢిల్లీలో ఎక్స్‌పో వివరాలు వెల్లడించిన ఐపీఈఎంఏ ప్రతినిధులు**

**న్యూ ఢిల్లీ అక్టోబర్ 08 (వుదయం ప్రతినిధి):**



దేశీయ పౌల్ట్రీ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 18వ 'పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో-2026'కు హైదరాబాద్ నగరం వేదిక కానుంది. నవంబరు 25 నుంచి 27 వరకు మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ మహా ప్రదర్శన జరగనుంది. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని 'ది పార్క్' హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) ప్రతినిధులు వివరాలు వెల్లడించారు.

ఎక్స్‌పో ప్రారంభానికి ముందురోజు, నవంబరు 24న హెచ్ఐసీసీ-నోవోటెల్‌లో 'నాలెడ్జ్ డే' పేరుతో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు. కోళ్ల ఆరోగ్యం, దాణా నిర్వహణ, బయోసెక్యూరిటీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పౌల్ట్రీ రంగంలో సుస్థిర పద్ధతులపై నిపుణులు విస్తృతంగా చర్చించనున్నారు. అనంతరం 25 నుంచి 27 వరకు రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎగ్జిబిషన్ సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో 550కి పైగా సంస్థలు తమ ఉత్పత్తులు, సేవల స్టాళ్లను ఏర్పాటు చేయనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల నుంచి సుమారు 51 వేల మందికి పైగా పరిశ్రమ ప్రతినిధులు, పౌల్ట్రీ రైతులు, బ్రీడర్లు, పశువైద్యులు, పరిశోధకులు హాజరుకానున్నారు. జన్యు సాంకేతికత, అత్యాధునిక హేచరీలు, ఫార్మ్ ఆటోమేషన్, పౌల్ట్రీ షెడ్లు, వెంటిలేషన్ వ్యవస్థలు, వ్యాధి నిర్ధారణ పరికరాలు, గుడ్ల ప్రాసెసింగ్, వ్యర్థాల నిర్వహణ వంటి విభాగాల్లో సరికొత్త ఆవిష్కరణలను ఇక్కడ ప్రదర్శించనున్నారు. ఐపీఈఎంఏకు ఇప్పటికే 20కి పైగా అంతర్జాతీయ సంఘాలు, 40 జాతీయ స్థాయి సంస్థలతో భాగస్వామ్యం ఉందని నిర్వాహకులు తెలిపారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థల అధ్యయనం అవసరం

**తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి**

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబరు 8**



బెర్న్ ప్రజాస్వామ్య వ్యవస్థల అధ్యయనం ద్వారా పార్లమెంటరీ విధానాలపై మరింత అవగాహన పెంపొందించుకోవచ్చని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఆధ్వర్యంలో చేపట్టిన విదేశీ అధ్యయన పర్యటనలో భాగంగా గురువారం స్విట్జర్లాండ్‌లోని బెర్న్ నగరంలో ఉన్న చారిత్రాత్మక పార్లమెంట్ భవనాన్ని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ సందర్శించారు.

ఈ సందర్భంగా స్విట్జర్లాండ్ పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్య సంప్రదాయాలు, శాసనసభల పనితీరు, చట్టాల రూపకల్పన విధానం, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై ప్రతినిధుల బృందం అధ్యయనం చేసింది. గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాలు రూపొందించడం, ప్రభుత్వ విధానాలపై చర్చించడం, ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యతలని అన్నారు. వివిధ దేశాల పార్లమెంటరీ విధానాలను అధ్యయనం చేయడం ద్వారా ప్రజాస్వామ్య విలువలు, శాసనసభల నిర్వహణ, పారదర్శకత, జవాబుదారీతనంపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. స్విట్జర్లాండ్ ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానాలకు ప్రత్యేక గుర్తింపు పొందిందని, ప్రజల భాగస్వామ్యానికి అక్కడ ఇస్తున్న ప్రాధాన్యం అధ్యయనం చేయదగినదని తెలిపారు. అంతర్జాతీయ అధ్యయన పర్యటనల ద్వారా లభించే అనుభవాలు తెలంగాణ శాసన వ్యవస్థను మరింత సమర్థవంతంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ పర్యటనలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, శాసన మండలి కార్యదర్శి డా. నరసింహాచార్యులు, శాసనసభ స్పీకర్ ఓఎస్డీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## రాపిడో యాజమాన్య కోతలపై మండిపడ్డ డ్రైవర్లు

**నాలుగో రోజు కొనసాగిన సమ్మె**

**హనుమకొండ టౌన్, అక్టోబర్ 08 (వుదయం ప్రతినిధి) :**



రాపిడో సంస్థ బైక్ టాక్సీ చార్జీలలో కోతలు విధించడాన్ని నిరసిస్తూ వరంగల్ జిల్లాలో రాపిడో డ్రైవర్లు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. గతంలో కిలోమీటరుకు రూ. 30 చొప్పున చెల్లించిన యాజమాన్యం, ప్రస్తుతం దానిని రూ. 19కి తగ్గించడంతో డ్రైవర్లు రోడ్డుపైనే ధర్నా నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు మరియు నిత్యావసర

వస్తువుల ధరల మధ్య రాపిడో చార్జీలను తగ్గించడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగేటర్ సంస్థలు తమ లాభాల కోసమే ప్రాధాన్యత ఇస్తూ రోజువారీ కూలీ డ్రైవర్ల పొట్టకొడుతున్నాయని ఆరోపించారు. స్థానిక (లోకల్) రైడ్స్ చార్జీలను సవరించి, కనిష్టంగా రూ. 150, గరిష్టంగా రూ. 200 చెల్లించాలి. అవుట్ స్టేషన్ రైడ్స్‌కు కిలోమీటరుకు రూ. 30 చొప్పున రేటును నిర్ణయించాలి. తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేరే వరకు ధర్నా కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా ఇన్చార్జి ఎస్. విజయకుమార్, రైడ్ హీలింగ్ సంస్థ ఇన్చార్జి కట్ట విజయ కుమార్, గౌరవ అధ్యక్షులు స్వర్గం కృష్ణ, ఉపాధ్యక్షులు వేల్పుల రవీందర్, కార్యదర్శి పింగిలి మధు, ఇ. హరినాథ్, ఉప్పుల ప్రశాంత్, విదేవ్ కుమార్ దుద్దిళ్ల, కట్కూరి సత్యానందం, సురేందర్, సురేష్, శరత్, రమేష్, మహిందర్, రోహిత్, ఇతర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టిబి నిర్మూలనకు యువత భాగస్వామ్యం కీలకం

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 8.**



టిబి ముక్త్ భారత్ లక్ష్య సాధనలో యువత, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు చురుకుగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అనుమానితులను గుర్తించి సకాలంలో పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 'టిబి ముక్త్ భారత్-ఆయుష్మాన్ కోసం జోష్ టీముల' కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించిదగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, నీరసం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో కఫ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టిబి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా అందించే చికిత్సను వైద్యుల సూచనల మేరకు పూర్తిగా తీసుకుంటే వ్యాధి నయం అవుతుందని తెలిపారు. మందులను మధ్యలో నిలిపివేయడం వల్ల డ్రగ్ రెసిస్టెంట్ టిబి వచ్చే ప్రమాదం ఉందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో టిబి స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించడంలో జోష్ టీములు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యువత కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ కోరారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మై భారత్ వాలంటీర్లు, యువత సమన్వయంతో పనిచేసి వరంగల్ జిల్లాను టిబి రహిత జిల్లాగా మార్చాలని పిలుపునిచ్చారు. టిబి రహిత గ్రామాల సర్పంచులకు సన్మానం జిల్లాలో టిబి రహిత గ్రామాలుగా గుర్తించబడిన చాపలబండ, దేశాయిపల్లి, చెన్నారం, కాశిగూడెం, లోహిత గ్రామాల సర్పంచులను కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు. నల్లబెల్లి గ్రామ సర్పంచ్ తరపున ఎంపీడీవో వెంకట రమణ సర్టిఫికెట్ స్వీకరించారు. టిబి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 08(వుదయం జిల్లా ప్రతినిధి):**



జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్‌లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. అభ్యర్థులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. జాబ్ మేళాలో అభ్యర్థుల సౌకర్యార్థం 15 రిజిస్ట్రేషన్ కౌంటర్లు, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక కౌంటర్లు, టెంట్లు, షామియానాలు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, భోజనం, విద్యుత్, పార్కింగ్ తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే యువత కోసం ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.జాబ్ మేళా విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ఉదయం 7 గంటలకే పుష్ప గ్రాండ్‌కు చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రిజిస్ట్రేషన్, క్యూల నిర్వహణ, రవాణా తదితర ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రాంగణంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను, వైద్య కేంద్రం, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆసుపత్రిలోనూ అత్యవసర వైద్య సేవలకు అవసరమైన వైద్యులు, బెడ్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా లభించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.

## మృతుల కుటుంబాలకు ఝాన్సీ రాజేందర్‌రెడ్డి పరామర్శ

**కుటుంబ సభ్యులకు ధైర్యం.. మృతుల చిత్రపటాలకు పుష్పాంజలి**

**రాయపర్తి అక్టోబర్ 8 (వుదయం ప్రతినిధి):**



మండలంలోని కాట్రపల్లి, కిష్టాపురం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కాట్రపల్లి గ్రామానికి చెందిన ప్రముఖులు, హన్మకొండ ఏకశిలా హాస్పిటల్ డైరెక్టర్ కుందూరు వెంకట్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంతో ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్ఐ వీరన్న స్వగ్రామమైన కిష్టాపురానికి వెళ్లారు.

వీరన్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగం పెంచండి

### ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**కరీంనగర్ ఆక్టోబర్ 08 (వుదయం ప్రతినిధి):**
నిర్దేశిత లక్ష్యాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, బిల్లుల చెల్లింపుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడు తూ, నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాల జాప్యానికి గల కారణాలను గుర్తించడంతో పాటు, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ పెంచి, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సమావేశంలో సిరిసిల్ల జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.వెంకట మాధవరెడ్డి, ఎంపీడీవోలు వై.శశికళ(ఇల్లంతకుంట),పి.అనిత(శంకరపట్నం),డి.శ్రీనివాస్ (తిమ్మాపూర్), వి.సురేందర్ (గన్నేరువరం), హౌసింగ్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు డీఈలు పి.శ్రీలత, టీఆర్ ప్రవీణ్ కుమార్, ఏఈలు జి.భార్గవి, జె.లక్ష్మణ్, రుద్ర వివేక్, టి.మహేశ్ వర్మ, ఎ.మహేందర్, ఆర్. అజయ్ కుమార్, ఏ.కృష్ణప్రసాద్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ సాంకేతికతను తరగతి బోధనతో అనుసంధానం చేయాలి: కలెక్టర్

ఖాన్ అకాడమీ వనరులను సమర్థవంతంగా వినియోగించి
విద్యార్థుల అభ్యసన ఫలితాలు సాధించేలా కృషి చేయాలి
విద్యార్థుల అభ్యసన పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలి
శిక్షణలోని అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి
డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్



**పెద్దపల్లి, అక్టోబర్-08 (వుదయం ప్రతినిధి)**
డిజిటల్ సాంకేతికతను తరగతి బోధనతో అనుసంధానం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, శిక్షణలో అందిస్తున్న అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని, ఖాన్ అకాడమీ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ బోధన అందించాలని సూచించారు. శిక్షణలో నిర్దేశించిన అభ్యసన ఫలితాలను (Learning Outcomes – LOs) విద్యార్థులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి నిర్దేశిత అభ్యసన ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఖాన్ అకాడమీ అందించే డిజిటల్ వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు గుర్తించి, వారి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.డిజిటల్ సాంకేతికతను తరగతి గది బోధనతో సమర్థవంతంగా అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థుల్లో గణిత నైపుణ్యాలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన అవసరాలకు అనుగుణంగా డిజిటల్ సాధనాలను వినియోగించి బోధనా ప్రక్రియను మరింత ప్రభావవంతంగా నిర్వహించాలని సూచించారు. శిక్షణలో అందించే అంశాలను ఉపాధ్యాయులు పూర్తిగా అవగాహన చేసుకొని, ఖాన్ అకాడమీ మార్గదర్శకాల ప్రకారం పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం విద్యార్థుల అభ్యసనలో ప్రత్యక్షంగా ఉపయోగపడేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో AMO డా. పి.ఎం. షేక్ పాల్గొని ఉపాధ్యాయులకు శిక్షణకు సంబంధించిన పలు అంశాలపై మార్గదర్శకత్వం అందించారు. శిక్షణలోని అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని, వాటిని పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లాలోని 14 మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఖాన్ అకాడమీ మార్గదర్శకాల ప్రకారం శిక్షణను నాణ్యతతో అమలు చేసి, విద్యార్థుల్లో ఆశించిన అభ్యసన ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయనున్నారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు, 14 మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభతరం

వాట్సాప్ ద్వారా నేరుగా ఫిర్యాదులు చేసుకునే అవకాశం: కలెక్టర్



**మంచిర్యాల /అక్టోబర్ 8 (వుదయం ప్రతినిధి)**
ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులు, వినతులను నేరుగా వాట్సాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుక వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఇకపై ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా, ఇంటి నుంచే వాట్సాప్ ద్వారా తమ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లోని జిల్లా ఇన్చార్జి మంత్రి పేషీలోనూ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించడంతో పాటు, వాటి పరిష్కారంలో జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఇంచార్జ్ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు పేషీ నం.8500689596 మంచిర్యాల కలెక్టరేట్ నం.9492123642 ప్రజలు పైన పేర్కొన్న నంబర్ కు కాల్ చేయవద్దని, కేవలం వాట్సాప్ నంబర్ కు తమ ఫిర్యాదులను మెసేజ్ రూపంలో పంపవచ్చని, ఫిర్యాదులో సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలు, సమస్య ఉన్న ప్రదేశం, చిరునామా, అవసరమైన ఆధారాలు, సంబంధిత ఫొటోలను జత చేయాలని, తద్వారా సమస్యను గుర్తించి, సంబంధిత శాఖకు ఫిర్యాదును పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సులభంగా అందించడంతో పాటు, వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడమే ఈ ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ధర్మపురిలో ఉగ్ర నరసింహస్వామి ఆలయ పనుల పరిశీలన

భక్తుల భద్రత,మౌలిక వసతుల కల్పనే ప్రధానం
నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**ధర్మపురి,అక్టోబర్ 08 (వుదయం ప్రతినిధి):**
ధర్మపురి క్షేత్రంలోని శ్రీ ఉగ్రనరసింహ స్వామి ఆలయ పునర్ని ర్మాణ పనులు రానున్న గోదా వరి పుష్కరాల ఘాట్ల నిర్మాణా లను గురువారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనుల్లో ఎక్కడా నాణ్యతా లోపాలు ఉండకూడదని, నిర్దేశిత గడువు లోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 2027 గోదావరి పుష్కరాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారు లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి వసతులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికా రులు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పి. మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు, తహసీల్దార్ శ్రీనివాస్,ఎంపీడీఓ రవీందర్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ యూనియన్ ఎన్నికల ప్రచారం

బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించండని ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్



**జగిత్యాల అక్టోబర్ 08 (వుదయం ప్రతినిధి)**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జగిత్యాల డిపో వద్ద తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆర్టిసి యూనియన్ ఎన్నికల్లో ఐ ఎన్ టి యు సి ఎస్ డబ్ల్యూ యు టి డబ్ల్యూ యు ఎస్ డబ్ల్యూ ఎఫ్ లకు మద్దతుగా బాణం గుర్తుకే ఓటు వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుబంధంగా ఉన్న యూనియన్ ను గెలిపించాలని జగిత్యాల ఆర్టీసీ బస్ డిపో వద్ద ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ కి యూనియన్ ఏర్పాటు కు ప్రజా ప్రజా రవాణా పథకాన్ని వర్క్ షాప్ ల ఏర్పాటు ను ప్రవేశ పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అని మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు .ఉద్యమంలో ఆర్టిసి కార్మికుల పాత్ర చాలా గొప్పదని గత ప్రభుత్వంలో ఆర్టిసి లో సమ్మె చేస్తే పట్టించుకున్న పరిస్థితి లేదు. ఈ ప్రభుత్వంలో ఆర్టిసి సమ్మె చేస్తే ఒక్క రోజులో స్పందించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆర్టిసి కార్మికులకు కంటి వైద్యం చేస్తూ పార్టీలకు అతీతంగా మొదటి నుండి అనుబ్బగం ఉంది. గత ప్రభుత్వంలో ఆర్టిసి లో ప్రజాస్వామ్యం లేకుండా యూనియన్ లను రద్దు చేసింది నేడు యూనియన్ ల ఎన్నికలు నిర్వహిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు ప్రభుత్వం అప్పుల భారం ఉన్నా అనేక కార్యక్రమాలు చేపట్టింది. మహిళలకు ఉచిత బస్సు మహిళా సంఘాలకు బస్సుల కేటాయింపు చేస్తుంది కార్మికుల సంక్షేమ భద్రత కు కార్మికులని కోరుతున్నా బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని నా సహకారం ఆర్టిసి కార్మికులకు పూర్తిగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య యూనియన్ గౌరవాధ్యక్షులు బండ శంకర్ సీనియర్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్ కౌన్సిలర్ లు ప్రశాంత్ రావు తిరుమలయ్య యూనియన్ నాయకులు పి లక్ష్మణ్ చైర్మన్ ఏ లక్ష్మణ్ అధ్యక్షులు నరేందర్ డిపో కార్యదర్శి బి సుజాత డిపో మహిళా కార్యదర్శి డిపో గ్యారేజ్ కార్యదర్శి ఎస్పీ రావు రాంజీ మల్లయ్య జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుసరి అనిల్ రేపల్లె హరి కృష్ణ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిబాగోజీ ముకేష్ ఖన్నా తలారి రాజేష్ ప్రవీణ్ రావు జుంబర్తి శంకర్ కైరీ అజయ్ గౌడ్ స్వామి రెడ్డి క్రాంతి శ్రీనివాస్ యూనియన్ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ నిర్మూలనకు అందరూ కృషి చేయాలి: కలెక్టర్



**ఆసిఫాబాద్, (వుదయం ప్రతినిధి):**
జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేసి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్షయ లక్షణాలను తొలిదశలో గుర్తించి ఆరు నెలల పాటు చికిత్స, పోషకాహారం అందిస్తే వ్యాధిని నిర్మూలించవచ్చన్నారు.యువత, వైద్యులు, సర్పంచులు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం క్షయ రహిత గ్రామాలుగా ఎంపికైన గోవింద్ పూర్, పోతేపల్లి, పవార్‌గూడ, సాంగ్వి, ఇటిక్యాలపహాడ్, దాబా గ్రామాల సర్పంచులు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను సన్మానించారు.

## కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలి: జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, అక్టోబర్ 8 (వుదయం ప్రతినిధి):**
27వ ప్రపంచదృష్టి దినోత్సవం– 2026 సందర్భంగా గురువారం కామారెడ్డి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వృద్ధాశ్రమాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమంలోని వయోవృద్ధులకు ఆటో రిఫ్రాక్టోమీటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లం గుర్తింపుతో పాటు దృష్టి లోపాలను నిర్ధారించేందుకు రిఫ్రాక్షన్ పరీక్షలు చేపట్టారు. కంటి శుక్లం ఉన్నవారిని గుర్తించి, ఉచిత కంటిశుక్లం శస్త్ర చికిత్స కార్యక్రమం కింద ఐఓఎల్ శస్త్రచికిత్స కోసం బోధన్‌లోని లయన్స్ ఐ హాస్పిటల్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వయస్సు పెరిగే కొద్దీ కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటిశుక్లం వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందితే దృష్టిని మెరుగుపరుచుకోవచ్చన్నారు. వయోవృద్ధులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకట్, జిల్లా సంక్షేమ అధికారి వెంకటేష్, వృద్ధాశ్రమ సిబ్బంది, వైద్యాధికారి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వార్తలో వేగం కంటే.. వాస్తవమే ముఖ్యం

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి
- జర్నలిస్టులకు శిక్షణ తరగతులు ప్రారంభం



**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 8:**
వార్తను ముందుగా అందించడమే లక్ష్యం కాకుండా.. వాస్తవాలను నిర్ధారించి, విశ్వసనీయ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడమే జర్నలిస్టుల ప్రధాన బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మారుతున్న మీడియా రంగానికి అనుగుణంగా జర్నలిస్టులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ టీటీడీసీ హాల్‌లో విలేకరులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా రంగాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. వార్తల సేకరణ నుంచి వాస్తవ నిర్ధారణ, విశ్లేషణ, రచన, ప్రసారం వరకు ప్రతి దశలో జర్నలిస్టులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.సోషల్ మీడియా ద్వారా సమాచారం క్షణాల్లో వైరల్ అవుతున్న నేపథ్యంలో ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచారం చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.వార్తలో వేగం కంటే వాస్తవికత, విశ్వసనీయత, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలకు తావులేకుండా ప్రజలకు సరైన సమాచారాన్ని అందించాలన్నారు.ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభంగా ప్రజల తరఫున గొంతుకగా నిలుస్తోందని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర కీలకమన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని సూచించారు.జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారానికి అకాడమీ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు రోజుల శిక్షణలో అనుభవజ్ఞులైన జర్నలిస్టులు, నిపుణులు వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నారని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని కొత్త విషయాలను నేర్చుకోవాలని కోరారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరుతున్న తీరును తెలియజేయడంలో మీడియా కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. వాస్తవాలను ఆధారంగా చేసుకుని వార్తలను అందిస్తూ సమాజ అభివృద్ధికి జర్నలిస్టులు సహకరించాలని కోరారు.శిక్షణలో వార్తా సేకరణలో నూతన పద్ధతులు, వాస్తవ నిర్ధారణ, డిజిటల్, సోషల్ మీడియా వినియోగం, పాత్రికేయ నైతిక విలువలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, జర్నలిజంలో ఎదురవుతున్న సవాళ్లపై నిపుణులు అవగాహన కల్పించనున్నారు.కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, మీడియా అసోసియేషన్ ప్రతినిధులు రాజేశ్వర్, దేవేందర్, బేత రమేష్, వినోద్, సురేష్, సుభాష్, పీ. గజానన్, ఆకుల కార్తిక్, శంకర్, కిరణ్‌తో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కస్తూర్బా బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**నిజామాబాద్, అక్టోబర్ 08 :**
సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, వంట గది, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు విష కీటకాల బారినపడితే ఎవరు బాధ్యులని నిలదీశారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని, దోమలు వృద్ధి చెందకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది, విద్యార్థినుల హాజరును ఎఫ్.ఆర్.ఎస్ విధానంలో అమలు చేస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు. పలువురు సిబ్బంది అటెండెన్స్ నమోదు వివరాలలో తేడాలు ఉన్నట్లు గమనించిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. హాజరులో లోపాలు ఉంటే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. టాయిలెట్లు, ఫ్లోరింగ్ తదితర నిర్మాణాల పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదని సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులను ప్రశ్నించారు. కస్తూర్బా విద్యాలయాలలో మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, తక్షణమే పనులు చేపట్టి నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనం మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. నాసిరకం బియ్యం, సరుకులు కేటాయిస్తే వెంటనే మండల అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఆర్.ఓ ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, మరమ్మత్తులు చేయించాలని, వీలుపడని పక్షంలో కొత్త ప్లాంట్ కోసం ప్రతిపాదనలు పంపాలని అన్నారు. పాఠశాల ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, తాను వారం పది రోజుల తర్వాత మళ్లీ పాఠశాలను సందర్శిస్తానని, ఆలోగా అన్ని లోటుపాట్లను చక్కదిద్దుకోవాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లను క్రమం తప్పకుండా సందర్శిస్తూ నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించాలని మండల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ ఆరీఫ్ అహ్మద్, ఎంఈఓ రమేష్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ షేక్ పర్వీన్ తదితరులు ఉన్నారు.

## ‘చలో లోక్‌భవన్’ర్యాలీలో దుర్గం శేఖర్

సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 8:**
హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘చలో లోక్‌భవన్’ ర్యాలీలో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్ పాల్గొన్నారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు చేపట్టిన ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాల్గొన్నారు.ర్యాలీని పోలీసులు అడ్డుకుని రాజ్‌భవన్ గేట్ వద్ద దుర్గం శేఖర్‌తో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, పలువురు మంత్రులను అదుపులోకి తీసుకుని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని దుర్గం శేఖర్ డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## నిర్మల్‌లో మాంగళ్య షాపింగ్ మాల్ 34వ శాఖ ప్రారంభం



**నిర్మల్ జిల్లా ( వుదయం ప్రతినిధి) 8 అక్టోబర్ 2026**
పట్టణంలో మాంగళ్య షాపింగ్ మాల్ 34వ శాఖ గురువారం ప్రారంభమైంది. ప్రముఖ సినీనటి భాగ్యశ్రీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించారు. భాగ్యశ్రీను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ప్రారంభోత్సవం సందర్భంగా సందడి నెలకొంది.ఈ సందర్భంగా భాగ్యశ్రీ మాట్లాడుతూ.. నిర్మల్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌ను ఆదరిస్తారన్న నమ్మకం ఉందన్నారు. ప్రజల ఆదరణతో మాల్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి పాల్గొన్నారు. అదిలాబాద్ ఎంపీ నగేష్ మాట్లాడుతూ.. కొత్త షాపింగ్ మాల్ ఏర్పాటుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ప్రజలకు వివిధ రకాల వస్త్రాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఏ. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్‌లో పెద్ద షాపింగ్ మాల్ ఏర్పాటు కావడంతో స్థానిక ప్రజలకు సౌకర్యం కలుగుతుందన్నారు. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేసే అవకాశం లభిస్తుందని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడాన్ని స్వాగతించారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఏర్పడిన తర్వాత ప్రముఖ వస్త్ర సంస్థకు చెందిన శాఖ ఇక్కడ ప్రారంభం కావడం అభినందనీయమన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. 2012లో వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో శాఖలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్మల్ శాఖలో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం వివిధ రకాల వస్త్రాలు, అలాగే వివాహాలు, శుభకార్యాలకు అవసరమైన ప్రత్యేక కలెక్షన్లు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రూ.99 నుంచి రూ.లక్ష వరకు వివిధ ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో మూడు రాష్ట్రాల్లో మరో పది ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో తమిళనాడులోనూ విస్తరించే ప్రణాళిక ఉందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మాల్ నిర్వాహకులు, అభిమానులు, వినియోగదారులు హాజరయ్యారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ – ఉమ్మడి జిల్లాల వార్తలు



## సేంద్రీయ సాగు ఆరోగ్య దాయకం
## జిల్లా కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట, అక్టోబర్ 08 (వుదయం బ్యూరో)

సేంద్రీయ వ్యవసాయం ద్వారా భూసారాన్ని పరిరక్షించడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటలను అందించవచ్చని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పేర్కొన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో ఐటీ ఉద్యోగి, రైతు నరేష్ రెడ్డి తన రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో పూర్తిగా సేంద్రీయ పద్ధతిలో నిర్వహిస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో సాగవుతున్న రకరకాల వడ్లు, పండ్లు, కూరగాయల పంటలను, అక్కడ వినియోగిస్తున్న ప్రకృతి ఆధారిత ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. వారాంతపు సెలవుల్లో కుటుంబంతో సహా ఇక్కడికి వచ్చి సేంద్రీయ సాగు చేస్తూ నరేష్ రెడ్డి దంపతులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని, ఫోన్ ద్వారా రైతును అభినందించారు. ప్రభుత్వ పరంగా సేంద్రీయ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందిస్తామని, ప్రతి ఒక్క రైతు సేంద్రీయ పద్ధతుల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, స్థానిక సర్పంచ్ బాలరెడ్డి, ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# పాలనలో 'పాత' రాజసమేనా?

- 'బీరెల్లి' పంచాయతీలో కాలం వెనక్కి!
- కొత్త పాలకవర్గం వచ్చినా మారని బోర్డులు
- ఇప్పటికీ గోడలపై ఆ 'ఉమ్మడి' చెరగని ముద్రలు
- సర్పంచ్ ఎవరో తెలియదు.. కార్యదర్శి ఫోన్ నంబరూ లేదు!
- అయోమయంలో బీరెల్లి వాసులు.. కలెక్టర్ స్పందించాలని విజ్ఞప్తి

గద్వాల, అక్టోబర్ 8 (వుదయం బ్యూరో)



పాలన మారింది.. పాలకులు మారారు.. చివరికి కొత్త జిల్లాలూ ఏర్పాటయ్యాయి.. కానీ, ఆ పంచాయతీ కార్యాలయంలో మాత్రం కాలం పదేళ్ల వెనక్కి నిలిచిపోయింది! జోగులాంబ గద్వాల జిల్లా బీరెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం తీరు చూస్తే అధికారుల అలసత్వానికి అద్దం పడుతోంది. సమస్యల పరిష్కారం కోసం వచ్చే సామాన్యులకు సమాధానం చెప్పే దిక్కు లేకపోగా, కనీసం ఎవరిని కలవాలో తెలిపే సమాచార బోర్డులు కూడా లేకపోవడంపై గ్రామస్తులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఉన్నారా? లేరా? కొత్త పాలకవర్గం కొలువుదీరి నెలలు గడుస్తున్నా, పంచాయతీ కార్యాలయ గోడలపై మాత్రం నేటికీ అవే పాత వివరాలు దర్శనమిస్తున్నాయి. తమ గ్రామానికి సర్పంచ్ ఎవరనేది కార్యాలయానికి వచ్చే సామాన్యులకు తెలియని దుస్థితి నెలకొంది. బోర్డుల్లో లేని సర్పంచ్ ముఖచిత్రం: ప్రస్తుత సర్పంచ్ పేరు, అందుబాటులో ఉండే వేళలు, అత్యవసర ఫోన్ నంబరు వంటి ప్రాథమిక వివరాలను కూడా ప్రదర్శించక పోవడం గమనార్హం. అదృశ్యమైన వార్డు సభ్యుల సమాచారం: ఏ వార్డుకు ఎవరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు? సమస్య వస్తే ముందుగా ఎవరి దృష్టికి తీసుకెళ్లాలి? అనే సమాచారం లేకపోవడంతో ప్రజలు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.

**ఉమ్మడి' జిల్లా ముద్రలు ఇంకా ఎన్నాళ్లు?**

జోగులాంబ గద్వాల జిల్లా ఆవిర్భవించి ఏళ్లు గడుస్తున్నా, బీరెల్లి పంచాయతీ బోర్డులపై మాత్రం ఇప్పటికీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పేరు నాటి వివరాలే ఉండడం అధికారుల బాధ్యతారాహిత్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. అధికారికంగా పరిపాలనా విభాగాలు మారినా, బోర్డులు మార్చక పోవడంపై గ్రామస్థులు నిలదీస్తున్నారు.

అధికారులు జాడ ఏది? పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది వివరాలు, వారి సంప్రదింపుల సంఖ్యలు ప్రదర్శించక పోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే వృద్ధులు, నిరక్షరాస్యులు కార్యాలయం చుట్టూ చక్కర్లుకొట్టి తిరుగాల్సి వస్తోంది. ఒక్క రూపాయి ఖర్చుతో పూర్తయ్యే సమాచార బోర్డుల నవీకరణను కూడా విస్మరించడం అధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది. ప్రజాస్వామ్యంలో పారదర్శకత లేని పంచాయతీ కార్యాలయాలెందుకు? పంచాయతీ కార్యాలయానికి వెళ్తే కనీస సమాచారం కూడా దొరకకపోవడం దారుణం. పాలకవర్గం మారినా సమాచారం మారకపోతే ఈ మార్పు ఎవరి కోసం?"

**— స్థానిక గ్రామస్థుల తీవ్ర ఆగ్రహం**

స్పందించాలి.. పర్యవేక్షించాలి! ఈ నిర్లక్ష్యంపై జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని స్థానికులు కోరుతున్నారు. పాత బోర్డులను తక్షణమే తొలగించి ప్రస్తుత సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

- వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి – జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, అక్టోబర్ 08: వుదయం

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా నూతనంగా నియమితులైన సందీప్ కుమార్ గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన సందీప్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, వృత్తిపట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం వేగవంతంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.



## ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళిక

- తాగునీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.

సంగారెడ్డి, అక్టోబర్ 8:వుదయం:

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, భూగర్భ జలాల లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో తాగునీటి సమస్యకు గురయ్యే గ్రామాలు, ఆవాసాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నీటి వనరుల పరిస్థితిని అంచనా వేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న బోర్‌వెల్స్, నీటి నిల్వ ట్యాంకులు, పైప్‌లైన్లు, మోటార్ల పనితీరును పరిశీలించి, పనిచేయని వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైన కొత్త బోర్‌వెల్స్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తుగానే ట్యాంకర్లను సిద్ధంగా ఉంచాలని, అవసరమైన చోట అద్దె ప్రాతిపదికన నీటి వనరులను వినియోగించుకునే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నీటి సరఫరా వ్యవస్థలో లీకేజీలను గుర్తించి వెంటనే అరికట్టాలని సూచించారు.తాగునీటి అవసరాలకు సంబంధించిన పనులను అత్యవసర, అత్యంత ప్రాధాన్యత, సాధారణ ప్రాధాన్యతగా విభజించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సిర్గాపూర్, కంగ్టి, నాగల్‌గిద్ద, రాయికోడ్, వట్‌పల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో తాగునీటి సమస్యకు గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.గ్రామాల వారీగా నీటి లభ్యత, అవసరాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, మండల అధికారులు, పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్య ఏర్పడిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు చర్యలతో తాగునీటి ఎద్దడిని నివారించేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశం లో ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ రఘువీర్, మిషన్ భగీరథ గ్రిడ్ విజయలక్ష్మి,ఆర్డబ్ల్యూఎస్ ఈ ఈ పాషా, డిప్యూటీ ఈ ఈ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన నేలలో

- రాయలసీమను రతనాల సీమగా చేస్తానన్నది ఎవరు...?
- సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్

నారాయణపేట అక్టోబర్ 8 (వుదయం ప్రతినిధి)



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు పోరాడి తెలంగాణ సాధించుకుంటే కొందరు గద్దెనెక్కి నేడు తెలంగాణను విస్మరిస్తున్నారని సామాజిక కార్యకర్త ,టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ ఆరోపిస్తున్నారు. నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణకు జరిగిన అన్యాయమే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రధాన కారణాల్లో ఒకటి అయిన పాలమూరు-నారాయణపేటతో పాటు దక్షిణ తెలంగాణలోని రైతులకు సాగునీరు అందాలనే ఆకాంక్ష తెలంగాణ ఉద్యమానికి బలమైన స్ఫూర్తిని ఇచ్చింది అన్నారు.ఆ ఉద్యమ స్ఫూర్తితోనే పాలమూరు ప్రాంతానికి కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా రావాలని, దక్షిణ తెలంగాణ ప్రతి ఎకరాకు సాగునీరు అందాలని అనేక మంది ఉద్యమాలు చేశారు.పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు విస్తరణకు వ్యతిరేకంగా గవినోళ్ల శ్రీనివాస్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ( ఎన్ జి టి ) ను ఆశ్రయించి కేసు వేసినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు, ముఖ్యంగా పాలమూరు-నారాయణపేటతో పాటు దక్షిణ తెలంగాణ ప్రాంతాల నీటి హక్కులకు నష్టం కలగకూడదనే లక్ష్యంతో ఈ న్యాయపోరాటం సాధించినట్లు ఆయన తెలిపారు.

పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా జలాలను అధికంగా తరలించే ప్రయత్నాలను ప్రశ్నిస్తూ సాగిన ఈ పోరాటం వెనుక ఉన్న ప్రధాన స్ఫూర్తి పాలమూరు ప్రజలకు నీళ్లు కావాలన్నారు.

నారాయణపేట రైతులకు సాగునీరు అందించి దక్షిణ తెలంగాణ ప్రతి ఎకరా పచ్చబడాలన్నారు.ఇది కేవలం ఒక ప్రాజెక్టుకు వ్యతిరేకమైన పోరాటం కాదన్నారు. తెలంగాణ ఏర్పాటుకు కారణమైన నీటి హక్కుల ఉద్యమ స్ఫూర్తిని కాపాడే పోరాటం చేసిన ఘనత తెలంగాణ ప్రజలది అన్నారు.

**తెలంగాణ కోసం పోరాడిన నాయకత్వం.. రాయలసీమపై సానుకూల భాష ఎందుకు?**

తెలంగాణకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ హయాంలోనే పోతిరెడ్డిపాడు విస్తరణ, రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో ఆంధ్రప్రదేశ్‌తో తీవ్ర నీటి వివాదం తలెత్తింది.2020లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44,000 క్యూసెక్కుల నుంచి 80,000 క్యూసెక్కులకు పెంచే ప్రతిపాదనతో పాటు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ముందుకు తీసుకెళ్లింది. తెలంగాణ సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తెలంగాణలోని ప్రతిపక్షాలు, ప్రజలు నేను కూడా కేసీఆర్-జగన్ మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆయన గుర్తు చేశారు. జిఓ 203 రూపకల్పన వెనుక కేసీఆర్ శిబిరం పాత్ర ఉందని ఆరోపించాయి. కేసీఆర్ రాయలసీమ అభివృద్ధిపై చేసిన రాయలసీమను రతనాల సీమ చేస్తాం అన్న వ్యాఖ్య కూడా తర్వాత తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు వచ్చింది అని ఆయన గుర్తు చేశారు.తెలంగాణ కోసం వేలాది మంది ప్రాణత్యాగాలు చేసినప్పుడు, పాలమూరు-నారాయణపేటతో పాటు దక్షిణ తెలంగాణకు కృష్ణా జలాలు రావాలనే స్ఫూర్తి ఉద్యమానికి బలంగా ఉన్నప్పుడు, తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ రాయలసీమ అభివృద్ధిపై అంత సానుకూలంగా మాట్లాడటం ఎందుకు అని గవినోల శ్రీనివాస్ ప్రశ్నించారు.పాలమూరు ప్రజలకు నీళ్లు రావాలనే లక్ష్యంతో మేము న్యాయపోరాటాలు చేస్తుంటే, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా పకృష్ణా జలాల వినియోగంపై అధికారిక రికార్డులను కూడా ప్రజల ముందు ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## యువతకు అవకాశం ఇవ్వడం మంచి నిర్ణయం

నాగర్ కర్నూల్, అక్టోబర్ 8, (వుదయం బ్యూరో):



రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న సామ రామ్మోహన్‌రెడ్డిని తెలంగాణ జన సమితి (టీజేఎస్) జిల్లా అధ్యక్షుడు మొసలి శ్యాంప్రసాద్‌రెడ్డి గురువారం గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు అవకాశం కల్పించడం మంచి నిర్ణయమని పేర్కొన్నారు.నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై పోరాడిన అనుభవం సామ రామ్మోహన్‌రెడ్డికి ఉందన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌గా, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, న్యాయవాదిగా, కాంగ్రెస్ లీగల్ సెల్‌లో పనిచేసిన అనుభవం ఆయనకు ఉందని తెలిపారు. విద్యార్థి ఉద్యమాల నుంచి వచ్చిన వ్యక్తికి పట్టభద్రుల ప్రతినిధిగా అవకాశం కల్పిస్తే వారి సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే సామర్థ్యం ఉందన్నారు.కూటమిలో భాగంగా పార్టీలో చర్చించిన అనంతరం సామ రామ్మోహన్‌రెడ్డికి టీజేఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్.బి.ఐ ఏజీఎమ్ పవన్ కుమార్

మహబూబ్‌నగర్

ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరిగిపోతున్న వివిధ రకాల సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ) రీజినల్ బిజినెస్ ఆఫీస్ (RBO) మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మిని ట్యాంక్ బండ్ వద్ద ప్రత్యేక "ఫ్రాడ్ & సైబర్ క్రైమ్ అవేర్‌నెస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్.బి.ఐ ఆర్బీఓ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (AGM) పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండటానికి ముందస్తు అవగాహన మరియు సమయానుకూల స్పందనే మొదటి రక్షణ కవచమని పేర్కొన్నారు. డిజిటల్ లావాదేవీలు నిర్వహించే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ ఓటీపీ (OTP) మోసాలు, ఫిషింగ్ లింక్‌లు, నకిలీ కేవైసీ (KYC) కాల్స్, యూపీఐ/పేమెంట్ మోసాలు, క్యూఆర్ కోడ్ స్కామ్‌లు, రిమోట్ యాక్సెస్ యాప్‌లు మరియు నకిలీ కస్టమర్ కేర్ నంబర్ల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను ఏ విధంగా బురిడీ కొట్టిస్తున్నదీ వివరంగా తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, పిన్ (PIN), సీవీవీ (CVV), పాస్‌వర్డ్‌లు లేదా ఇతర బ్యాంకింగ్ రహస్య వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని ప్రజలను హెచ్చరించారు. అలాగే అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లపై క్లిక్ చేయడం, వారు సూచించిన అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం వంటివి చేయవద్దని సూచించారు. బ్యాంకులు లేదా ప్రభుత్వ సంస్థల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసుకున్న తర్వాతే స్పందించాలని, యూపీఐ లేదా ఆన్‌లైన్ లావాదేవీలు చేసేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. ఒకవేళ పొరపాటున ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే ఉచిత హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని లేదా అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా సమాచారం అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎస్.బి.ఐ సీఎమ్ (కాంప్లైయన్స్) కోదండరామ్, సీఎమ్ (ఎస్ఎమ్ఈ బ్రాంచ్) కిరణ్, సీఎమ్ (రాజేంద్రనగర్ బ్రాంచ్) అల్తాఫ్ హుస్సేన్, వివిధ స్థానిక ఎస్.బి.ఐ శాఖల అధికారులు, సిబ్బంది మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



# ప్రాధాన్యతా రంగాలకు రుణాలు విస్తృతంగా అందించాలి

- ప్రభుత్వ పథకాల రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి: డి.ఆర్.ఓ ఎ. నిర్మల

మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూన్ 2026తో ముగిసిన మొదటి త్రైమాసిక జిల్లా స్థాయి బ్యాంకర్ల సలహా సమితి (DCC/DLRC) సమీక్షా సమావేశం గురువారం జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా 2026 27 వార్షిక రుణ ప్రణాళిక (ACP) లక్ష్యాల సాధనతో పాటు వ్యవసాయం, MSME, విద్య, గృహ రుణాలు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు అందిస్తున్న రుణాల పురోగతి, క్రెడిట్ డిపాజిట్ (CD) నిష్పత్తిని సమీక్షించారు.

రాబోయే త్రైమాసికంలో వ్యవసాయ మౌలిక సదుపాయాల రుణాలు, KCC మత్స్య రంగ రుణాలు, PM స్వనిధి, AIF, PMFME వంటి ప్రభుత్వ ప్రాయోజిత పథకాల రుణాల అమలును వేగవంతం చేయాలని DRO ఎ. నిర్మల సూచించారు. ముఖ్యంగా PMFME పథకంపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న వినియోగ ధ్రువీకరణ పత్రాల (UCs) సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

'గ్రామోదయం' ద్వారా యువతకు రుణ అనుసంధానాలు NABARD, NSDC సంయుక్తంగా దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువతకు 4,000 రుణ అనుసంధానాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రారంభించిన 'గ్రామోదయం' కార్యక్రమం గురించి NABARD DDM వివరించారు. NGOIEERD ఆధ్వర్యంలో నిర్వహించే డ్రైవింగ్ శిక్షణకు అర్హులైన అభ్యర్థులను గుర్తించాలని PD DRDAకు సూచించారు.చెంచు తెగకు మౌలిక సదుపాయాల కల్పన

హన్వాడ మండలంలోని చెంచు తెగ ప్రజలకు తక్కువ వ్యయంతో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని DTDO కు సూచించారు.

**అక్టోబర్ 21 నుంచి ఆర్థిక చేరిక ప్రత్యేక ప్రచారం**

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో అక్టోబర్ 21, 2026 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు 'ఆర్థిక చేరిక ప్రత్యేక ప్రచారం' (FI Saturation Campaign) నిర్వహించనున్నారు. ఈ ప్రచారం ద్వారా KYC, ReKYC, నామినేషన్ నమోదు, సామాజిక భద్రతా పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించనున్నారు. అన్ని బ్యాంకు ఖాతాలకు నామినేషన్ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, సామాజిక భద్రతా పథకాల క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. CFL బృందాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు.

సమావేశంలో ఎల్.డి.ఎం.చంద్ర శేఖర్, RBI LDO జి. శ్రీకాంత్, NABARD DDM మహేందర్ బాబు, SBI చీఫ్ మేనేజర్ మహ్మద్ జాఫర్, UBI చీఫ్ మేనేజర్ రాజేష్, PD DRDA పి. నర్సింహులు, MEPM PD ఎండి. యూసుఫ్, GM DIC ఎం. శ్రీలక్ష్మి, ED SC కార్పొరేషన్ సిహెచ్. సంతోష్ కుమార్, DBCDO పి. విష్ణువర్ధన్, DTDO చత్రు నాయక్, RSETI డైరెక్టర్ పి. ప్రభాకర్, వివిధ బ్యాంకుల నోడల్ మేనేజర్లు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ జిల్లా రిజిస్ట్రార్‌గా దీపక్ బాధ్యతల స్వీకరణ

మహబూబ్ నగర్



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రిజిస్ట్రార్‌గా (RO) నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పేరపాక దీపక్ గురువారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేసి, పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆమె సూచించారు.

## అక్రమ ఇసుక రవాణాపై ఎస్సై విఠల్ కొరడా!

- అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

బషీరాబాద్, అక్టోబర్ 8 (వుదయం ప్రతినిధి):



అక్రమ ఇసుక రవాణాపై బషీరాబాద్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బషీరాబాద్ ఎస్సై విఠల్ ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలం వీరిశెట్టిపల్లి వాగు నుంచి దామరశెడ్ గ్రామం వైపు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ( టీఎస్ 34 ఏ 5910)ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ మైసప్ప, తండ్రి బిచప్ప, గోనూర్ , తాండూరు మండలం వాసిగా పోలీసులు గుర్తించారు.ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అక్రమ ఇసుక రవాణాపై నిఘా కొనసాగిస్తామని ఎస్సై విఠల్ తెలిపారు.

## టీబీ రహిత గ్రామంగా చెన్గేష్పూర్‌కు గుర్తింపు



- సర్పంచ్ ప్రవీణ్ కుమార్ గౌడ్‌కు ఘన సన్మానం

తాండూరు అక్టోబర్ 8 (వుదయం ప్రతినిధి)

తాండూరు మండలం చెన్గేష్పూర్ గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా ఎంపిక చేయడంలో విశేష కృషి చేసిన సర్పంచ్ వై. ప్రవీణ్ కుమార్ గౌడ్‌కు ఘన సన్మానం లభించింది. గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ లాల్, టీబీ జిల్లా ఇన్‌చార్జి అధికారి డాక్టర్ విద్యా ఆధ్వర్యంలో సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్యంపై సర్పంచ్ ప్రవీణ్ కుమార్ గౌడ్ చూపిన ప్రత్యేక శ్రద్ధ, ప్రజల్లో కల్పించిన ఆరోగ్య పై అవగాహన అభినందనీయమని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో టీబీ వ్యాధి పరిస్థితిని పరిశీలించగా, ఒక్క టీబీ కేసు కూడా నమోదు కాకపోవడంతో చెన్గేష్పూర్‌ను టీబీ రహిత గ్రామంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.సర్పంచ్ నేతృత్వంలో గ్రామంలో ప్రజలకు నిరంతరం ఆరోగ్య అవగాహన కల్పించడం, ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఈ గుర్తింపు దక్కిందని అధికారులు ప్రశంసించారు. గ్రామాభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తున్న సర్పంచ్ ప్రవీణ్ కుమార్ గౌడ్‌కు ఈ సన్మానం మరింత గౌరవాన్ని తీసుకొచ్చింది.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకం



- కలెక్టర్ హేమంత్ పాటిల్

నాగర్ కర్నూల్, అక్టోబరు 8 (వుదయం బ్యూరో):

జిల్లా ప్రజల ఆర్థిక ప్రగతికి, పేదలకు స్వయం ఉపాధి కల్పనకు బ్యాంకులు విస్తృతంగా రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు.గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తొలి త్రైమాసిక డీసీసీ బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి బ్యాంకుల వారీగా రుణ లక్ష్యాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించాలన్నారు. విద్యా రుణాలు, ఎంఎస్ఎంఈ, పీఎం సూర్య ఘర్, వ్యవసాయ రుణాల మంజూరును పెంచాలని, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా సాధించాలని ఆదేశించారు.

సమావేశంలో డీఆర్వో పాండు, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్, డీఎల్ఆర్సీ కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, ఆర్బీఐ మేనేజర్ ప్రదీప్ చంద్ర నాయక్, నాబార్డ్ అధికారి చందు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స

బిజినపల్లి, అక్టోబర్ 8: (వుదయం ప్రతినిధి):

మండల పరిధిలోని వెలుగొండ గ్రామంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స, నివారణపై ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. జ్ఞానశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పశువులకు సుడి పరీక్షలు నిర్వహించడంతోపాటు వ్యాధుల నివారణకు అవసరమైన చికిత్స అందించారు. శిబిరంలో *20 పశువులకు సుడి పరీక్షలు, 10 పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స, మరో **20 పశువులకు వివిధ ఆరోగ్య సమస్యలపై చికిత్స* అందించారు. కార్యక్రమంలో తిమ్మాజిపేట పశువైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, పాలెం పశువైద్యాధికారి డాక్టర్ ప్రణీత, బిజినేపల్లి పశువైద్యాధికారి డాక్టర్ జి. జీవితతో పాటు పశువైద్య సిబ్బంది బి. రమేష్‌కుమార్, బి. జ్యోతి, నరేష్‌కుమార్, అన్వర్, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా 'భూభారతి' రీసర్వే: జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, అక్టోబర్ 08 వుదయం బ్యూరో**

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'భూభారతి' రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. గురువారం ములుగు మండలం క్షీర సాగర్ గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు 2 అధునాతన రోవర్ సాంకేతిక పరిజ్ఞానంతో రోజుకు 30 నుండి 35 ఎకరాల వరకు సర్వే చేస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్, ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచే సర్వే ప్రారంభించి, రోజుకు 40 ఎకరాలకు పైగా పూర్తిచేసేలా వేగం పెంచాలని ఆదేశించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు ఆధునిక సాంకేతికతతో జరుగుతున్న ఈ సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. భూ విస్తీర్ణం, సర్వే నంబర్లు, హద్దులు, పట్టా వివరాలను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. హద్దులు, సబ్‌డివిజన్ సమస్యలు తలెత్తకుండా సాగే ఈ ప్రక్రియకు రైతులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్, స్థానిక సర్పంచ్ బాలరెడ్డి, ప్రజాప్రతినిధులు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నానా పటేకర్, సింగీతం శ్రీనివాసరావుకు ఏపీ ఎఫ్‌డీసీ ఘన నివాళి

**విజయవాడ, అక్టోబర్ 8 (వుదయం ప్రతినిధి)**



నానా పటేకర్, సింగీతం శ్రీనివాసరావు సినీ సేవలు చిరస్మరణీయం ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్ భూషణ్, ఎండీ విశ్వనాథన్, బోర్డు సభ్యుల ఘన నివాళి భారతీయ సినీ రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ నటుడు నానా పటేకర్, ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుకు ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (APFDC) ఘనంగా నివాళులర్పించింది.గురువారం విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్ లోని ఆర్టీసీ ప్రధాన హాల్‌లో నిర్వహించిన బోర్డు సమావేశంలో ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పి. భరత్ భూషణ్, మేనేజింగ్ డైరెక్టర్ కే. విశ్వనాథన్, బోర్డు సభ్యులు పాల్గొని నానా పటేకర్, సింగీతం శ్రీనివాసరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏపీ FDC చైర్మన్ భరత్ భూషణ్, ఎండీ, బోర్డు సభ్యులు సమావేశంలో చర్చిస్తూ.. భారతీయ సినీ రంగానికి నానా పటేకర్, సింగీతం శ్రీనివాసరావు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నటుడిగా నానా పటేకర్ తన విలక్షణమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. విభిన్న పాత్రలను అత్యంత సహజంగా పోషిస్తూ భారతీయ సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు.అదేవిధంగా దర్శకుడిగా సింగీతం శ్రీనివాసరావు తెలుగు సినీ పరిశ్రమకు వినూత్నమైన, ప్రయోగాత్మక చిత్రాలను అందించి తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఆయన సృజనాత్మకత, దర్శకత్వ ప్రతిభ తెలుగు సినిమాకు మాత్రమే కాకుండా భారతీయ చిత్ర పరిశ్రమకు కూడా విశేష గుర్తింపు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. సినీ రంగంలో నానా పటేకర్, సింగీతం శ్రీనివాసరావు అందించిన సేవలు, వారి ప్రతిభ, కృషి భవిష్యత్ తరాల సినీ కళాకారులకు, సాంకేతిక నిపుణులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని భరత్ భూషణ్ అన్నారు. భారతీయ సినిమా అభివృద్ధికి వారు చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.కార్యక్రమంలో ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు, బోర్డు సభ్యులు, సినీ రంగ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ చెరువుకు విద్యుత్ స్తంభం ఏర్పాటు

- **చెరువు పరిసరాల్లో విద్యుత్ సౌకర్యంతో ప్రజలకు మరింత వెసులుబాటు**

**దౌల్తాబాద్ అక్టోబర్ 08 (వుదయం):**



గ్రామంలోని బతుకమ్మ చెరువు వద్ద విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. చెరువు పరిసరాల్లో విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో స్థానికులు, మహిళలకు మరింత వెసులుబాటు కలగనుంది. ముఖ్యంగా బతుకమ్మ పండుగ సమయంలో మహిళలు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకునే నేపథ్యంలో విద్యుత్ సౌకర్యం ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్థులు పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్ పంజ స్వామి ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు పనులు చేపట్టారు. చెరువు పరిసరాల్లో అవసరమైన విద్యుత్ సదుపాయాలను కల్పించడం ద్వారా రాత్రివేళల్లో వెలుతురు అందుబాటులో ఉండటంతో భద్రతాపరంగా కూడా ప్రయోజనం చేకూరనుంది. చెరువు వద్ద పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బి. బ్రహ్మానందరెడ్డి, పి. సందీప్‌రెడ్డి, కె. రాజురెడ్డి, కె. దుర్గారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని వారు తెలిపారు. అవసరమైతే దీనికి మరింత ఆకట్టుకునే ఈనాడు తరహా శీర్షికలు 5-6 కూడా తయారు చేసి ఇవ్వగలను.

# మహిళల సంక్షేమానికే ప్రభుత్వం పెద్దపీట





- **రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

**సిద్దిపేట, అక్టోబర్ 08 (వుదయం బ్యూరో)**

మహిళల ప్రాధాన్యత ఆధారంగానే ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన మరియు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వైశ్య సంక్షేమ సంఘ భవనంలో నియోజకవర్గానికి చెందిన 140 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు ఇందిరమ్మ చీరలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కుట్టు మిషన్లు, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పెట్రోల్ బంకుల కేటాయింపు వంటి అనేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే ప్రతిరోజూ 20 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహార బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని, దుబ్బాకలో రూ.200 కోట్లతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందని, ఒక్క సిద్దిపేట నియోజకవర్గంలోనే 3,500 ఇండ్లకు గాను 2,500 నిర్మాణాలు పూర్తయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో 'ఎల్ నీనో' ప్రభావం వల్ల వచ్చే జూన్ వరకు వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉన్నందున రిజర్వాయర్లలోని నీటిని తాగునీటికే ప్రాధాన్యంగా వాడుకోవాలని, ప్రజలంతా ప్రభుత్వ సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అన్ని సంక్షేమ ఫలాల్లో మహిళలే అగ్రస్థానంలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, ఆర్డీవో సదానందం, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నూతన పింఛన్ దరఖాస్తు దారులను పరిశీలించిన జిల్లా అధికారి

- **ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి ఆధ్వర్యంలో**

**ఊర్కొండ న్యూస్ 9 వుదయం ప్రతినిధి**



సెక్రెటరీ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి పరిశీలించిన జిల్లా అధికారి

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం మండలంలోని వివిధ గ్రామపంచాయతీ పరిధిలో అన్ని గ్రామాలలో సందర్శించి నూతన పింఛన్ దారులను పరిశీలించడం జరిగింది. DRDO ఓబులేష్ నూతన పింఛన్ దరఖాస్తు దారులను మండలం ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి ప్రతి గ్రామపంచాయతీ

# ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీస్-మీడియా సమన్వయం కీలకం

- **ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా పాత్ర కీలకం**
- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 8(వుదయం ప్రతినిధి)**



ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పోలీస్-మీడియా సమన్వయం కీలకం అని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐ ఏ ఎస్ పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని శాసన్‌పల్లి రోడ్‌లో గల లక్ష్మి బ్యాంకెట్ హాల్‌లో గురువారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్, ప్రెస్ గెట్ టు గెదర్ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖతో పాటు ప్రజలకు సేవలందించడంలో మీడియా కూడా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్తంభంగా, వాచ్‌డాగ్‌గా పనిచేస్తూ ప్రభుత్వ శాఖలు, అధికారులు ప్రజలకు అందించాల్సిన సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకువెళ్తుందని పేర్కొన్నారు.పోలీసులు, మీడియా మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఎంతో అవసరమన్నారు. పోలీసు శాఖలో రోజువారీ విధుల్లో ఎదురయ్యే సమస్యలు, లోపాలను మీడియా నిర్మాణాత్మకంగా సూచించడం ద్వారా వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని, ఇందుకు మీడియా సహకారం అవసరమన్నారు.ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంపొందించడంలో మీడియా పాత్ర ముఖ్యమైనదని ఎస్పీ అన్నారు. పోలీసులపై ప్రజలకు విశ్వాసం ఉన్నప్పుడే నేరాల నియంత్రణతో పాటు సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావడంలో ప్రజలు ముందుకు వస్తారని తెలిపారు. పోలీసు-ప్రజల మధ్య విశ్వాసం, సత్సంబంధాలను పెంపొందించేందుకు మీడియా వారధిగా పనిచేస్తోందన్నారు. కరోనా సమయంలో పోలీసులతో పాటు వైద్యులు, మీడియా ప్రతినిధులు ప్రజలకు సేవలందించేందుకు ముందుండి పనిచేశారని ఎస్పీ గుర్తుచేశారు. మీడియా సేవలను కూడా అత్యవసర సేవల్లో భాగంగా గుర్తించిన పరిస్థితులను ఆయన ప్రస్తావించారు.నారాయణపేట జిల్లాలో గత ఏడాది కాలంగా పోలీసు శాఖ చేపట్టిన కార్యక్రమాలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది చేసిన కృషిని ఆయన అభినందించారు. జిల్లా పోలీసు శాఖలోని ప్రతి అధికారి, సిబ్బంది రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. పోలీసు శాఖ విజయాలు ఏ ఒక్కరి కృషి ఫలితం కాదని, ప్రతి ఒక్కరి సమష్టి కృషితోనే సాధ్యమవుతాయని పేర్కొన్నారు.పోలీసు శాఖకు మీడియా అందిస్తున్న సహకారానికి ఎస్పీ డాక్టర్ వినీత్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇదే విధమైన సహకారం, సమన్వయంతో పనిచేస్తూ నారాయణపేట జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కలిసి ముందుకు సాగుదామని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేశ్, డీ పీ ఆర్ వో రషీద్, వివిధ జర్నలిస్టు సంఘాల సభ్యులు, ప్రింట్ ,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు , ఎస్ఐ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# జీవితాంతం కంటి చూపును కాపాడుకోవాలి



**నాగర్ కర్నూల్ , అక్టోబర్ 8, (వుదయం ప్రతినిధి):**

ప్రతి ఒక్కరూ జీవితాంతం కంటి చూపును కాపాడుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. సుప్రియ సూచించారు. 27వ ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఆసుపత్రిలో కంటి దృష్టిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ సుప్రియ మాట్లాడుతూ.. నిత్య ఆహారంలో పోషక విలువలతోపాటు విటమిన్‌ఏ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. రేసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి. హనుమంతరావు మాట్లాడుతూ కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలోని 8వ గదిలో ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆప్తాల్మిక్ వైద్యులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సుష్మ, ఆప్తాల్మిక్ అధికారులు కొత్త బాలాజీ, యుగంధర్ ప్రసాద్ కంటి సంరక్షణపై అవగాహన కల్పించారు. మరణానంతరం కంటి దానం ప్రాధాన్యాన్ని వివరించారు. వ్యక్తి మరణించిన ఆరు గంటల్లోపు సమాచారం అందిస్తే కళ్లను సేకరించి అవసరమైన వారికి దృష్టిని ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. కంటి దానం చేయదలచిన వారు ఆప్తాల్మిక్ అధికారి కొత్త బాలాజీని *94408 76556* నంబరులో సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ కె. మంజుల రాణి, హెల్ప్‌డెస్క్ ఇన్‌చార్జి టి. యాదగిరి, నర్సింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గానికి వంటేరు ప్రతాప్ రెడ్డి శుభాకాంక్షలు



**గజ్వేల్, అక్టోబర్ 08 (వుదయం ప్రతినిధి)**

గజ్వేల్ మండల సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడిగా రంగంపేట సర్పంచ్ నడిగొప్పుల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ధర్మారెడ్డిపల్లి సర్పంచ్ కాసముల్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, స్థానిక సర్పంచులు గజ్జల అరుణ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు జ్యోతి స్వామి, బ్యాగరీ ప్రభాకర్, చెల్మెటి వెంకటలక్ష్మి, కల్పన బాలస్వామి, కొంటెమైన నాగలక్ష్మి నరసింహులు, ఫహీం, పోసాని లావణ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ అనసూయ ప్రతాప్‌ను పరామర్శించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**అక్బర్ పేట భూంపల్లి అక్టోబర్ 08 ( వుదయం ప్రతినిధి )**

సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం బేగంపేట గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతారం అనసూయ ప్రతాప్‌ను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవలే పోతారం ప్రతాప్‌కు కంటి చికిత్స (ఆపరేషన్) జరిగిన విషయం తెలుసుకున్న శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బేగంపేటలోని ఆయన నివాసానికి వెళ్లారు.ఈ సందర్భంగా ప్రతాప్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటించాలని, ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండా శంకర్,జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలూరి కమలాకర్,కార్యదర్శి సురేందర్ రెడ్డి,బేగంపేట సర్పంచ్ అన్నబోయిన చంద్రశేఖర్, తాళ్లపల్లి సర్పంచ్ ప్రభాకర్, ఖాజీపూర్ మాజీ సర్పంచ్ మధు, సీనియర్ నాయకులు బొమ్మెర శ్రీధర్, సోలిపేట ప్రసాద్ రెడ్డి, పాతూరి శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ చారి,మహిపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గురు పీఠంలో ప్రత్యేక పూజలు

- **శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్....**

**వుదయం న్యూస్ శివ్వంపేట అక్టోబర్ 08**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ గురు పీఠం లో కొలువుదీరిన శ్రీ దత్తాత్రేయ మహాస్వామికి శిరిడీ సాయి బాబాల కు నేడు శ్రీ గురు పీఠం చాగంటి కోట ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీ గురు పీఠం నటరాజ్ శర్మ సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు సందర్భంగా శ్రీ గురు పీఠంలోని శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం గురుపరంపర దేవాలయం, పంచవటి, శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయంలో ఉదయం అభిషేకం అర్చన దివ్య మంగళ హారతి అనంతరం 11 గంటలకు శ్రీ దత్తాత్రేయ మహాస్వామి శతనామార్చన, శ్రీ దత్త స్తోత్రావళి పటణం, శ్రీ దత్త భజనలు, శ్రీపాద వల్లభుల, శ్రీ నరసింహ సరస్వతి, శ్రీ గురు మాణిక్ ప్రభు శ్రీ గురు స్వామి సమర్థ సహిత దత్తాత్రేయ స్వామి దివ్య మంగళ హారతి ఇవ్వడం జరిగినది. తదుపరి మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ సద్గురు సాయి మధ్యాహ్న హారతి తదనంతరం శ్రీ సాయి సత్సంగ్ నిర్వహించబడింది. మధ్యాహ్నం రెండు గంటలకు చిన్న గొట్టుముల వాస్తవ్యులైన శ్రీ కాంతారావు గారు వారి కుటుంబ సభ్యులు ఈరోజు భక్తులకు అన్నప్రసాద్ వితరణ చేశారు. ఈరోజు శ్రీ దత్తాత్రేయ మహా స్వామి పంచాయతనం, శ్రీ సాయిబాబాకు వివిధ పుష్ప మాలలతో సుందరంగా అలంకరణ చేశారు శ్రీకాంత్ రావు గారి కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆ గురుదేవులను ప్రార్థిస్తున్నారు. కార్యక్రమానికి శ్రీ గురుపిఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పెద్దగాని శివకుమార్ గౌడ్ వారి సతీమణి శ్రీమతి రమాదేవి గారు ట్రస్ట్ సభ్యులు జిన్నారం సూర్య కుమార్ గౌడ్ న్యాయవాది జిన్నారం పెద్దగోని శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీమతి జిన్నారం పెద్దగోని స్వరాజ్యలక్ష్మి, రాజ్యం బిక్షపతి, శ్రీ కాంతారావు గారు చిన్న గొట్టిముకుల, గూడూరు సర్పంచ్ శ్రీ బేగరి నర్సయ్య, న్యాయవాది శ్రీ వజ్జ సాయి కిరణ్ శెట్టిపల్లి బిక్షపతి, వారి కుమారులు, సీఎం రాజేందర్ రెడ్డి, శ్రీ నాగేంద్ర, శ్రీ గురు పిట్ట సమన్వయకర్త శ్రీ పొంతనపల్లి సత్యనారాయణ గౌడ్, పాత్రికేయ మిత్రులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గురుదేవుల ఆశీస్సులు పొందారు.



# విద్యా వాలంటీర్లు ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీయాలి

- **ప్రతి పాఠశాలలో 20 నుంచి 30 మంది ప్రతిభావంతులను గుర్తించాలి**
- **ఏఐ, ట్యాబ్‌లతో విద్యార్థుల అభిరుచులు, లక్ష్యాల డిజిటల్ నమోదు**
- **పదేళ్లపాటు కొనసాగనున్న 'విద్యా యజ్ఞం': ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్**




ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న సహజ ప్రతిభను గుర్తించి, వారి అభిరుచులు, ఆసక్తులకు అనుగుణంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత విద్యా వాలంటీర్లపై ఉందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో విద్యా వాలంటీర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, నగర మేయర్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా 100 మంది విద్యా వాలంటీర్లకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం పాఠాలు బోధించడంతో బాధ్యత పూర్తయిందని భావించకుండా, విద్యార్థులకు మార్గదర్శకులు, మెంటర్లుగా విద్యా వాలంటీర్లు నిలవాలని సూచించారు. మహబూబ్‌నగర్‌లో అమలు చేస్తున్న విద్యా వాలంటీర్ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా విస్తరించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్‌ను కార్యక్రమానికి ఆహ్వానించినట్లు తెలిపారు. ఇతర జిల్లాల కలెక్టర్లకు కూడా కార్యక్రమం గురించి వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి విద్యా కార్యక్రమాలను విస్తరించేలా కృషి చేయాలని కోరారు.

విద్యా వాలంటీర్లకు అందుతున్న గౌరవ వేతనం కేవలం ఆర్థిక ప్రోత్సాహకం మాత్రమే కాదని, విద్యార్థుల భవిష్యత్తుకు సేవ చేసే అవకాశం లభించిందనే స్ఫూర్తితో వారు పనిచేస్తున్నారని అన్నారు. వాలంటీర్లు చేపడుతున్న కార్యక్రమాలను వందేమాతరం ఫౌండేషన్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. విద్యా వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని ఒక 'విద్యా యజ్ఞం'గా భావించి నిబద్ధతతో పనిచేస్తున్నారని, వారి పట్టుదల, సేవాభావం అభినందనీయమన్నారు.

మహబూబ్‌నగర్ ఫస్ట్ ద్వారా గత ఏడాది కాలంగా మహిళలకు వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ఆరు బ్యాచ్‌లలో సుమారు 2,500 మందికి శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణ సమయంలో మహిళల్లో కనిపించిన పట్టుదల, బాధ్యత తీసుకుని పనిచేసే సామర్థ్యం, ఆలోచనా విధానం తమకు విశ్వాసాన్ని కలిగించాయని అన్నారు. మహిళలకు బాధ్యత అప్పగించి, తగిన ప్రోత్సాహం అందిస్తే మంచి ఫలితాలు సాధిస్తారనే నమ్మకంతోనే ఇంత విస్తృతమైన విద్యా వాలంటీర్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.

ప్రతి పాఠశాలలో కనీసం 20 నుంచి 30 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారి ఆసక్తులు, అభిరుచులు, నైపుణ్యాలు, భవిష్యత్తు లక్ష్యాలను తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులతో కొంత సమయం గడిపి వారు ఏ రంగంలో రాణించగలరో గుర్తించి వివరాలను నమోదు చేయాలన్నారు. నైపుణ్యం ఉన్న ఏ ఒక్క విద్యార్థి కూడా సరైన ప్రోత్సాహం లేక వెనుకబడకూడదని, ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి అండగా నిలిచి వారి కలలను సాకారం చేసుకునే దిశగా చేయూతనివ్వడమే విద్యా వాలంటీర్ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

**విద్యా వాలంటీర్ల సేవలు అభినందనీయం: కలెక్టర్**

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ** గుప్తా* మాట్లాడుతూ విద్యా వాలంటీర్లకు గౌరవ వేతనం అందించడం సంతోషకరమైన విషయమన్నారు. పిల్లలను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా 'బియాండ్ ది బుక్స్'కు తీసుకెళ్లేందుకు వాలంటీర్లు చేస్తున్న కృషిని అభినందించారు.

కార్డులు, డిజిటల్ ట్యాబ్‌లు తదితర ఆధునిక బోధనా పద్ధతులను ఉపయోగిస్తూ విద్యార్థులు విషయాలను సులభంగా, ఆచరణాత్మకంగా నేర్చుకునేలా చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమన్నారు. వాలంటీర్ల సేవలతో విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెరుగుతున్నాయని పేర్కొన్నారు.బోధనలో ఎదురయ్యే ఆచరణాత్మక సమస్యలను వాలంటీర్లు పరస్పరం చర్చించుకోవాలని సూచించారు. కొంతమంది విద్యార్థులకు పాఠాలు అర్థం కాకపోవడం, మరికొందరు తరగతిలో ఆసక్తి చూపకపోవడం వంటి సమస్యలు ఎదురైతే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను సంప్రదించి వారి సూచనలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ఎదురయ్యే పరిస్థితులపై వాలంటీర్లు తమ అనుభవాలను పరస్పరం పంచుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.

కార్యక్రమానికి ఆహ్వానించిన ఎమ్మెల్యేకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యా వాలంటీర్లందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఫస్ట్ ఇంచార్జ్ నిజలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఎదురెదురుగా ఢీకొన్న కారు–ట్రాక్టర్

- **ఒకరు మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు**

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 08, వుదయం:**

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్సిపూర్ చౌరస్తా వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న కారు, ఇటుకలతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు వాహనాలు దెబ్బతిన్నాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానికుల సహాయంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలతో పాటు క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.



# చక్కని ఆరోగ్యం

## వైరస్ ఇన్ఫెక్షన్లకు, నాడీ క్షీణతకు మధ్య ఏమిటి సంబంధం..



వైరస్ ఇన్ఫెక్షన్లకు, నాడీ క్షీణతకు సంబంధించిన వ్యాధులకు మధ్య ఉన్న సంబంధంపై హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు కీలకమైన విషయాలను గుర్తించారు. ముఖ్యంగా ఇన్‌ఫ్లుయెంజా, కోవిడ్–19 వంటి వైరస్‌ల ఇన్‌ఫెక్షన్ల సమయంలో పార్కిన్సన్ వ్యాధితో సంబంధం ఉన్న ఆల్ఫా–సైన్యూక్లిన్ అనే ప్రోటీన్‌లో ఎలాంటి మార్పులు చోటుచేసుకోవచ్చో ఈ అధ్యయనం వివరించింది. ఈ పరిశోధన ద్వారా వైరల్ ఇన్‌ఫెక్షన్లు, మెదడు కణాల్లో అసాధారణ ప్రోటీన్ సమూహాలు ఏర్పడడం మధ్య ఉండే సంబంధంపై మరింత అవగాహన లభించే అవకాశం ఉంది. ఈ అధ్యయనం సెల్ రిపోర్ట్స్ జర్నల్‌లో ప్రచురితమైంది.పార్కిన్సన్ వ్యాధిలో నాడీ కణాల్లో ఉండే ఆల్ఫా–సైన్యూక్లిన్ అనే ప్రోటీన్ అసాధారణంగా ఒకదానితో ఒకటి చేరి అమైలాయిడ్ అనే గడ్డలుగా మారే అవకాశం ఉంటుంది. ఇవి మెదడు కణాల సాధారణ పనితీరుకు ఆటంకం కలిగించే అవకాశం ఉంటుంది. పరిశోధకులు ఇన్‌ఫ్లుయెంజా, సార్స్–కోవ్–2 వంటి ఆర్ఎన్ఏ వైరస్‌లను పరిశీలించగా, వాటిలో ఆర్ఎన్ఏ జీ–క్వాడ్రుప్లెక్స్‌లు (ఆర్‌జీ4లు) అని పిలిచే ప్రత్యేక నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. వైరస్ ఇన్‌ఫెక్షన్ సమయంలో ఈ నిర్మాణాలు ఆల్ఫా–సైన్యూక్లిన్‌తో పరస్పర చర్య జరిపి, అది అమైలాయిడ్ గడ్డలుగా మారే విధానాన్ని ప్రభావితం చేస్తాయని పరిశోధనలో తేలింది. ఈ ప్రక్రియలో డీడీఎక్స్39ఏ అనే రక్షణ ప్రోటీన్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణ పరిస్థితుల్లో కణంలోని కేంద్రకంలో ఉండే ఈ ప్రోటీన్, వైరస్ ఇన్‌ఫెక్షన్ సమయంలో సైటోప్లాజంలోకి చేరుతుంది. అక్కడ ఇది వైరస్ ఆర్ఎన్ఏ నిర్మాణాలతోపాటు ఆల్ఫా–సైన్యూక్లిన్‌తోనూ అనుసంధానమవుతుంది. వైరస్ విస్తరణను అడ్డుకునేందుకు కణాలు ఉపయోగించే రక్షణ వ్యవస్థలో భాగంగా డీడీఎక్స్39ఏ పనిచేస్తుంది. ఇది వైరస్ ఆర్ఎన్ఏ నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేయడంలో సహాయపడడంతోపాటు, ఆ నిర్మాణం తెరుచుకున్నప్పుడు ఆల్ఫా–సైన్యూక్లిన్ అమైలాయిడ్ గడ్డలు ఏర్పడే ప్రక్రియ కూడా గణనీయంగా నెమ్మదిస్తుందని పరిశోధకులు గుర్తించారు. అయితే వైరస్ సోకిన ప్రతిసారీ పార్కిన్సన్ వ్యాధి వస్తుందని ఈ అధ్యయనం చెప్పడం లేదు. వైరస్ ఇన్‌ఫెక్షన్ సమయంలో కణాల్లో వైరస్‌తో పోరాడే రక్షణ వ్యవస్థ, హానికరమైన ప్రోటీన్ గడ్డలు ఏర్పడకుండా అడ్డుకునే ప్రక్రియల మధ్య సమతుల్యత మారుతుందని పరిశోధకులు చెబుతున్నారు. ఇన్‌ఫెక్షన్లు పదేపదే రావడం లేదా దీర్ఘకాలం పాటు వాటికి గురికావడం వల్ల అనేక సంవత్సరాల తర్వాత నాడీ క్షీణతకు సంబంధించిన మార్పులు పెరిగే అవకాశం ఉందా అనే అంశంపై సీసీఎంబీ శాస్త్రవేత్తలు మరింత పరిశోధన చేస్తున్నారు. వైరల్ ఇన్‌ఫెక్షన్లు, అసాధారణ ప్రోటీన్ సమూహాలు ఏర్పడడానికి సంబంధించిన వ్యాధుల మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవడంలో ఈ పరిశోధన భవిష్యత్తులో ఉపయోగపడే అవకాశం ఉందని పరిశోధకులు తెలియజేస్తున్నారు.

## రోజూ 6 గంటల కన్నా తక్కువగా నిద్రిస్తున్నారా.. అయితే జాగ్రత్త..

రోజూ తగినంత నిద్రపోవడం శరీరానికి విశ్రాంతిని ఇవ్వడమే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే పని, సామాజిక బాధ్యతలు, ఎక్కువ సమయం తెరల ముందు గడపడం వంటి కారణాలతో చాలామంది నిద్రకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ముఖ్యంగా రోజూ ఆరు గంటల కంటే తక్కువ సమయం నిద్రపోవడం అలవాటుగా మారితే, ఉదయం అలసటగా ఉండడమే కాకుండా కాలక్రమేణా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. తగినంత నిద్రలో ఉన్నప్పుడు గుండె వేగం, రక్తపోటు తగ్గుతాయి. దీంతో గుండె, రక్తనాళాలకు విశ్రాంతి



లభిస్తుంది. నిద్ర తగ్గినప్పుడు ఈ విశ్రాంతి సమయం తగ్గి రక్తపోటు పెరగడంతో పాటు శరీరాన్ని అప్రమత్తంగా ఉంచే సానుభూతి నాడీ వ్యవస్థ అధికంగా పనిచేస్తుంది.నిద్రలేమి ప్రభావం కేవలం అధిక రక్తపోటుకే పరిమితం కాదు. ఆకలి, రక్తంలో చక్కెర స్థాయిలు, జీవక్రియను నియంత్రించే హార్మోన్ల సమతుల్యతకూ నిద్ర ముఖ్యమే. తగినంత నిద్రపోని వారిలో అధిక కేలరీలు ఉండే ఆహారాలపై కోరిక పెరుగుతుంది. వ్యాయామం చేయాలనే ఉత్సాహం కూడా తగ్గుతుంది. ఈ పరిస్థితులు దీర్ఘకాలంలో శరీర బరువు పెరగడం, ఊబకాయం, రక్తంలో చక్కెర నియంత్రణ సరిగా లేకపోవడం వంటి సమస్యలకు దారితీస్తుంది. ఇవన్నీ గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన ప్రమాద కారకాలుగా మారుతాయి. అయితే ఒక్కరోజు నిద్ర సరిగా లేకపోవడం, ప్రతిరోజూ ఐదు లేదా ఆరు గంటలకే పరిమితమవడం ఒకే రకమైన ప్రభావాన్ని చూపవు. నిద్రలేమి రోజువారీ జీవితంలో అలవాటుగా మారినప్పుడే దీర్ఘకాలిక ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

## చెక్క స్పూన్లు, స్పాటులాలను ఇలా శుభ్రం చేయాలి..



వంట గదిలో చెక్కతో తయారైన గరిటెలు, చెంచాలు, స్పాటులాలు తరచూగా ఉపయోగిస్తుంటారు. అయితే వీటిని సరిగ్గా శుభ్రం చేయకపోతే నూనె, తేమ, ఆహార పదార్థాల వాసనలు చెక్కలోకి ఇంకిపోతాయి. దీంతో బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే తరచూ తేమకు గురై ఆ తర్వాత ఎండిపోవడం వల్ల చెక్క వాపులకు గురికావడం, వంకరగా మారడం, పగుళ్లు రావడం వంటి సమస్యలు తలెత్తుతాయి. కాలక్రమేణా చెక్కలోని చిన్న రేణువులు విడిపోయి ఆహారంలో కలిసే ప్రమాదం కూడా ఉంటుంది. చెక్క గరిటెలు, చెంచాలు, స్పాటులాలను శుభ్రం చేసేందుకు ఒక సులభమైన పద్ధతిని నిపుణులు వివరించారు.

ముందుగా ఒక పాత్రలో నీటిని తీసుకుని అందులో కొద్దిగా ఉప్పు, కొద్దిగా వెనిగర్ వేసి మరిగించాలి. అందులో చెక్క సామగ్రిని వేసి కొన్ని నిమిషాల పాటు మరిగించాలి. ఇలా చేయడం వల్ల వాటిపై పేరుకుపోయిన మురికి, నూనె, ఆహార అవశేషాలను తొలగించేందుకు సహాయపడుతుంది.

మరిగించిన తర్వాత చెక్క సామగ్రిని శుభ్రమైన నీటితో బాగా కడిగి పూర్తిగా ఆరబెట్టాలి. చెక్కలో తేమ మిగిలి ఉండకుండా పూర్తిగా పొడిగా మారిన తర్వాత మాత్రమే తదుపరి ప్రక్రియ చేయాలి. ఆ తర్వాత చెక్క గరిటెలు, చెంచాలు, స్పాటులాలపై పలుచని పొరగా ఆవ నూనెను రాయాలి. ఇది చెక్క పొడిబారకుండా ఉంచడంలో, దాని నాణ్యతను కొంతకాలం కాపాడుకోవడంలో సహాయపడుతుంది. చెక్క వంట సామగ్రిని ఇలా క్రమం తప్పకుండా శుభ్రం చేసి, సరిగ్గా ఆరబెట్టి, సంరక్షించడం ద్వారా వాటిని ఎక్కువకాలం మంచి స్థితిలో ఉంచుకోవచ్చు. వంటగదిలో ఉపయోగించే చెక్క వస్తువులు తేమను ఎక్కువగా పీల్చుకోకుండా చూసుకోవడం, శుభ్రం చేసిన తర్వాత పూర్తిగా ఆరబెట్టడం కూడా ముఖ్యమే. సరైన సంరక్షణతో చెక్క గరిటెలు, చెంచాలు, స్పాటులాలను పరిశుభ్రంగా, ఉపయోగించడానికి అనుకూలంగా ఎక్కువకాలం ఉంచుకోవచ్చు.

## నిద్రకీ... స్వీట్ స్పాట్!



రాత్రంతా మేల్కోవడం, లేదంటే రోజంతా నిద్రపోవడం.... చాలామంది అమ్మాయిలకు ఇది అలవాటే కదా! కానీ, దానివల్ల త్వరగా వృద్ధాప్యం వస్తుందని మీకు తెలుసా? అవును... నిద్రకీ ఓ పరిమితి ఉంది. అది ఎక్కువైనా, తక్కువైనా ముప్పేనట. ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోయినా లేదూ ఎనిమిది గంటల కంటే ఎక్కువ నిద్రపోయినా... ఇవి రెండూ ఏజింగ్ త్వరగా అయ్యేందుకు కారణమవుతున్నాయని 'నేచర్' తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. దీనివల్ల మెదడు, గుండె, వ్యాధి నిరోధక శక్తి మీద ప్రతికూల ప్రభావం పడుతుందట. నిద్ర బాగా తక్కువైనప్పుడు మధుమేహం, ఊబకాయం, హృద్రోగాల ముప్పు అధికంగా ఉంటే.. ఎక్కువ నిద్ర అనేది మానసిక సమస్యలు, వాపు, జీవక్రియ సమస్యలతో ముడిపడి ఉంటుంది. అందుకే, మధ్యస్థంగా 6.4– 7.8 గంటలు నిద్రపోయే వ్యక్తులలో శరీర అవయవాలన్నీ సక్రమంగా పనిచేసి, వృద్ధాప్య ఛాయలను ఆలస్యం చేస్తాయట. అందుకే, ఈ మధ్యస్థ సమయాన్ని 'స్వీట్ స్పాట్'గా పరిగణిస్తున్నారు శాస్త్రవేత్తలు. మరి మీరు ఎలా నిద్ర పోతున్నారు?!

## అందుకే డిన్నర్ త్వరగా చేయాలి..!

ఎంతోమందిని వేధించే ఆరోగ్య సమస్యల్లో మధుమేహం ఒకటి. అయితే దీని బారిన పడకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. కొంతమంది ఇల్లు, ఆఫీసు పనులతోనే రోజంతా గడిపేస్తుంటారు. ఈ క్రమంలో వ్యాయామానికి ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వరు. ఇలాంటి జీవనశైలి వల్ల మధుమేహం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయంటున్నారు. అందుకే రోజులో కనీసం 40 నిమిషాలు వ్యాయామానికి.. 20 నిమిషాలు ప్రాణాయామం చేయడానికి కేటాయించాలని చెబుతున్నారు. ఇలా శరీరానికి శ్రమ కలిగించడం వల్ల రక్తప్రసరణ మెరుగవ్వడంతో పాటు శరీరంలోని ప్రతి కణానికి సరిపడినంత ఆక్సిజన్ సరఫరా అవుతుందని చెబుతున్నారు. అలాగే ఇన్సులిన్ కూడా అవసరమైనంత మేరకు ఉత్పత్తయ్యే అవకాశం ఉందంటున్నారు.

పంచదార, మైదా.. మొదలైన వాటిని తీసుకోకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. ఈ పదార్థాలకు మధుమేహ తీవ్రతను పెంచే అవకాశం ఎక్కువగా ఉంటుందంటున్నారు. వీటికి బదులుగా సహజసిద్ధంగా లభించే పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవచ్చని సూచిస్తున్నారు. అలాగే రాగులు, జొన్నలు వంటి చిరుధాన్యాలను తగిన మోతాదులో ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల పలు ప్రయోజనాలను సొంతం చేసుకోవచ్చు. నట్స్‌ను నేరుగా కాకుండా నానబెట్టి తీసుకోవడం మంచిదంటున్నారు.



రక్తంలో చక్కెర స్థాయులు పెరగడం వల్లే మధుమేహం వస్తుందన్న విషయం తెలిసిందే. అయితే చక్కెర స్థాయులను తగ్గించుకోవాలంటే రాత్రి భోజనాన్ని ఎంత తొందరగా ముగిస్తే అంత మంచిదంటున్నారు నిపుణులు. కొంతమంది తిన్న వెంటనే నిద్రపోవడానికి ప్రయత్నిస్తారు. ఈ అలవాటు ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదంటున్నారు నిపుణులు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు తిన్న వెంటనే పడుకోవడం వల్ల చక్కెర స్థాయులు పెరుగుతాయంటున్నారు. అందుకే సాధ్యమైనంతవరకు తిన్న వెంటనే నిద్రపోకూడదని సూచిస్తున్నారు. రాత్రి భోజనం వీలైనంత త్వరగా తీసుకోవాలని చెప్పడానికి కూడా ఇదే కారణం. కొంతమంది ఎలాగూ మందులున్నాయని మధుమేహాన్ని తేలిగ్గా తీసుకుంటారు. అయితే ఈ సమస్యను నియంత్రించుకోవడానికి కేవలం మందుల మీదే ఆధారపడడం మంచిది కాదు. కాబట్టి, వీటితో పాటు పైన పేర్కొన్న జాగ్రత్తలను పాటించడం, ఆయా విషయాల్లో వైద్యుల సలహాలు తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు నిపుణులు.

## రుమాటిక్ హార్ట్ డిసీజ్ అంటే ఏమిటి..

భారత్‌లో గుండె కవాటాల వ్యాధుల పరిస్థితి పాశ్చాత్య దేశాలతో పోలిస్తే భిన్నంగా ఉంది. వృద్ధాప్యంలో గుండె కవాటాలు అరిగిపోవడం అక్కడ ప్రధాన కారణంగా కనిపిస్తే, భారత్‌లో చిన్నతనంలో వచ్చిన గొంతు ఇన్‌ఫెక్షన్‌కు సరైన చికిత్స అందకపోవడం వల్ల వచ్చే రుమాటిక్ హార్ట్ డిసీజ్ (ఆర్‌హెచ్‌డీ) ముఖ్య కారణంగా ఉంది. ఈ వ్యాధి కారణంగా గుండె కవాటాలు దెబ్బతిని, కొన్నేళ్ల తర్వాత గుండె పనితీరుపై ప్రభావం చూపుతాయి. భారత్‌లో ప్రతి వెయ్యి మందిలో 1.5 నుంచి 2 మందికి ఈ వ్యాధి ఉన్నట్లు అంచనా. మొత్తం మీద 20 నుంచి 25 లక్షల మంది ఈ సమస్యతో బాధపడుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. ఒక్క ఏడాదిలోనే సుమారు 88,674 మంది ఈ వ్యాధి



కారణంగా ప్రాణాలు కోల్పోతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. గుండెలో రక్తం సరైన దిశలో ప్రవహించేందుకు నాలుగు కవాటాలు కీలకంగా పనిచేస్తాయి. వీటిలో ఏదైనా కవాటం పూర్తిగా తెరుచుకోకపోతే దాన్ని స్టెనోసిస్ అంటారు. సరిగ్గా మూసుకోకపోతే రక్తం వెనక్కి ప్రవహించే పరిస్థితిని రెగర్జిటేషన్ అంటారు. ఈ రెండు పరిస్థితుల్లోనూ గుండెపై అదనపు భారం పడుతుంది. రుమాటిక్ హార్ట్ డిసీజ్‌లో మైట్రల్ కవాటం ఎక్కువగా ప్రభావితమవుతుంది. సుమారు 65 నుంచి 70 శాతం కేసుల్లో ఈ కవాటానికే సమస్య వస్తుంది. ఆ తర్వాత 20 నుంచి 25 శాతం కేసుల్లో ఏఆర్టిక్ కవాటం, సుమారు 10 శాతం కేసుల్లో ట్రైకస్పిడ్ కవాటం ప్రభావితమవుతాయి. చిన్నతనంలో వచ్చిన గొంతు ఇన్‌ఫెక్షన్ సాధారణ సమస్యగానే భావించి నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ నష్టం క్రమంగా సంవత్సరాల పాటు కొనసాగుతుంది. ఈ వ్యాధి లక్షణాలు మొదట్లో సాధారణ సమస్యల మాదిరిగానే కనిపించడంతో చాలామంది వాటిని పట్టించుకోరు.

## ఉప్పు, చక్కెర మోతాదుకు

నేటి ఆధునిక జీవనశైలిలో ప్రజలు ఉప్పు , చక్కెరలను అధికంగా వినియోగిస్తున్నారు. రెండూ ఆహార రుచిని పెంచడానికి ఉపయోగపడ





తాయి. అయితే మోతాదులో తింటేనే ఆరోగ్యం అన్ని విధాలా బావుంటుంది. లేదంటే ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే ఉప్పు, చక్కెరల వాడకాన్ని నియంత్రించి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా నిండు నూరేళ్లు జీవించవచ్చు. ఉప్పుతో కలిగే అనర్థాలేమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

1. ఉప్పులో ఉండే సోడియం శరీరానికి అవసరమే అయినప్పటికీ, అది ఎక్కువైతే రక్తపోటు పెరుగుతుంది. శరీరంలో సోడియం పెరిగితే రక్తనాళాలపై ఒత్తిడి పెరిగి 'హై బీపీ' కి దారితీస్తుంది. దీర్ఘకాలిక అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంది. ఉప్పు ఎక్కువైతే మూత్రపిండాల వడపోత సామర్థ్యం తగ్గి, కిడ్నీ వ్యాధులు వస్తాయి.
2. చక్కెరను 'వైట్ పాయిజన్' అని పిలుస్తారు. చక్కెరలో క్యాలరీలు ఎక్కువ. ఇది శరీరంలో కొవ్వు పేరుకుపోయేలా చేసి బరువును పెంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడంవల్ల ఇన్సులిన్ నిరోధకత ఏర్పడి 'టైప్–2 డయాబెటిస్' కు కారణమవుతుంది. అతిగా చక్కెర తీసుకోవడంవల్ల కాలేయంలో కొవ్వు చేరుతుంది.
3. మనం ఎక్కువ ఉప్పు తీసుకున్నప్పుడు, మన శరీరం ఆ అధిక సోడియంను మూత్రం ద్వారా బయటకు పంపే ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రక్రియలో సోడియంతో పాటు కాల్షియం కూడా శరీరం నుంచి బయటకు పోతుంది. దీనివల్ల ఎముకలు సాంద్రత కోల్పోయి బలహీనపడతాయి. చిన్న దెబ్బలకే ఎముకలు విరిగే ప్రమాదం పెరుగుతుంది.
4. అతిగా చక్కెర తీసుకోవడంవల్ల చర్మం తన మెరుపును కోల్పోతుంది. రక్తంలోని చక్కెర, ప్రోటీన్లతో కలిసి హానికరమైన అణువులను ఉత్పత్తి చేస్తుంది. ఇది చర్మంలోని కొల్లాజెన్‌ను దెబ్బతీసి, చిన్న వయసులోనే ముడతలు వచ్చేలా చేస్తుంది. మొటిమలు, చర్మ సంబంధిత అలర్జీలు కూడా పెరగవచ్చు.
5. చక్కెర, ఉప్పు కేవలం శారీరక ఆరోగ్యాన్నే కాదు, మానసిక స్థితిని కూడా ప్రభావితం చేస్తాయి. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు తిన్నప్పుడు వెంటనే శక్తి వచ్చినట్లు అనిపిస్తుంది, కానీ కాసేపటికే నీరసం, చిరాకు ఆవహిస్తాయి.

## మధుమేహం ఉన్నవారికి గుండె సమస్యల ప్రమాదం ఎక్కువ..

మధుమేహాన్ని కేవలం రక్తంలో చక్కెర స్థాయిలకు సంబంధించిన సమస్యగా చూడకూడదు. రక్తంలో చక్కెర ఎక్కువగా ఉండే పరిస్థితి దీర్ఘకాలం కొనసాగితే గుండె, రక్తనాళాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది. రక్తంలో అధిక చక్కెర రక్తనాళాల లోపలి పొరను దెబ్బతీసి, శరీరంలో వాపు, కణాలపై ఒత్తిడి పెరగడానికి కారణమవుతుంది. ఫలితంగా రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి అవి గట్టిపడే ప్రమాదం పెరుగుతుంది. దీంతో గుండెకు రక్తప్రసరణ తగ్గి గుండెపోటు, పక్షవాతం, గుండె వైఫల్యం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువవుతుంది. మధుమేహం ఉన్నవారిలో గుండె సంబంధిత వ్యాధుల ముప్పు ఇతరులతో పోలిస్తే గణనీయంగా ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చక్కెరను అదుపులో ఉంచడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు. అయితే మధుమేహ నియంత్రణ అంటే కేవలం చక్కెర స్థాయిలను తగ్గించడం మాత్రమే కాదు. అధిక రక్తపోటు,



కొలెస్ట్రాల్‌లో మార్పులు, అధిక బరువు, పొగతాగడం వంటి అంశాలు కూడా గుండెపై ప్రభావం చూపుతాయి. మధుమేహంతోపాటు ఇవి ఉన్నప్పుడు రక్తనాళాలు మరింత గట్టిపడి గుండెపై భారం పెరుగుతుంది. అందువల్ల రక్తపోటు, కొలెస్ట్రాల్, బరువు వంటి వాటిని క్రమం తప్పకుండా పరిశీలించుకోవడంతోపాటు శారీరక చురుకుదనాన్ని పెంచుకోవడం, పొగతాగడం మానేయడం వంటి చర్యలు కూడా అవసరం.

మధుమేహం చికిత్సలో ఇటీవలి కాలంలో అనేక మార్పులు వచ్చాయి. రక్తంలో చక్కెరను నియంత్రించడంతోపాటు గుండె, మూత్రపిండాలను రక్షించడంపై కూడా దృష్టి పెడుతున్నారు. కొన్ని ఆధునిక మధుమేహ మందులు రక్తంలో చక్కెరను తగ్గించడమే కాకుండా గుండె వైఫల్యం, ఇతర గుండె సంబంధిత సమస్యల ముప్పును తగ్గించడంలోనూ ఉపయోగపడుతున్నాయి. అయితే ఏ మందులు వాడాలన్నది వైద్యుల సలహా మేరకే నిర్ణయించుకోవాలి. మందులను క్రమం తప్పకుండా తీసుకోవడంతోపాటు రక్తంలో చక్కెర, రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం ముఖ్యం. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి జీవనశైలిలో మార్పులు కూడా కీలకమే. కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, పప్పులు, పీచు పదార్థాలు అధికంగా ఉండే సమతుల ఆహారం తీసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంతోపాటు గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుచుకోవచ్చు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారిలో గుండె సంబంధిత సమస్యలు స్పష్టమైన లక్షణాలు లేకుండానే మొదలయ్యే అవకాశం ఉన్నందున క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం అవసరం. రక్తంలో చక్కెరను నియంత్రించడంతోపాటు ఇతర గుండె ప్రమాద కారకాలను కూడా అదుపులో ఉంచడం ద్వారా దీర్ఘకాలిక సమస్యలను గణనీయంగా తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## మెనోపాజ్ ముందే వస్తే గుండె ఆరోగ్యంపై ప్రభావం ఎక్కువ..



మెనోపాజ్ మహిళల జీవితంలో సహజంగా వచ్చే దశ. అయితే సాధారణ వయసు కంటే ముందే మెనోపాజ్ రావడం కేవలం రుతుక్రమానికి సంబంధించిన మార్పుగానే కాకుండా గుండె ఆరోగ్యంపైనా ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. 45 ఏళ్లలోపు మెనోపాజ్ రావడాన్ని ముందస్తు మెనోపాజ్‌గా, 40 ఏళ్లలోపు రావడాన్ని ప్రీమేచ్యూర్ మెనోపాజ్‌గా పరిగణిస్తారు. ఇలాంటి మహిళల్లో గుండె, రక్తనాళాల వ్యాధుల ముప్పు పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్, పొగతాగడం వంటి ఇతర ప్రమాద కారకాలు ఉంటే ఈ ముప్పు మరింత పెరుగుతుంది. అందుకే ముందస్తు మెనోపాజ్‌ను మహిళల మొత్తం గుండె ఆరోగ్యాన్ని అంచనా వేసే సమయంలో పరిగణనలోకి తీసుకోవడం అవసరం. ముందస్తు మెనోపాజ్‌కు గుండె ఆరోగ్యానికి మధ్య సంబంధంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ తగ్గుదల కీలక పాత్ర పోషిస్తుంది. ఈస్ట్రోజెన్ గుండె, రక్తనాళాలకు కొంత రక్షణ కల్పిస్తుంది. రక్తనాళాలు సాగేలా ఉండడానికి, వాటి లోపలి పొర ఆరోగ్యంగా ఉండడానికి, కొలెస్ట్రాల్ స్థాయిలు సమతుల్యంగా ఉండడానికి ఇది సహాయపడుతుంది. మెనోపాజ్ ముందుగానే వస్తే ఈ రక్షణాత్మక ప్రభావాలు కూడా తక్కువ వయసులోనే తగ్గిపోతాయి. ఫలితంగా రక్తపోటు, కొలెస్ట్రాల్, రక్తనాళాల పనితీరు, శరీర జీవక్రియలో మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ముందస్తు మెనోపాజ్ వచ్చిన ప్రతి మహిళకు తప్పనిసరిగా గుండె జబ్బు వస్తుందని అర్థం కాదు. కుటుంబ చరిత్ర, జీవనశైలి, ఇతర ఆరోగ్య సమస్యలు, ముందస్తు మెనోపాజ్‌కు కారణం వంటి అంశాలు కూడా గుండె ముప్పును ప్రభావితం చేస్తాయి. ఇతర గుండె సంబంధిత ప్రమాద కారకాలు ఉన్నప్పుడు ముందస్తు మెనోపాజ్ ప్రభావాన్ని మరింత జాగ్రత్తగా పరిగణించాలి. అధిక రక్తపోటు గుండె, రక్తనాళాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. మధుమేహం రక్తనాళాలను దెబ్బతీసి గుండె జబ్బుల ముప్పును పెంచుతుంది. అధిక ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడానికి కారణమవుతుంది. అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవడం, పొగతాగడం కూడా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. అలాగే కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నా ప్రమాదం పెరుగుతుంది.

## ఎయిరిండియా ట్రావెల్ సిమ్స్..

ఎయిరిండియా ట్రావెల్ సిమ్ కార్డ్స్‌ను లాంచ్ చేసింది. ఈజీ రోమ్ పేరిట ఇంటర్నేషనల్ రోమింగ్ సేవలను ప్రారంభించింది. దీంతో విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు మొబైల్‌డేటా, వాయిస్ సర్వీసెస్‌ల యాక్సెస్ లభిస్తుంది. ఇందుకోసం టాటా కమ్యూనికేషన్స్‌తో ఎయిరిండియా భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ రెండు సంస్థలు టాటా గ్రూపులో భాగమన్న విషయం తెలిసిందే. ఎయిరిండియా అధికారిక వెబ్‌సైట్‌లో ఈజీ రోమ్ ఫిజికల్ సిమ్, ఇ-సిమ్ (eSIM) రెండూ ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. విదేశీ ప్రయాణాల సమయంలో మొబైల్ కనెక్టివిటీ అందించడానికి ఈ సిమ్ కార్డ్స్‌ను తీసుకొచ్చారు. లాంచింగ్ ఆఫర్‌లో ఈజీరోమ్ సిమ్ కార్డు ఉచితంగా లభిస్తుంది. అయితే ఎంపిక చేసిన రోమింగ్ ప్యాక్‌లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.




# క్యాన్సర్ ఔషధాల మార్జిన్‌పై పరిమితి

క్యాన్సర్ మందుల ధరల నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాన్-షెడ్యూల్డ్ యాంటీ క్యాన్సర్ డ్రగ్స్‌పై ట్రేడ్ మార్జిన్‌ను ఎంఆర్‌పీలో 30 శాతానికి పరిమితం చేయాలని నిర్ణయించింది. మొత్తం 110 రకాల మందులు ఈ పరిమితి పరిధిలోకి రానున్నాయి. దీంతో తయారీదారు నుంచి మందు రోగికి చేరే వరకు మధ్యలోని వ్యాపారులు, పంపిణీదారులు అధిక మార్జిన్ వసూలు చేయకుండా నియంత్రణ ఏర్పడనుంది. ఈ నిర్ణయం అక్టోబరు చివరి వారంలోగా పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు కొన్ని ఎంపిక చేసిన నాన్-షెడ్యూల్డ్ క్యాన్సర్ మందులపై మాత్రమే 30 శాతం ట్రేడ్ మార్జిన్ పరిమితి అమల్లో ఉంది. 42 రకాల మందులకు ఈ విధానం వర్తింపజేయడంతో 526 బ్రాండ్ల ఎంఆర్‌పీలు సగటున సుమారు 50 శాతం తగ్గాయని కేంద్రం గతంలో వెల్ల



డించింది. దీనివల్ల రోగులకు ఏటా సుమారు రూ.984 కోట్ల మేర ఆదా జరిగినట్లు వివరించింది. మందుల ధరలపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో కేంద్రం తాజా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. రిటైలర్లకు కేవలం రూ.2,700కే సరఫరా అవుతున్న ఒక క్యాన్సర్ ఔషధంపై.. రూ.27 వేల ఎంఆర్‌పీ ముద్రించడం దిగ్భ్రాంతికరమని పేర్కొంది. ఇలాంటి భారీ వ్యత్యాసాలను నియంత్రించాల్సిన అవసరాన్ని కోర్టు ప్రశ్నించింది. ఈ విధానం వల్ల సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# TCS లాభం రూ.13884 కోట్లు..

ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS) మెరుగైన త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో రూ.13,884 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.12,075 కోట్లతో పోలిస్తే 15 శాతం వృద్ధి నమోదైంది. అంతకు ముందు త్రైమాసికంలో నికర లాభం రూ.13,349 కోట్లుగా ఉంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ.73,188 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఈ మొత్తం రూ.65,799 కోట్లు కాగా.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.72,275 కోట్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే కంపెనీ మొత్తం ఖర్చులు రూ.49,463 కోట్ల నుంచి రూ.55,886 కోట్లకు పెరిగినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. త్రైమాసిక ఫలితాల సందర్భంగా కంపెనీ వాటాదారులకు డివిడెండ్‌ను కూడా ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.12 చొప్పున డివిడెండ్‌ను చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. గడిచిన మూడు నెలల్లో 4,258 మంది ఉద్యోగులను నియమించుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో సెప్టెంబర్ 30 నాటికి మొత్తం




ఉద్యోగుల సంఖ్య 5.98 లక్షలకు చేరింది. ఫలితాల వేళ టీసీఎస్ షేరు విలువ స్వల్పంగా క్షీణించి రూ.2075.25 వద్ద ముగిసింది.

## ఏఐ నియంత్రణకు త్వరలో మార్గదర్శకాలు: అశ్వినీ వైష్ణవ్



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై (AI) నియంత్రణకు కేంద్రం నడుం బిగించింది. దీనిపై త్వరలో మార్గదర్శకాలు రూపొందించనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఏఐ సేఫ్టీ, డీప్‌ఫేక్‌లు, మానవీయ కోణం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని నెల రోజుల్లో సంప్రదింపుల పత్రం విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. భారత్‌లోనూ ఏఐ నియంత్రణకు నిబంధనలు తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. త్వరలోనే సంప్రదింపుల పత్రంతో ముందుకు రావాలని సంబంధిత విభాగానికి సూచించారు.
ఈ సందర్భంగా డీప్‌ఫేక్‌ల గురించి మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. సమాజంలో సమస్యలను సృష్టించే విధంగా తయారయ్యాయని అన్నారు. దీన్నో ఉపద్రవంగా అభివర్ణించారు. డీప్‌ఫేక్‌ల నాణ్యత రోజురోజుకూ మెరుగవుతోందని పేర్కొన్నారు. పౌరులు కూడా వాటిని విశ్వసించడం మొదలుపెడితే తప్పుడు విషయాలు నమ్మడానికి ఆకర్షితులవ్వడంతో పాటు తప్పులు చేసేందుకూ వెనుకాడబోరని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి డీప్‌ఫేక్‌ల వెనుక ఎవరున్నా విడిచిపెట్టేది లేదని, అందుకు అనుగుణంగా కఠిన నిబంధనలను సంబంధిత పత్రంలో పొందుపరచనున్నట్లు పేర్కొన్నారు. ఏఐని గానీ, ఇతర సాంకేతికతలను గానీ కేవలం చట్టాల ద్వారా నియంత్రించలేమని; పరిశ్రమ, భాగస్వామ్యపక్షాల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు.

## పన్ను అధికారులకు 'అరెస్ట్ పవర్' కట్.. కౌన్సిల్ నిర్ణయాలు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన నిర్వహించిన జీఎస్టీ కౌన్సిల్ 57వ సమావేశం ముగిసింది. పన్ను అధికారులకున్న అరెస్టు అధికారాన్ని జీఎస్టీ మండలి రద్దు చేసింది. ప్రాసిక్యూషన్ పరిమితిని కూడా రూ.కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచుతూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం నిర్ణయాలను ఆర్థిక మంత్రి మీడియాకు వెల్లడించారు. జీఎస్టీ రేట్లలో ఈసారి ఎలాంటి మార్పులూ చేయలేదు.




''రేట్ల అంశం ఇప్పటికే ఖరారైంది. రోజువారీ అంశాలపై కౌన్సిల్ ఈ సారి దృష్టి సారించింది. ఏడాదికి ఒకసారి జీఎస్టీ రేట్లలో మార్పులు జరుగుతాయి'' అని ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌ల అంశాన్ని పరిశీలించేందుకు ఆఫీసర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సప్లయర్‌కు పూర్తి మొత్తం చెల్లించి ఉత్పత్తులు, తగిన ఇన్‌వాయిస్‌లు కలిగిన బయ్యర్లను ఎలా రక్షణ కల్పించాలనే దానిపై ఆఫీసర్లు మూడు నెలల్లో నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. తదుపరి జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చిస్తామని తెలిపారు. ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌పై చిన్న వ్యాపారులకు ఊరటనిచ్చేలా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇ-కామర్స్‌లో విక్రయించే చిరు వ్యాపారుల రిజిస్ట్రేషన్ మెకానిజాన్ని సులభతరం చేశారు.

# సెన్సెక్స్ 1000 పాయింట్ల పతనం.. ₹10 లక్షల కోట్లు ఆవిరి

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల వల్ల చమురు ధరలు పెరగడం, దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ నిధులు తరలిపోతుండటం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచడమూ సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 1000 పాయింట్లకు పైగా కుంగింది. నిఫ్టీ ఓ దశలో 52 వారాల కనిష్ఠానికి పడిపోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.10 లక్షల కోట్ల మేర తుడిచిపెట్టుకుపోయింది. ఉదయం సెన్సెక్స్ 72,668.00 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 72,638.70) ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీ.. ఆరంభంలోనే నష్టాల్లోకి జారుకుంది. రోజంతా భారీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 71,327.75 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1045.46 పాయింట్లు పతనమై 71,593.24 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 371.25 పాయింట్లు క్షీణించి 22,231.80 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.78గా ఉంది. సెన్సెక్స్ 30లో టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ నష్టాలను చవిచూశాయి. ఐటీసీ, ఇండిగో, పవర్ గ్రిడ్, బీఈఎల్, అదానీ పోర్ట్స్, ఎన్‌టీపీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 104.42 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,123.86



డాలర్ల వద్ద ట్రేడవుతోంది. గల్ఫ్ ప్రాంతం, హర్మూజ్ జలసంధిలో నౌకలపై దాడులు కొనసాగుతుండటంతో చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్న ఆందోళనలు పెరిగాయి. దీంతో క్రూడాయిల్ ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి.
10 ఏళ్ల యూఎస్ ట్రెజరీ రాబడులు మూడు బేసిస్ పాయింట్లు పెరిగి 5.31 శాతానికి చేరాయి. విదేశీ మదుపర్లు దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి నిధులను తరలించడమూ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. బుధవారం రూ.6,100 కోట్లకు పైగా ఈక్విటీ షేర్లను విదేశీ మదుపర్లు విక్రయించడం గమనార్హం. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచడం కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. అంతర్జాతీయ పరిస్థితులు, ద్రవ్యోల్బణ అంచనాల ఆధారంగా మరోసారి వడ్డీరేట్లు పెంచడమో లేదంటే.. స్థిరంగా కొనసాగించడమో జరుగుతుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇప్పట్లో వడ్డీ రేట్ల కోత ఉండదనే భయాలు మార్కెట్ పతనానికి ఓ కారణం.
ఆసియా మార్కెట్లలో జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు 1 శాతానికి పైగా నష్టపోగా.. దక్షిణ కొరియా సూచీ కాస్పి 2 శాతం వరకు కుంగింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల ప్రభావం కూడా మన సూచీలపై పడింది.






## ఆసీస్‌ను రెచ్చగొట్టేలా..

### శాండ్‌పేపర్ స్కాండల్ వీడియో టెలికాస్ట్

2018 శాండ్ పేపర్ స్కాండల్ గుర్తుంది కదా.. ప్రపంచ క్రికెట్‌ను కుదుపేసిన ఘటన. ఏకంగా ఆస్ట్రేలియా కెప్టెన్‌గా ఉన్న స్టీవ్ స్మిత్‌పై వేటు పడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ ఎనిమిదేళ్ల తర్వాత ఆస్ట్రేలియా తొలిసారి దక్షిణాఫ్రికాలో పర్యటిస్తోంది. శుక్రవారం నుంచి ఇరు జట్ల మధ్య మొదటి టెస్టు ప్రారంభం కానుంది. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా బ్రాడ్‌కాస్టర్ సూపర్‌స్పోర్ట్ మళ్లీ శాండ్‌పేపర్‌ను ఘటనను గుర్తు చేస్తూ వీడియోను టెలికాస్ట్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 'ఈ మూడు టెస్టుల సిరీస్ కోసం మా కెమెరాలు చాలా షార్ప్‌గా ఉంటాయి' అని సూపర్‌స్పోర్ట్ క్యాప్షన్ ఇచ్చింది.

# ఆ 'ఓపెనర్' కోసం రాంచీ మ్యాచ్‌కు ధోనీ..!



భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని ప్రస్తుతం కేవలం ఐపీఎల్‌లోనే కొనసాగుతున్నాడు. గత సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అయినా సరే వచ్చే ఎడిషన్‌లో అతడిని మైదానంలో చూస్తామని అభిమానులు ఆశగా ఉన్నారు. ఈ క్రమంలో ధోనీని చూసే అవకాశం ఫ్యాన్స్‌కు మరో రూపంలో రాబోతోంది. రాంచీ వేదికగా వెస్టిండీస్‌తో టీమ్‌ఇండియా శుక్రవారం రెండో టీ20 మ్యాచ్‌లో తలపడనుంది. మహీ సొంతూరు 'రాంచీ'నే కదా..! దీంతో ఈ మాజీ కెప్టెన్ మ్యాచ్‌కు వస్తాడని ప్రచారం సాగుతోంది. మరోవైపు ఐపీఎల్‌కు సంబంధించి ఓ డీల్ కూడా చేసుకోబోతున్నాడనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.
రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలోని చెన్నై సూపర్ కింగ్స్ గత రెండు సీజన్లలో మెరుగైన ప్రదర్శన చేయలేకపోయింది. సంజు శాంసన్ వచ్చినా.. ఆ జట్టు పరిస్థితి మాత్రం మారలేదు. దీంతో సంజుకు జోడీగా మరో స్టార్ ఓపెనర్‌ను తీసుకోవాలని మేనేజ్‌మెంట్ భావిస్తోందట. డేవన్ కాన్వే తర్వాత ఆ జట్టుకు నిలకడైన విదేశీ ఓపెనర్ లేడు. ఇప్పుడు విండీస్ కెప్టెన్ షై హోప్ అద్భుత ఫామ్‌తో అలరిస్తున్నాడు. అతడిని జట్టులోకి తీసుకొనేందుకు ధోనీ సంప్రదింపులు జరపబోతున్నాడని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌తో మూడో వన్డేలో భారీ శతకంతో అలరించిన షై హోప్.. ధోనీతో సంభాషించడం వల్లే తన బ్యాటింగ్ మెరుగైందని అన్నాడు. దీంతో అతడి కోసం సీఎస్‌కే తరఫున ధోని రంగంలోకి దిగబోతున్నాడని తెలుస్తోంది. మరికొద్ది రోజుల్లో ఐపీఎల్ రిటెన్షన్‌కు సంబంధించి ఫ్రాంచైజీలు తమ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత డిసెంబర్‌లో వేలం జరగనుంది.

**అది అదృష్టం: మోహిత్ శర్మ**

ఎంఎస్ ధోనీ సారథ్యంలో ఆడటం గొప్ప అదృష్టమని వెటరన్ ఆటగాడు మోహిత్ శర్మ తెలిపాడు. ''మహీ భాయ్ నాయకత్వంలో ఆడిన అనుభవం అద్భుతం. భారత్ తరఫున నా కెరీర్‌లో ఎక్కువ భాగం ధోని సారథ్యంలోనే ఆడటం నిజంగా అదృష్టం. ఒకే కెప్టెన్సీలో ఆడటం వల్ల మన బలాలు, బలహీనతలు ఏంటో వారు అర్థం చేసుకోవడం సులువు. పరిస్థితికి అనుగుణంగా మనల్ని వినియోగించుకుంటారు. ఐపీఎల్‌లోనూ (IPL) నేను సీఎస్‌కే తరఫున మ్యాచ్‌లు ఆడా. నా కెరీర్‌పై అతడి ప్రభావం చాలానే ఉంది. అందుకు ఎప్పటికీ కృతజ్ఞుడినే'' అని మోహిత్ తెలిపాడు.

# పంజాబ్ కింగ్స్‌కు ఇద్దరు కోచ్‌లు గుడ్‌బై



ఐపీఎల్ 2027 సీజన్ కోసం కోచ్‌ల వేటను ఫ్రాంచైజీలు ముమ్మరం చేశాయి. ఇప్పటికే సీఎస్‌కే, ఢిల్లీ క్యాపిటల్స్ తమ హెడ్ కోచ్‌లను నియమించుకున్న సంగతి తెలిసిందే. తాజాగా పంజాబ్ కింగ్స్‌కు ఇద్దరు కోచ్‌లు వీడ్కోలు పలికేశారు. దీంతో కొత్త కోచ్‌ల కోసం ఆ ఫ్రాంచైజీ వేట ప్రారంభించింది. ఈ జట్టుకు రికీ పాంటింగ్ ప్రధాన కోచ్ అన్న సంగతి తెలిసిందే. అయితే, ఫీల్డింగ్ కోచ్ అయిన బ్రాడ్ హడిన్, బౌలింగ్ కోచ్‌గా ఉన్న జేమ్స్ హోప్స్ ఇప్పుడు జట్టును వీడారు. గతేడాది సాయిరాజ్ బహుతులే వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. అతడు ప్రస్తుతం భారత జట్టు బౌలింగ్ కోచ్‌గా ఉన్నాడు. ఇదిలా ఉండగా.. వచ్చే ఐపీఎల్ (IPL) సీజన్ నాటికి జట్టులో మళ్లీ భారీ మార్పులు చేసేందుకు పంజాబ్ కింగ్స్ చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆ జట్టు సారథి శ్రేయస్ అయ్యర్‌ను ముంబయి ఇండియన్స్ తీసుకొని సారథ్యం అప్పగించే అవకాశాలున్నట్లు సమాచారం. రికీ పాంటింగ్ కూడా జట్టును వీడతాడని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది చివర్లో ఐపీఎల్ మినీ వేలం జరగనుంది. అంతకుముందు రిటెన్షన్‌కు సంబంధించి ప్రక్రియను ఫ్రాంచైజీలు పూర్తి చేయాల్సి ఉంటుంది. కాగా.. గత సీజన్‌లో పంజాబ్ (Punjab Kings) ఐదో ప్లేస్‌తో టోర్నీని ముగించింది. అంతకుముందు ఎడిషన్‌లో ఫైనల్‌కు చేరుకున్నా.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓటమి తప్పలేదు.

## నా ఇంటర్వ్యూకు గంగూలీ హాజరు కాకపోవడం తీవ్రంగా బాధించింది: రవిశాస్త్రి



తనను భారత క్రికెట్ జట్టుకు డైరెక్టర్‌గా తప్పించడం సరిగా అనిపించలేదని రవిశాస్త్రి తెలిపారు. 2016లో తనను కాదని అనిల్ కుంబ్లేను ప్రధాన కోచ్‌గా నియమించారని.. తన ఇంటర్వ్యూకు గంగూలీ హాజరు కాకపోవడం మరింత బాధించిందని గుర్తు చేసుకున్నారు. 2014లో టీమ్‌ఇండియాకు రవిశాస్త్రి డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ పదవిలో ఉన్నారు. రెండేళ్ల తర్వాత ఆ పదవిని బీసీసీఐ తీసేసింది. ప్రధాన కోచ్ పదవికి దరఖాస్తు చేయాలని రవిశాస్త్రికి సూచించింది. సౌరభ్ గంగూలీ, సచిన్ తెందుల్కర్, వీవీఎస్ లక్ష్మణ్‌తో కూడిన క్రికెట్ సలహా మండలి చివరి క్షణంలో రవిశాస్త్రిని కాదని కుంబ్లేను ఎంపిక చేసింది.
''నేను డైరెక్టర్‌గా ఉన్నా. రెండేళ్ల తర్వాత బోర్డు సభ్యులు వచ్చి ఆ పదవిని రద్దుచేస్తున్నాం.. హెడ్ కోచ్ పదవికి దరఖాస్తు చేయమని చెప్పింది. నన్ను బయటకు పంపించేందుకు మరో కారణం ఉందని అనిపించింది. ఆ నిర్ణయం నన్ను చాలా బాధించింది. జట్టు కోసం నా శాయశక్తులా కృషి చేశా. నన్ను ఇంటర్వ్యూ చేసేందుకూ గంగూలీ గైర్హాజరు కావడం మరింత బాధపెట్టింది'' అని రవిశాస్త్రి తెలిపారు.
'నా వ్యాఖ్యాత పాత్రను పోషించేందుకు వెళ్లిపోయా. ఆటతోనే మమేకమై ఉన్నా. దాదాపు ఏడాదిన్నరపాటు మంచి అనుభవం సంపాదించా. ఎన్నో పాఠాలను నేర్చుకున్నా. ప్రధాన కోచ్‌గా భారత డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చా. ఆటగాళ్లు ఎలా ఆలోచిస్తున్నారనేది అర్థం చేసుకున్నా. జీవితంలో ఇలాంటి ఒడుదొడుకులు సహజమే. వాటన్నింటినీ ఎదుర్కొని ముందుకు సాగా. అవకాశం అందిపుచ్చుకున్నా'' అని రవిశాస్త్రి తెలిపారు. కెప్టెన్ విరాట్ కోహ్లీ - రవిశాస్త్రి ద్వయం హయాంలో భారత్ విదేశాల్లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.

# అప్పుడు రోహిత్ - కేఎల్‌కు సాయం..

## ఇప్పుడు శ్రేయస్‌కూ బాసటగా ఈ 'మాజీ'!

అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో శ్రేయస్ అయ్యర్ తొలి సెంచరీ నమోదు చేశాడు. అదీనూ లక్ష్య ఛేదనకు దిగి ప్రత్యర్థి విండీస్‌పై ఎటాకింగ్ గేమ్‌తో అదరగొట్టాడు. శ్రేయస్ ప్రదర్శన వెనుక ఓ మాంత్రికుడు ఉన్నాడండోయ్. అతడే మాజీ కోచ్ అభిషేక్ నాయర్. ఇంతకుముందు రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్‌కూ అభిషేక్ సాయం చేసి కెరీర్‌లో పుంజుకోవడానికి దోహదపడ్డాడు. గతంలో టీమ్‌ఇండియాకు అసిస్టెంట్ కోచ్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాడు.
ఆసియా గేమ్స్ తర్వాత స్వదేశానికి వచ్చిన శ్రేయస్ అయ్యర్ వెంటనే వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు సిద్ధమయ్యాడు. స్వర్ణం నెగ్గినా.. జపాన్‌లో శ్రేయస్ గొప్పగా ఏమీ ఆడలేదు. తన టెక్నిక్‌పై అసంతృప్తితో ఉన్న శ్రేయస్‌ను అభిషేక్ నాయర్ కలిశాడు. అయ్యర్ ఇంటికి వెళ్లిన అభిషేక్ దాదాపు రెండు గంటలపాటు ఉన్నాడు. బ్యాటింగ్‌పై వర్కౌట్ చేశారు. దానికి ప్రతిఫలం విండీస్‌తో సూపర్ సెంచరీతో వచ్చేసింది. కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 4 సిక్స్‌ల సాయంతో 102 పరుగులు చేసి అజేయంగా



నిలిచాడు. భారత్ తరఫున 67 టీ20లు ఆడినప్పటికీ ఇదే తొలి సెంచరీ కావడం గమనార్హం. ''ఆసియా గేమ్స్ ముగిసిన తర్వాత తన టెక్నిక్‌పై శ్రేయస్ అసంతృప్తిగా ఉన్నాడు. బంతిని బాదేందుకు ఎక్కువ ఫోర్స్‌ను జనరేట్ చేయడంలో ఇబ్బంది పడుతున్నట్లు గ్రహించాడు. అందుకే, బంతిని బౌండరీలకు తరలించలేకపోయాడు. దీంతో అతడి గ్రిప్, బ్యాట్ కదలికలపై కాసేపు వర్కౌట్ చేశాం. టెక్నిక్‌ను ఇంప్రూవ్ చేసుకొనేందుకు ప్రయత్నించాడు. కేవలం మాట్లాడితేనే కాదు.. అందుకు సంబంధించిన డెమో చూశాం. ప్రాక్టీస్ చేయకుండా టెక్నికల్‌లో మార్పులు చేయలేం. శ్రేయస్‌కు సత్తా లేదని కాదు. బంతిని వేయకముందే ఓ నిర్ధరణకు వచ్చేస్తాడు. అలా కాకుండా బంతిని బట్టి టెక్నిక్‌ను మార్చుకోవాలి. రాంచీలోనూ లఖ్‌నవూ పిచ్‌కు భిన్నంగా ఏమీ ఉండదు. ఇక్కడా రాణిస్తాడని అనుకుంటున్నా. శ్రేయస్ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించడం ఆనందంగా ఉంది'' అని అభిషేక్ తెలిపాడు. అభిషేక్ నాయర్‌తో సంభాషణ తనకు ఎంతో ఉపయోగపడిందని శ్రేయస్ కూడా వెల్లడించాడు. ''అభిషేక్‌తో చిన్నపాటి సంభాషణ జరిగింది. క్రికెట్ గురించే మాట్లాడుకున్నాం. అతడితో మాట్లాడిన తర్వాత బాగా అనిపించింది. విండీస్‌తో మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శనకు ఆ సంభాషణ సాయపడింది. బంతిని ఎదుర్కొనే తీరును మార్చుకున్నా'' అని శ్రేయస్ పేర్కొన్నాడు.

# "రణబాలి" ట్రైలర్ రిలీజ్ ఈవెంట్




**వుదయం సినిమా:** విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా "రణబాలి" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. హైదరాబాద్ లో ఘనంగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిపారు. ఈ కార్యక్రమంలోప్రొడ్యూసర్ నవీన్ యెర్నేని మాట్లాడుతూ – మా "రణబాలి" సినిమా ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాము. ఇలాంటి గొప్ప కథ మా దగ్గరకు వచ్చినందుకు సంతోషిస్తున్నాం. రాహుల్ ఈ కథ చెప్పగానే చాలా ఎగ్జైట్ అయ్యాం. మాకు కథ చెప్పినదాని కంటే బాగా సినిమాను రూపొందించాడు. విజయ్ గారికి ఇది పర్ఫెక్ట్ మూవీ. ఇందులో విజయ్ నట విశ్వరూపం చూపించారు. విజయ్ రశ్మిక పెళ్లయ్యాక జంటగా మా సినిమాలో నటించడం అదృష్టంగా భావిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ మూవీలో బాగా నటించారు. ప్రేక్షకులకు "రణబాలి" ఒక మంచి ఎక్స్పీరియన్స్ లా ఉంటుంది. అరుదైన కథ ఇది. ప్రతి ఒక్కరూ మా సినిమాను ఇష్టపడతారు. ఈ నెల 16న థియేటర్స్ కు వచ్చి మా సినిమా చూడాలని కోరుతున్నా అన్నారు. ప్రొడ్యూసర్ రవిశంకర్ మాట్లాడుతూ – మా డైరెక్టర్ రాహుల్ ఎంతో రీసెర్చ్ చేసి డీటెయిల్స్ సేకరించి ఈ సినిమాను రూపొందించాడు. ఈ సినిమా కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. మీకు ఈ సినిమాలో కథా నేపథ్యానికి సంబంధించిన ప్రతి డీటెయిల్ ఆథెంటిక్ గా కనిపిస్తుంది. మీరు సినిమా చూస్తున్నంత సేపు "రణబాలి" ప్రపంచంలోకి వెళ్లిపోతారు. ఈ కథను పర్ఫెక్ట్ గా చేసుకునేందుకు రాహుల్ ఎంతో శ్రమించారు.

## వుదయం సినిమా

MOVIE TIME!

# 'భారతీయుడు3'.. త్వరలో షూటింగ్ షురూ



**వుదయం సినిమా:** యూనివర్సల్ హీరో కమల్ హాసన్, స్టార్ డైరెక్టర్ శంకర్, ప్రెస్టీజియస్ చిత్రాలను నిర్మిస్తోన్న భారీ నిర్మాణ సంస్థ కాంబోలో రూపొందుతోన్న చిత్రం 'భారతీయుడు3'. 1996లో విడుదలైన బ్లాక్ బస్టర్ మూవీకి స్వీకెల్గా భారతీయుడు2, భారతీయుడు 3 చిత్రాలను కమల్, శంకర్ కాంబోలో రూపొందించటానికి లైకా సంస్థ సిద్ధమైంది. అందులో భాగంగా 2024లో భారతీయుడు 2 విడుదలైన సంగతి తెలిసిందే. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా 'భారతీయుడు3'ను చిత్రీకరించటానికి మేకర్స్ సిద్ధమయ్యారు. ఇప్పటికే 'భారతీయుడు3'లో కొంత భాగాన్ని చిత్రీకరించారు. దానికి సంబంధించిన ఎడిటింగ్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. 10 రోజుల్లో 'భారతీయుడు3'కి సంబంధించిన మిగిలిన భాగాన్ని పూర్తి చేయటానికి షూటింగ్ను స్టార్ట్ చేయబోతున్నారు. త్వరలోనే రిలీజ్ డేట్ను కూడా అనౌన్స్ చేస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది. దీనికి సంబంధించిన పోస్టర్ను విడుదల చేసింది. ముగ్గురు వ్యక్తులు గుర్రాలపై వేగంగా వెళుతుంటే దుమ్ము, దూళి రేగుతున్నట్లుగా ఉండే ఫొటో క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. భారతీయుడు 3 ఎలా ఉండబోతుందనే విషయాన్ని భారతీయుడు 2 క్లైమాక్స్లో చూపించారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో డిఫరెంట్ కంటెంట్ చిత్రాలను రూపొందించటంతో పాటు స్టార్స్తో భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మిస్తూ తనదైన గుర్తింపు సంపాదించుకున్న సంస్థ లైకా ప్రొడక్షన్స్, అధినేత సుభాస్కరన్ ఇప్పుడు మరో ప్రెస్టీజియస్ మూవీగా 'భారతీయుడు3'ని మనకు అందించటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈసారి సేనాపతి లంచాన్ని అంతమొందించటానికి చేసే పోరాటం ఎలా ఉంటుందో బిగ్ స్క్రీన్పై చూసి ఎంజాయ్ చేయాల్సిందే.

# 'డాడా' షూటింగ్ విరామంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు



**వుదయం సినిమా:** హీరో మంచు మనోజ్ తన సతీమణి భూమా మౌనిక మంచు, కుమారుడు ధైరవ్ మరియు కుమార్తె దేవసేన శోభలతో కలిసి మైసూరులోని ప్రసిద్ధ చాముండి కొండలపై వెలసిన శ్రీ చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మనోజ్ దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. దర్శనానంతరం ఆలయ అధికారులు వారికి శేషవస్త్రాలు సమర్పించి, తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. మంచు మనోజ్ కుటుంబ సమేతంగా రావడంతో ఆలయ ప్రాంగణంలో భక్తులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వారిని పలకరించేందుకు ఆసక్తి చూపించారు. నటసింహం నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్లో రూపొందుతున్న భారీ యాక్షన్ చిత్రం 'డాడా' షూటింగ్ ప్రస్తుతం మైసూరు పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న మంచు మనోజ్, షూటింగ్ షెడ్యూల్ విరామంలో తన సతీమణి మౌనిక మరియు పిల్లలతో కలిసి ఆలయాన్ని సందర్శించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రముఖులు కూడా పాల్గొన్నారు.

# 'ది ట్రెయిటర్స్'కు హోస్ట్ చేయడం చాలా ఎంజాయ్ చేశాను..



హీరో తేజ సజ్జ

**వుదయం సినిమా:** భారత దేశంలో ప్రత్యేక ఒరిజినల్స్కు పేరుపొందిన ప్రముఖ స్ట్రీమింగ్ సర్వీస్ ప్రైమ్ వీడియో 'ది ట్రెయిటర్స్ తెలుగు' తో అలరించబోతోంది. ఈ నెల 15నుంచి ప్రతి గురువారం మధ్యాహ్నం 12గంటలకు కొత్త ఎపిసోడ్ విడుదల కానుంది. ఈ సందర్భంగా తేజ సజ్జా విలేకరుల సమావేశంలో షో విశేషాల్ని పంచుకున్నారు.

**వరుసగా సూపర్ హిట్ సినిమాలు చేస్తున్నారు కదా.. ది ట్రెయిటర్స్ కి హోస్ట్ గా మారడం ఎలా అనిపించింది?**

–ట్రెయిటర్స్ గ్లోబల్గా చాలా పెద్ద హిట్ ఫ్రాంచైజ్. 20కి పైగా దేశాల్లో, 25కి పైగా భాషల్లో చేశారు. హిందీలో కరణ్ జోహార్ గారు చేసినప్పుడు నాకు దాని గురించి పెద్దగా ఆలోచన లేదు. ఒక ఎపిసోడ్ చూడడం మొదలుపెట్టి రెండు రోజుల్లో మొత్తం సీజన్ పూర్తి చేశాను. నాకు అప్పుడే కాన్సెప్ట్, షో నచ్చింది.

**ఎన్ని రోజులు షూట్ చేశారు? హోస్ట్ క్యారెక్టర్ ఎలాంటి ఎక్స్పీరియన్స్ ఇచ్చింది?**

–11 రోజులు షూట్ చేశాం. మొత్తం పది ఎపిసోడ్లు. నేను హిందీ వెర్షన్ చూస్తున్నప్పుడు అందులో నాకు పార్టిసిపెంట్స్తో ఎలాంటి ఎమోషనల్ కనెక్షన్ లేదు. వాళ్లు ఎవరో కూడా నాకు పరిచయం లేదు. కాకపోతే ఇక్కడ ప్రగతి గారు, హర్షవర్ధన్ గారు, చిన్మయి గారు.. వీళ్లందరూ కూడా మనకి తెలిసిన వ్యక్తులు. వీళ్లు ఎలా బిహేవ్ చేస్తారో అనేది చాలా ఇంట్రెస్టింగ్గా ఉంటుంది.

**గేమ్ షో ఎలా ఉండబోతుంది?**

ఇందులో మొదటి మూడు ఎపిసోడ్లు వస్తాయి. ఆ మూడు ఎపిసోడ్లు చూసిన తర్వాత ఈ గేమ్ షోపై ఒక క్లారిటీ వచ్చేస్తుంది. ఇదంతా ఒక మర్డర్ మిస్టరీ లాగా ఉంటుంది. .తెలుగులో ఇప్పటివరకు చూసిన ఏ రియాలిటీ షోతో దీనికి పోలిక ఉండదు. చాలా కొత్త ఫార్మాట్. నిజంగా ఒక రియల్ గేమ్లాగా ఉంటుంది. ఫుట్ బాల్, చెస్.. ఎలా అయితే కొన్ని రూల్స్ ప్రకారం కంప్లీట్ గేమ్లాగా ఉంటాయో.. ఈ రియాలిటీ షో కూడా కంప్లీట్ గా ఒక గేమ్లాగా ఉంటుంది.

**ఇది కొత్త గేమ్ షో అంటున్నారు కదా?**

ప్రేక్షకులకు ఈజీగా అర్థమవుతుందా?మొదటి మూడు ఎపిసోడ్లు రిలీజ్ అవుతాయి. ఆ మూడు ఎపిసోడ్లు చూస్తే అసలు ఏం, ఎలా ఉండబోతుందో ఒక క్లారిటీ వచ్చేస్తుంది. ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమానించాలి? ఎవరు ట్రెయిటర్స్? ఎవరు అమాయకులు? అనే కోణంలో నడిచే ఈ గేమ్ ఒక థ్రిల్లర్ లా వుంటుంది.

**ఇందులో కంటెస్టెంట్స్ను ఎలా సెలెక్ట్ చేశారు?**

–దీనికిగేమ్ ఆడే వాళ్లు చాలా ముఖ్యం. మానిపులేట్ చేయగలగాలి, నమ్మించగలగాలి, గేమ్స్లోని రూల్స్ తెలిసి ముందుకెళ్లగలగాలి. దాదాపు అన్ని రంగాల్లో ఉన్న వాళ్లని ఒక్కొక్కరుగా సెలెక్ట్ చేయడం జరిగింది. సెలబ్రిటీగా ఉండటం అనేది దీని ప్రియారిటీ కాదు. గేమ్ ఆడటం అనేది ప్రియారిటీ.

# "గుడ్ టైమ్" సినిమా ప్రీ రిలీజ్

**వుదయం సినిమా:** ఎకో క్రాఫ్ట్ మీడియా సమర్పణలో, మూవీ బ్రాట్స్ బ్యానర్ పై రమేష్ జిల్లా నిర్మాతగా, చాణక్య జిల్లా దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా "గుడ్ టైమ్". ఈ చిత్రంలో నిఖిల్ గాజుల, అన్యుక్త నలాని, హృతిక్ శెట్టి, ధనరాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. "గుడ్ టైమ్" సినిమా ఈ నెల 9న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. డైరెక్టర్ అనిల్ విశ్వనాథ్, హీరోయిన్ కామాక్షి భాస్కర్ల అతిథులు గా బుధవారం ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ దినేష్ కార్తీక్ మాట్లాడుతూ – మా చిత్రం టీజర్, ట్రైలర్ మీరు చూశారు. టీజర్, ట్రైలర్ మీకు బాగా నచ్చాయి. ఇక మా మూవీని థియేటర్స్ లో చూడటమే మిగిలిఉంది. ఈ నెల 9న థియేటర్స్ కు వచ్చి మా సినిమాను సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు.రైటర్ అభిరామ్ మాట్లాడుతూ – ఒక యావరేజ్ కుర్రాడి పీడకల ఈ సినిమా. అది ఎలా ఉంటుందో మీరే థియేటర్స్ లో చూడబోతున్నారు. మా టీమ్ ను ఎంకరేజ్ చేస్తారని ఆశిస్తున్నాం. అన్నారు. ఎడిటర్ సాయి తరుణ్ మాట్లాడుతూ – మా సినిమా మీకు రెండు గంటలు ఎంటర్ టైన్ మెంట్ అందిస్తుంది. ఎక్కడా బోర్ కొట్టదు. మంచి కంటెంట్ ను నమ్మి మేమంతా సినిమా చేశాం. థియేటర్స్ లో మా మూవీ చూడండి.



# 'రామాయణ'లో అయోధ్య రాజు దశరథుడిగా అరుణ్ గోవిల్ ఫస్ట్ లుక్ రిలీజ్

**వుదయం సినిమా:** 'రామాయణ' మేకర్స్ అరుణ్ గోవిల్ దశరథుడిగా నటిస్తున్న ప్రత్యేక సోలో పోస్టర్ను విడుదల చేశారు. ఐకానిక్ రాముడి పాత్రతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న అరుణ్ గోవిల్కు ఇది మరో ముఖ్యమైన అధ్యాయంగా నిలవనుంది.తాజాగా విడుదల చేసిన పోస్టర్లో అరుణ్ గోవిల్ అయోధ్య రాజు దశరథుడి పాత్రలో కనిపిస్తున్నారు. శ్రీరాముడి తండ్రి, అయోధ్య రాజుగా ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ను ఈ పోస్టర్ ద్వారా పరిచయం చేశారు. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ ఇతి హాస చిత్రంలో అరుణ్ గోవిల్ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తి ని పెంచుతోంది. ఇప్పటికే ఆయన శ్రీరాముడిగా కోట్లాది మంది భారతీయ ప్రేక్షకుల మనసుల్లో చెరగ ని ముద్ర వేశారు.దేశ వ్యాప్తంగా శ్రీరాముడి పాత్ర లో ఎంతో పేరు తెచ్చుకున్న అరుణ్ గోవిల్.. ఇప్పు డు రాముడి తండ్రి, అయోధ్య రాజు దశరథుడి పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్రకు ఆయన ఎంపిక కావడం సినిమాకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఈ ఇతిహాసం తో ఎంతో ప్రత్యేకమైన అనుబంధం ఉన్న నటుడు ఇప్పుడు అదే కథలో మరో కీలకమైన పాత్ర లో కనిపించనున్నారు. మేకర్స్ తమ సోషల్మీడియాలో ఈ కొత్త పోస్టర్ను విడుదల చేస్తూ.. "ఒక తరం కోసం ఆయన రాముడికి ప్రాణం పోశారు. ఇప్పుడు 'రామాయణ' ప్రపంచంలోకి అయోధ్యరాజుగా తిరిగివస్తున్నారు. దశరథుడిగా అరుణ్గోవిల్" అంటూ పోస్టర్ ను పంచుకున్నారు. ఈ పోస్టర్లో అయోధ్య రాజు దశరథుడి హోదా, అధికారాన్ని ప్రతిబింబించేలా అరుణ్గోవిల్ లుక్ను తీర్చిదిద్దారు. ఇన్నాళ్లుగా రాముడిపాత్రలో చూసి న ప్రేక్షకులకు.. ఇప్పుడు అదేపాత్రకు తండ్రి అయిన దశరథుడిగా ఆయన కనిపించనుండటం ఆసక్తికరమైన మార్పుగా నిలవనుంది.



# 'బా బా బ్లాక్ షీప్'కు మేఘాలయ సీఎం కాన్రాడ్ కె. సంగ్మా ప్రశంసలు



**వుదయం సినిమా:** పూర్తిగా మేఘాలయలో చిత్రీకరించిన తెలుగు క్రైమ్–కామెడీ 'బా బా బ్లాక్ షీప్' 2026 అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ రిలీజ్కు సిద్ధమైంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, టీజర్, రెండు పాటలు ప్రేక్షకులను మెప్పించాయి. ఈ నేపథ్యంలో మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె. సంగ్మా.. బా బా బ్లాక్ షీప్ చిత్ర యూనిట్ను ప్రత్యేకంగా అభినందిస్తూ వీడియో విడుదల చేశారు. "ఇది మా రాష్ట్రానికి గర్వకారణమైన క్షణం" అని పేర్కొంటూ.. మేఘాలయలో పూర్తిగా చిత్రీకరించిన తొలి దక్షిణ భారత చలనచిత్రం ఇదేనని, ఇది రాష్ట్ర అందాలను మన కొండలకు ఆవల ఉన్న ప్రేక్షకులకు చేరువ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. పొగతో నిండిన మంచు కొండలు, అద్భుతమైన జలపాతాలు, స్వచ్ఛమైన నదులు, సజీవ వేర్ల వంతెనలను ఆయన ప్రస్తావిస్తూ.."మన నేలను ప్రపంచంతో పంచుకునేందుకు సినిమా మరో చక్కని అవకాశం" అని చెప్పారు.నిర్మాత వేణు దోనేపూడికి, చిత్రాలయం స్టూడియోస్ కు, నటీనటులకు, సాంకేతిక బృందానికి సంగ్మా అభినందనలు తెలిపారు. "సినిమా చిత్రీకరణ కోసం మేఘాలయ రాష్ట్రాన్ని ఎంచుకున్నందుకు, నమ్మకం ఉంచినందుకు, దాని అందాలను వెండితెరపైకి తెచ్చినందుకు ధన్యవాదాలు" అన్నారు. సినిమా నిర్మాణం రాష్ట్ర యువతకు, స్థానిక సమాజాలకు అవకాశాలనిస్తుందని, వారు తమ ప్రతిభను చాటుకునేందుకు, కొత్త నైపుణ్యాలు నేర్చుకునేందుకు వీలు కల్పిస్తుందని ఆయన చెప్పారు. మరింత మంది సినీ నిర్మాతలను రాష్ట్రానికి ఆహ్వానించేందుకు ఎదురుచూస్తున్నామని సంగ్మా పేర్కొన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.